www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
25-10-2024
సంపుటి : 01 | సంచిక : 173 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

సీజేఐగా
జస్టిస్ సంజీవ్ ఖన్నా
## నియామకం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం
- వచ్చే నెల 11 నుంచి అమలులోకి
- ఆ రోజు 51వ సీజేఐగా పదవీ బాధ్యతల స్వీకరణ

2




భద్రతా మండలిలో
భారత్‌కు శాశ్వత
సభ్యత్వం
## ఇవ్వాలి

- ఐరాసలో సంస్కరణలు తక్షణ అవసరం
- బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఎస్.జైశంకర్

2





మాది ఉద్యోగుల
# ఫ్రెండ్లీ ప్రభుత్వం

## మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ఉద్యోగ సంఘాల జేఏసీతో సీఎం సుదీర్ఘ చర్చలు

డీఏలపై నిర్ణయం ప్రకటిస్తాం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉంది

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు



**విశ్వంభర, హైదరాబాద్**

డిమాండ్ల సాధన కోసం పోరుకు సిద్ధమవుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. రెండేళ్ల నుంచి పెండింగులో ఉన్న అయిదు డీఏలు విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు సీఎంను కోరారు. పెండింగులో ఉన్న బిల్లులను...

మిగతా2లో...

దక్షిణ మధ్య రైల్వేలో 90 శాతం లైన్ల
# విద్యుదీకరణ

రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం

యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు

మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2




ఉద్యోగుల సమస్యలపై
## మంత్రివర్గ ఉపసంఘం

- అధ్యక్షునిగా డిప్యూటీ సీఎం భట్టి , సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం
- 317 జీవోపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్**

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షుడిగా, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా.. కె.కేశవరావు ప్రత్యేక ఆహ్వానితుడిగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పెండింగ్ డీఏలపై..

మిగతా2లో...



మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం
# దేనికి?

- గత సీఎం.. సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా?
- ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నాం
- బీజేపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుంది
- ఎంపీ ఈటల రాజేందర్

2



రూ.45,300 కోట్లతో నాలుగు
## గ్రీన్‌ఫీల్డ్ రహదారులు

చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలి

ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ మారనుంది

ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయి

ఏపీ సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి**

రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని, 6 ప్రాజెక్టులు బిడ్డింగ్ దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 15 ప్రాజెక్టులు నిలిచిపోయాయని,

మిగతా2లో...



రాష్ట్రంలో షూ తయారీ
## పరిశ్రమ ఏర్పాటు చేస్తాం

- 750 ఎకరాలు కేటాయించండి
- రూ.300 కోట్లతో అత్యాధునిక షూ ఉత్పత్తి కేంద్రం
- కొరియన్ కంపెనీ షూ ఆల్స్ ప్రతిపాదన
- మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఛైర్మన్ చెవోంగ్ లీ

2



మరిన్ని తాజా వార్తల కోసం
స్కాన్ చేయండి



2

భవిష్యత్‌లో తెలంగాణలో
## సొంతంగా సీడ్ గార్డెన్

- ఏర్పాటుకు అవకాశాలు పరిశీలిస్తున్నాం
- ఎఫ్‌జీవీ కంపెనీ సహకరించాలి
- మలేసియాలో మంత్రి తుమ్మల



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 120 | ₹ 142 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹206 | ₹234 |

గత ప్రభుత్వ కుంభకోణాల్లో ఏదో ఒకటి
## పేలుతుంది

- మేం హైదరాబాద్‌లో దిగేలోపే జరుగుతుంది
- వారిని ఏం చేయాలో చట్టం చూసుకుంటుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2



రైతుల కోసం
## ఎంత దూరమైనా వెళతాం

- జైలుకు వెళ్లేందుకూ సిద్ధమే
- హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశ్వంభర, ఆదిలాబాద్**

రైతుల కోసం ఎంత దూరమైనా వెళ్లి పోరాడతామని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జైలుకు వెళ్లేందుకూ సిద్ధమని చెప్పారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు పోరుబాట' కార్యక్రమంలో ఆయన..

మిగతా2లో...



# సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకం

**ఢిల్లీ:** భారత సుప్రీంకోర్టు తర్వాతి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు. ప్రస్తుతం సీజేఐగా జస్టిస్ డీవై చంద్రచూడ్ నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆయన తర్వాతి సీజేఐగా సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదిస్తూ సిఫారసు చేశారు. ఈ క్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలుపడంతో జస్టిస్ ఖన్నా నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. సీజేఐగా జస్టిస్ ఖన్నా పదవీకాలం నవంబర్ 11 నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. అదే రోజున ఆయన భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన 2025 మే 13 వరకు అంటే దాదాపు ఏడునెలలు సీజేఐగా కొనసాగనున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీజేఐ డీవై చంద్రచూడ్ తర్వాత రెండో సీనియర్ న్యాయమూర్తి ఆయనే. ఇటీవల ఆయన పేరును సిఫారసు చేస్తూ కేంద్రానికి లేఖ రాశారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా... జస్టిస్ ఖన్నా జనవరి 18, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అంతకు ముందు ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేశారు. జస్టిస్ ఖన్నా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హన్సరాజ్ ఖన్నా మేనల్లుడు. జస్టిస్ సంజీవ్ ఖన్నా 14 మే 1960న జన్మించారు. ఆయన తండ్రి దేవరాజ్ ఖన్నా సైతం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయడం విశేషం. ఆయన తల్లి సరోజ్ ఖన్నా ఎల్ఎస్ఆర్ డీయూలో లెక్చరర్‌గా సేవలందించారు. ఆయన ఢిల్లీ యూనివర్సిటీలోని క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. గ్రాడ్యుయేషన్ తర్వాత 1983లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఢిల్లీలోని తీస్ హజారీ క్యాంపస్‌లో ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టులో వివిధ రంగాల్లో ప్రాక్టీస్ చేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా.. ఆ తర్వాత 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006 నుంచి 2019 వరకు హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేశారు. జనవరి 18, 2019న భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

**సీజేఐ కార్యాలయానికి సైతం ఆర్టీఐ చట్టం వర్తింపు...**

జస్టిస్ ఖన్నా 2019లో రాజ్యాంగ ధర్మాసనం తరపున ప్రధాన తీర్పును వెలువరించారు. సీజేఐ కార్యాలయానికి సైతం ఆర్టీఐ చట్టం వర్తిస్తుందని తెలిపారు. అమిష్ దేవగన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియాలో జస్టిస్ సంజీవ్ ఖన్నా తీర్పు విద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడం గమనార్హం. 2021లో సెంట్రల్ విస్టా ప్రాజెక్టు అవసరమైన ప్రక్రియలను పాటించలేదంటూ తప్పుపట్టారు. ముగ్గురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో మరో ఇద్దరు న్యాయమూర్తులతో వ్యతిరేకిస్తూ తీర్పు చెప్పారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ బెయిల్ దరఖాస్తులకు సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశాలపై విచారణ జరిపారు. 2023లో మనీష్ సిసోడియాకు బెయిల్ నిరాకరించినప్పటికీ విచారణను త్వరగా పూర్తి చేయాలని బెంచ్ ఆదేశించింది. సంజయ్ సింగ్ కేసులో జస్టిస్ ఖన్నా బెంచ్ నుంచి పలు కీలమైన ప్రశ్నలు ఎదుర్కొన అనంతరం ఈడీ బెయిల్‌కు అంగీకారం తెలిపింది. ఈ ఏడాది మేలో జస్టిస్ ఖన్నా ధర్మాసనం ఎన్నికల ప్రచారం నిమిత్తం అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. జూలైలో జస్టిస్ ఖన్నా ధర్మాసనం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా నిరోధించేందుకు పీఎంఎల్ఏ కింద అరెస్టు చేయడానికి మరిన్ని కారణాలను చేర్చాల్సిన అవసరాన్ని పరిశీలించేందుకు ఈ అంశాన్ని బెంచ్‌కు సిఫారసు చేశారు. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం ఈవీఎంవీవీపీఏటీ వ్యవహారంపై కూడా విచారణ జరిపింది. ఆర్టికల్ 370తో పాటు ఎలక్టోరల్ బాండ్స్ కేసులకు సంబంధించిన రాజ్యాంగ ధర్మాసనంలోనూ ఆయన ఒకరు.

## దక్షిణ మధ్య రైల్వేలో 90 శాతం లైన్ల విద్యుదీకరణ

**మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**విశ్వంభర, సికింద్రాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచామన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్‌రావు పాల్గొన్నారు. పలు సమస్యలను వారు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు. కొల్లూరు, ఈదుల నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్‌కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.

## గత ప్రభుత్వ కుంభకోణాల్లో ఏదో ఒకటి పేలుతుంది

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అనేక కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే టపాసులా పేలుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో అనేక అవకతవకలు జరిగాయని ఫోన్ ట్యాపింగ్, ధరణి, ఇతర నాలుగైదు కుంభకోణాలు చేశారన్నారు. వారిని అరెస్టు చేయాలా? లేదా జీవిత కాలం జైల్లో పెట్టాలా? అనేది చట్టం చూసుకుంటుందని మంత్రి తెలిపారు. ఆస్తుల రికవరీ కూడా చట్టమే చూసుకుంటుందన్న పొంగులేటి, అది ప్రభుత్వ నిర్ణయం కాదని స్పష్టం చేశారు. తాతలు, తండ్రుల ఆస్తుల్లాగా చట్టాలను అతిక్రమించి వారు ఫలితాలు అనుభవించారని ఆరోపించారు. నాలుగో రోజు దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న రాష్ట్ర ప్రతినిధుల బృందం, మూసీ సుందరీకరణ తదితర అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేస్తుంది. 'గత ప్రభుత్వంలో అనేక అవకతవకలు జరిగాయి. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. కొందరు డబ్బులకు ఆశపడి ధరణి, ఇతర నాలుగైదు కుంభకోణాలు చేశారు. కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే టపాసులా పేలుతుంది. మేము సియోల్ నుంచి హైదరాబాద్‌లో దిగేలోపే పేలుతుంది. అరెస్టు చేయాలా, జీవిత కాలం జైల్లో పెట్టాలా అనేది చట్టం చూసుకుంటుంది. ఆస్తుల రికవరీ కూడా చట్టమే చూసుకుంటుంది. మా నిర్ణయం కాదు. తాతలు, తండ్రుల ఆస్తుల్లాగా చట్టాలను అతిక్రమించి సంపాదించారు. చట్టాలు అతిక్రమించిన వారు ఫలితాలు అనుభవిస్తారు."

సియోల్ నగరంలో హాన్ నది సందర్శన

దక్షిణ కొరియాలో గత నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్ర మంత్రులు పర్యటిస్తున్నారు. అధికారులు ఆ దేశ రాజధాని సియోల్‌లో ముఖ్యమైన హాన్ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌ను ఇటీవల సందర్శించారు. అక్కడ కాలుష్యంలో ఉన్న హాన్ నదిని దక్షిణ కొరియా శుభ్రపరచి మంచి నీటి సరస్సుగా పునరుద్ధించింది. ప్రక్షాళన తర్వాత హాన్ నది ఇప్పుడు సియోల్ నగరానికి ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా, జల వనరుగా ఏర్పడింది. ఈ క్రమంలో హాన్ నదిని గమనించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దశల వారీగా మూసీ ప్రక్షాళన చేసి తీరతామని, పరీవాహకంలో నివసించే ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తామని తెలిపారు.

## భవిష్యత్‌లో తెలంగాణలో సొంతంగా సీడ్ గార్డెన్

**మలేసియాలో మంత్రి తుమ్మల**

**విశ్వంభర, హైదరాబాద్:** భవిష్యత్తులో తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మలేసియా పర్యటనలో ఉన్న మంత్రి.. రెండో రోజు పలు సంస్థలను సందర్శించారు. ప్రపంచంలో అతి పెద్ద వ్యాపార ఆధారిత క్రూడ్ పామాయిల్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎఫ్‌జీవీ కంపెనీ సీడ్ గార్డెన్‌ను సందర్శించారు. నర్సరీలను, అధునాతన సాంకేతిక పద్ధతులతో ఉన్న విత్తన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహకరించాలని కోరారు. అందుకు రాష్ట్ర భాగస్వామ్యంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎఫ్‌జీవీ కంపెనీ రిఫైనరీ కర్మాగారాన్ని సందర్శించి అక్కడ తయారు చేసే వివిధ ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. కంపెనీ తీసుకునే జాగ్రత్తలు, వివిధ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్ గురించి మంత్రి తుమ్మలతో పాటు అధ్యయన బృందానికి ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

## రైతుల కోసం ఎంత దూరమైనా వెళతాం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. అక్రమంగా కేసులు పెట్టి వేధించే అధికారుల పేర్లు రాసిపెట్టాలని పార్టీ నేతలకు కేటీఆర్ సూచించారు. ''ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదు. మహిళలకు తులం బంగారం, రైతులకు రూ.15వేల రైతు భరోసా ఇస్తామని మోసం చేశారు. రుణమాఫీ చేయలేదు. కాంగ్రెస్ నేతలను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారని ప్రజలు పోలీస్‌స్టేషన్ల ముందు క్యూ కడితే మీ పరిస్థితేంటి? అధికారులు న్యాయం, ధర్మం ప్రకారం ముందుకెళ్లాలి. పైనుంచి వచ్చే ఒత్తిడులతో ఇష్టారీతిన వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అలాంటి అధికారులకు మిత్తితో సహా చెల్లిస్తాం'' అని కేటీఆర్ అన్నారు.



## మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి)

క్లియర్ రద్దు, ఈకుబేర్ వ్యవస్థ రద్దు, ఉద్యోగులు, పెన్షనర్ల సమాన వాటాతో ఈహెచ్ఎస్ అమలు చేయాలని కోరారు.

సీపీఎస్, యూపీఎస్ వద్దని.. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, జీవో 317 ప్రకారం బాధితులు కోరుకున్న చోటుకు బదిలీ చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీపావళి తర్వాత శాఖల వారీగా ఉద్యోగులతో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై సమస్యల పరిష్కారానికి సిఫార్సు చేస్తుందని తెలిపారు. డీఏలపై నిర్ణయం ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎం చెప్పినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉందని ఈ సందర్భంగా ఉద్యోగులతో సీఎం అన్నట్లు సమాచారం. నెలవారీ ఆదాయం తగ్గిందని, అందులో ఉద్యోగుల వేతనాలు, అప్పులపై వడ్డీలకే సగం ఖర్చవుతోందని వివరించినట్లు తెలుస్తోంది. కొన్ని ఆర్థిక పరమైన డిమాండ్లపై ఉద్యోగులు కూడా అర్థం చేసుకోవాలని కోరినట్లు సమాచారం.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షుడిగా, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా కె.కేశవరావు ప్రత్యేక ఆహ్వానితుడిగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పెండింగ్ డీఏలపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## రాష్ట్రంలో షూ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం

**మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఛైర్మన్ చెవోంగ్ లీ**

**విశ్వంభర, హైదరాబాద్ :** మెడికల్, స్మార్ట్ బూట్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న షూ ఆల్స్ కొరియన్ కంపెనీ తెలంగాణాలో కర్మాగారం ఏర్పాటు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేసిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 750 ఎకరాలు కేటాయిస్తే రూ.300 కోట్లతో అత్యాధునిక షూ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పుతామని షూ ఆల్స్ ప్రతినిధులు కోరినట్టు ఆయన వెల్లడించారు. కొరియా నుంచి వచ్చిన షూ ఆల్స్ ఛైర్మన్ చెవోంగ్ లీతో పాటు సంస్థ ప్రతినిధులు గురువారం శ్రీధర్ బాబును సచివాలయంలో కలిసి 87 వేల మందికి ఉద్యోగావకాశాలు దక్కే "గిగా ఫ్యాక్టరీ" ప్రతిపాదనను ఆయన ముందుంచారు. అడుగు భాగాన (సోల్స్) మెడికల్ చిప్ ఉండే బూట్లు, పది వేల అడుగులు వేస్తే గంటకు 25 వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే షూతో పాటు డయాబెటీస్, ఆర్థరైటిస్ ఉన్న వారికి ఉపశమనం, స్వస్థత కలిగించే పలు రకాల ఉత్పత్తుల తయారీ కోసం 750 ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారని శ్రీధర్ బాబు వెల్లడించారు.

**షూ ఆల్స్ ప్రతిపాదనకు అత్యంత ప్రాధాన్యం**


షూఆల్స్ అభ్యర్థన అత్యంత ప్రాధాన్యమైనదిగా భావించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. భారీ కర్మాగారం నెలకొల్పి ఇక్కడి నుంచే దేశీయ అవసరాలకు, అమెరికాతో పాటు ప్రపంచ మార్కెట్లకు షూ సరఫరా చేస్తారని వివరించారు. బూట్ల తయారీలో జంతువుల చర్మాన్ని వినియోగించడం వల్ల ట్యానరీలు అవసరమవుతాయని, ఇలా యాన్సిలరీ పరిశ్రమలతో అనేక మందికి ఉపాధి దొరుకుతుందని మంత్రి వెల్లడించారు. ప్రపంచ మార్కెట్లకు తెలంగాణా హబ్ గా మారుతుందని అన్నారు. అడుగు భాగాన జీపీఎస్ ఉండే షూల వల్ల పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ట్రాక్ చేయవచ్చని తెలిపారు. ఈ షూ ధరించిన వారు యాక్సిడెంట్ కు గురి అయినా, మరే ఆపదలో చిక్కుకున్నా కుటుంబ సభ్యులకు సిగ్నల్స్ వెళ్లే ఏర్పాటు ఉందని వివరించారు.

5000 ఎకరాలు కేటాయిస్తే స్మార్ట్ హెల్త్ సిటీ ఏర్పాటు

అమెరికాలోని జాన్ హాప్కిన్స్‌లాంటి ప్రఖ్యాత హాస్పిటళ్లను తీసుకురావడంతో పాటు పాటు పరిశోధన కేంద్రాలు, బయో మెడికల్ సెంటర్లు, యాన్సిలరీ పరిశ్రమల కోసం 5,000 ఎకరాలు కేటాయిస్తే ఏషియాలో ఎక్కడా లేని విధంగా స్మార్ట్ హెల్త్ సిటీని నెలకొల్పే ప్రతిపాదన కూడా కొరియా బృందం చేసిందని శ్రీధర్ బాబు తెలిపారు. స్మార్ట్ హెల్త్ సిటీ ఏర్పాటుతో లక్షల సంఖ్యలో ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని వివరించినట్లు మంత్రి వెల్లడించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేసే పక్షంలో ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పినట్టు తెలిపారు. షూఆల్స్ కొరియన్ బృందంలో ఇన్హీ లీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇండియా) డాంగ్ యివోప్ కిమ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జేహెన్ పార్క్ లు ఉన్నారు.

## భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలి

**మాస్కో:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన అవసరం ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. మరింత సమానమైన ప్రపంచ క్రమాన్ని సృష్టించేందుకు ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు తక్షణ అవసరమని ఉద్ఘాటించారు. రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు రోజున ప్రసంగించిన ఆయన ప్రపంచ క్రమం రూపాంతరం చెందుతున్న తీరుకు బ్రిక్స్ ఓ ఉదాహరణ అన్నారు. ''ప్రపంచక్రమం ఎంత తీవ్రంగా రూపాంతరం చెందుతుందో బ్రిక్స్ తెలియజేస్తుంది. ఇదే సమయంలో గతంలోని అనేక అసమానతలు కూడా కొనసాగుతున్నాయి. వాస్తవానికి, కొత్త రూపాలను, గుణాలను ఆయా దేశాలు స్వీకరించాయి. అభివృద్ధి వనరులు, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడాన్ని మనం చూడవచ్చు. ప్రపంచీకరణ ప్రయోజనాలు అసమానంగా ఉన్న విషయాన్ని గుర్తించాలి'' అని ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి, అనేక సంక్షోభాలు గ్లోబల్ సౌత్‌పై మరింత భారం మోపాయన్న ఆయన.. ఆరోగ్యం, ఆహారం, ఇంధన భద్రతకు సంబంధించిన ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను గుర్తించడంలో ప్రపంచం గణనీయంగా వెనకబడిపోయే ప్రమాదం ఉందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సమానమైన ప్రపంచ క్రమాన్ని సృష్టించడం కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచించిన ఆయన.. అత్యున్నత సంస్థల యంత్రాంగాలను సంస్కరించాలన్నారు. ప్రత్యేకంగా ఐరాస భద్రతా మండలిలోని శాశ్వత, తాత్కాలిక విభాగాల్లో తక్షణ సంస్కరణలు అవసరమని బ్రిక్స్ వేదికగా ఉద్ఘాటించారు.



బాలాపూర్ మండల పరిధి గుర్రంగూడలోని చిప్ప వెంకటేశ్వరగార్డెన్స్‌లో కోటగిరి వారి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు స్వాతి - విక్రంలను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక అధినేత డా. కాచం సత్యనారాయణ, కాచం సాయి, ఏలే మహేష్, మేడికొండ పరమేష్, ఇరుగు శ్రీధర్, గణేష్ తదితరులు.

- విశ్వంభర, బడంగ్‌పేట్

## రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారులు

**ఏపీ సీఎం చంద్రబాబు**

(మొదటి పేజీ తరువాయి)

75 ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యలు, 23 ప్రాజెక్టులకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నాయన్నారు. మొత్తం 95 ప్రాజెక్టులకు వివిధ సమస్యలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరుకడపవిజయవాడ ఎక్స్‌ప్రెస్ వేకు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 15 రోజుల్లో పర్యావరణ అనుమతులు సాధించాలన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు రూ.18 వేల కోట్లతో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండున్నరేళ్లలో రూ.50 వేల కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరగనుందన్నారు. ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ మారనుందని తెలిపారు. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపిస్తోంది..

''ఆస్తిలో వాటా ఇవ్వనంటూ తల్లి, చెల్లిని జగన్ రోడ్డుపైకి లాగారు. మమ్మల్ని నిందిస్తూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. జగన్ లాంటి వ్యక్తులతో రాజకీయాలు చేస్తాననుకోలేదు. ఆస్తిలో వాటా ఇవ్వాలంటే జగన్‌ను విమర్శించకూడదని షరతు పెట్టారు. ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపిస్తోంది. వైకాపాలో ఉన్నామని చెప్పుకొనేందుకు ఆ పార్టీ నేతలు సిగ్గుపడుతున్నారు. జగన్ ప్రభుత్వం దాచిపెట్టిన చీకటి జీవోలపై విచారణ జరిపిస్తాం. చీకటి జీవోల్లోని అక్రమాలు నిగ్గుతేల్చి గత తప్పిదాలు సరిదిద్దుతాం'' అని సీఎం తెలిపారు.

## ఉద్యోగుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. దీపావళి తర్వాత శాఖల వారీగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై చర్చిస్తుందని సీఎం తెలిపారు. జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు.

## మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికి?

**ఎంపీ ఈటల రాజేంధర్**

**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికి? అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. మూసీ విషయంలో ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును బీజేపీ ఖండిస్తోందన్నారు. బీజేపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. ''డీపీఆర్ లేకుండా మార్కింగ్ ఎట్లా చేస్తావ్ రేవంత్.. నిన్ను ఎన్నుకుంటే పేదల బతుకు ఇట్లా ఆగం చేస్తావా? గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట క్రమబద్ధీకరణ చేసింది. వాటిని బీఆర్ఎస్ స్థిరాస్తి వ్యాపారులు పేదలకు విక్రయించారు. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నేతలే మొసలి కన్నీరు కారుస్తున్నారు. చెరువులన్నీ క్లీన్ చేయండి అభినందిస్తాం. డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చూడండి. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు. అందులో విష రసాయనాలు కలుస్తున్నాయి. వాటిని అరికట్టి డైవర్షన్ చెయ్యి చాలు. ఎక్కడైనా ఎస్టీపీలు పనిచేస్తున్నాయా? పనిచేస్తే ఇంకా దుర్గంధం ఎందుకుంది. గత సీఎం హుస్సేన్ సాగర్‌ను ఎందుకు బాగు చేయలేదు. సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా? పేదల ఉసురు మంచిది కాదు.. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం. శుక్రవారం జరిగే మహాధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలి'' అని ఈటల పిలుపునిచ్చారు.

## చిన్నారులను ఫోన్లకు దూరంగా ఉంచాలి

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**విశ్వంభర, హైదరాబాద్ :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు విద్యార్థి దశ నుంచే అలవాటు చేయాలని మాజీ ఉపరాష్టపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కాకర్ల సుబ్బారావు శతజయంతి వేడుకల్లో భాగంగా మాదాపూర్ శిల్పకళా వేదికపై ఇంటర్నేషనల్ స్కూల్ షేక్‌పేట్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్టపతి వెంకయ్యనాయుడు, కిమ్స్ ఆసుపత్రి వ్యవస్థాపకులు భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ చిన్నారులు ఫోన్లలకు అలవాటు పడి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, వారిని వాటికి దురంగా ఉంచాలన్నారు. చిన్నారులకు ఏం నేర్పిస్తామో వాటినే అలవాటు చేసుకుంటారని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అకట్టుకున్నాయి. కాకర్ల సుబ్బారావు వైద్య రంగంలో చేసిన కృషిని వివరిస్తూ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు.



## ప్రపంచాన్ని మెప్పించిన

# లోకనాయకుడు

**నరేంద్ర మోదీ దేశ రాజకీయాల్లో ఓ సంచలనం. ఈ సంచలనం వెనుక ఎన్నో గాయాలు, మరెన్నో మరకలు, అయినా వాటికి అదరలేదు, బెదరలేదు, అన్నింటినీ తట్టుకుని నిలబడ్డారు. దేశ రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసుకున్నారు. కోట్లాది మంది భారతీయుల జీవితాల్లో ఆశాకిరణం ..అభివృద్ధిపై ఎక్కువగా దృష్టి సారించే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకులలో ఒకరు. దృఢ సంకల్పం, అంకితభావం కలిగిన నేత. సామాన్య కార్యకర్త నుంచి ముఖ్యమంత్రిగా.. ప్రధానమంత్రిగా ఎదిగారు. ఇటు దేశ రాజకీయాలైనా.. అటు ప్రపంచ సమస్యలైనా.. ఆయన స్పందించే విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరితో ఆయన మెలిగే విధానం, స్పందించే గుణం.. ఇవన్నీ కూడా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి.. అందుకే.. ఏ దేశాధినేతకు లేనంత క్రేజ్.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మాత్రమే ఉందంటే.. అది మామూలు విషయం కాదు.. ఆయన కఠోర నిర్ణయాలు, స్పష్టమైన విధానాలు, ఆలోచనలు, భావనలు ఇవన్నీ కూడా అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలను తెచ్చిపెట్టాయి. అందుకే, ఒకప్పుడు.. అమెరికా అధ్యక్షులకు ఎంత క్రేజ్ ఉండేదో.. ఇప్పుడు భారత ప్రధానమంత్రికి అంత గౌరవం లభిస్తుంది. అందుకే చాలా దేశాలు తమ దేశంలో పర్యాటించాలంటూ భారత్ ను కోరుతుండటం విశేషం. అది మోదీ నాయకత్వం వల్లనే సాధ్యమైంది. ఆయన స్పందన, విలక్షణ గుణం. నాయకత్వ పటిమ ఇవన్నీ కూడా భారత్‌ను అత్యున్నత స్థానంలో నిలిచేలా చేశాయంటూ పలువురు రాజకీయ వేత్తలు, విద్యావేత్తలు అభివర్ణిస్తున్నారు.**





### మూడుసార్లు ముఖ్యమంత్రి.. మూడు సార్లు ప్రధాని..

నరేంద్ర మోదీ గుజరాత్‌లోని మెహసానా జిల్లాలోని వాద్‌నగర్‌లో సెప్టెంబర్ 17, 1950లో జన్మించారు. తల్లిదండ్రులు హీరాబాయి, దామోదరదాస్ మోదీ.. నరేంద్ర మోదీ తొలిసారిగా ఎనిమిదేళ్ల వయసులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు పరిచయమైనప్పటికీ, 1970లలో ఆర్ఎస్ఎస్‌లో పూర్తి స్థాయి కార్యకర్తగా మారారు. 80వ దశకం చివరిలో భారతీయ జనతా పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు.. రాజకీయ ప్రచారమైనా..విపక్షాలపై విమర్శలైనా దటీజ్ మోదీ అనిపించుకోవడమే ఆయన స్టైల్ గా మారుతూ వచ్చింది.. మూడు సార్లు ముఖ్యమంత్రిగా.. మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2024లో మూడోవసారి ప్రధాని మంత్రిగా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ పార్టీ మరోసారి గెలుపొందడంలో నరేంద్ర మోదీ పాత్ర అద్వితీయం. ఆయన కలుసుకున్న ప్రతి ఒక్కరితోనూ ఆయన కలిసిపోయే గుణం.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ మెప్పించగలిగారు. సీనియర్ నాయకులకు ప్రాధాన్యమిస్తూనే.. యువతకు మంచి అవకాశాలు అందిస్తారు.. ప్రోత్సహిస్తారు. అదే.. మోదీకి అభిమానులను రెట్టింపు అయ్యేలా చేసిందంటూ రాజకీయ వేత్తలు అభిప్రాయపడతారు. బహుశా అతని జనాదరణ, విజయ రహస్యాలలో ఒకటి..

### అందుకే ఆయన ఛాయ్ వాలా అయ్యారు.



నరేంద్ర మోదీ బాల్యం పూల పాన్పు కాదు. సమాజంలోని అట్టడుగు వర్గాల నుండి వచ్చిన కుటుంబం కావడంతో జీవితం గడవడానికి ఎంతగానో కష్టపడ్డారు. కుటుంబం మొత్తం ఒక చిన్న ఇంట్లో ఉండే వారు. మోడీ తండ్రి స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసుకొన్న టీ స్టాల్‌లో టీ ని విక్రయించే వారు. చిన్నప్పుడు నరేంద్ర మోదీ తన తండ్రి ఏర్పాటు చేసిన టీ స్టాల్‌లో ఆయనకు సహాయపడుతూ ఉండేవారు. ఆ తరువాత అక్కడే సొంతంగా టీ స్టాల్‌ను మోడీ ఏర్పాటు చేసుకుని నడిపాడు. అందుకే ఆయన ఛాయ్ వాలా అయ్యారు. నరేంద్ర మోదీ తన తండ్రికి సహాయపడుతూనే చదువును ఏ మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. తండ్రికి సహాయపడడం, చదువు తో పాటు ఇతర కార్యకలాపాలను కూడా చురుకుగా చేసేవారు. చదువు, వక్తృత్వం పట్ల ఆసక్తి, దేనినైనా సాధించాలనే పట్టుదల గల వ్యక్తిగా నరేంద్ర మోదీని ఆయన చిన్ననాటి మిత్రులు గుర్తు చేసుకుంటారు. పాఠశాల గ్రంథాలయంలో గంటల కొద్దీ పుస్తకాలు చదువుతూ ఉండేవారు. ఇక క్రీడలలోనూ వారికి ఎంతో ఆసక్తి ఉండేది. ఈత అంటే నరేంద్ర మోడీకి చాలా ఇష్టం. ఆయనకు ఇరుగు పొరుగున ఎంతో మంది ముస్లిం మిత్రులు ఉండేవారు. వారితో హిందూ, ముస్లిముల పండుగలను జరుపుకొనేవారు.

### విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు..

అయితే స్కూల్, కాలేజీ రోజుల్లోనే మోదీ అప్పటి దేశ పరిస్థితులు, రాజకీయాలు, ఇతర అంశాలపై తన తోటి విద్యార్థులతో నిర్వహించే డిబేట్లలో అనర్గళంగా మాట్లాడేవారు. ఆయనకు ఆ పరిజ్ఞానం బాగానే ఉండేది. అన్ని అంశాలపై ఆయన బాగా అవగాహన కలిగి ఉండేవారు. అలాగే స్కూల్ రోజుల్లో వేసిన పలు నాటకాల్లోనూ ఆయన రాజకీయ నాయకుల పాత్రలలో మెప్పించారు. దీంతో ఆయనలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయని అధ్యాపకులు అప్పట్లోనే గ్రహించారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు నాయకుడిగా పనిచేశారు. ఆ తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో మొదటగా చేరి, అటు నుంచి బీజేపీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి కీలక బాధ్యతలు నిర్వర్తించే పదవుల్లో చేరి.. ఆ తరువాత గుజరాత్ సీఎం అయి, అక్కడి నుంచి.. దేశ రాజకీయాల వైపు మళ్లి ప్రధాని అయ్యారు.

### గుజరాత్ సీఎంగా.. :

2001లో కేశూభాయి పటేల్, ఉప ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడంతో నరేంద్ర మోదీకి అధికార పగ్గాలు లభించాయి. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన..200114 కాలంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. వరుసగా మూడు సార్లు గుజరాత్ సీఎంగా గెలిచి హ్యాట్రిక్ సీఎంగా పేరు తెచ్చుకున్నారు. అలాగే 2012 శాసన సభ ఎన్నికలలో విజయభేరి మ్రోగించి వరుసగా నాల్గవ సారి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాడు.

### ప్రధానిగా మోదీ ప్రస్థానం...

2014 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎన్డీఏను విజయపథంలో నడిపించి పూర్తి మెజారిటీ సాధించిపెట్టి 2014 మే 26న ప్రధానమంత్రి పీఠంపై అధిష్టించారు. సంచలన నిర్ణయాలు తీసుకుంటూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. స్వచ్ఛభారత్, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన,శ్రమయోగి మాన్ ధన్ యోజన, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, జన్ సురక్ష, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, మేక్ ఇన్ ఇండియా, యోగా దివస్ వంటి పథకాలతో ప్రజలకు మరింత చేరువ అయ్యారు. తిరిగి 2019 ఎన్నికలలో గెలిచిన తర్వాత అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేత నిర్ణయం తీసుకుని దేశ రాజకీయాల్లో చెరగని ముద్రను వేసుకున్నారు.తద్వారా 2024లో మూడోసారి ప్రధానిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు.

### ప్రజల హృదయాలను గెలుచుకున్న నేత..

ప్రధాని మోదీ సిద్ధాంతాలు.. భావజాలం.. నిబద్ధత ఇవన్నీ కూడా ఆయన్ను ఉన్నత శిఖరాలకు చేర్చింది.. ఏ ప్రాంతానికి వెళ్లినా.. ఏ దేశానికి వెళ్లినా సంస్కృతి సంప్రదాయాలను వీడరు.. ఇంకా అక్కడి సమస్యలను అడిగి తెలుసుకుని.. పరిష్కరించేందుకు ముందుంటారు. 125 కోట్ల మంది భారతదేశంలో.. సామాన్య ప్రజలు, సాధారణ రైతుల నుండి పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల వరకు లక్షలాది మంది ప్రజలు సైతం ప్రధాని మోదీ వ్యక్తిత్వానికి నాయకత్వానికి ప్రభావితం అయ్యారంటే అతిియోశక్తి కాదు..వయస్సు పైబడినా కానీ.. ప్రధాని మోదీ నిత్య విద్యార్థిగా అందరికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు.. చిన్నా పెద్దా, పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరితో కలిసి పోతారు. సరళమైన, సామాన్యమైన, అధ్యాత్మిక జీవనశైలికి అనుకూలంగా ఖరీదైన వస్తువులకు దూరంగా ఉంటారు. అతని వ్యక్తిగత జీవితాన్ని పరిశీలిస్తే.. ఎన్నో విషయాలు మనకు అర్థమవుతాయి.. అతని చుట్టుపక్కల ఉన్న వారిని పిలిచి మరి మాట్లాడుతారు.. చిన్న వ్యక్తులైనా సరే అప్యాయంగా పిలిచి ఆదరిస్తారు. అందుకే.. అతని వ్యక్తిత్వం చాలా మందికి ఆదర్శనీయంగా నిలిచింది.. దాంతోనే లక్షలాది, కోట్లాదగి ప్రజల హృదయాలను గెలుచుకున్నారు.

### అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి


నరేంద్ర మోదీ అణగారిన, నిరుపేద ప్రజల సంక్షేమం కోసం ఆయన హృదయం ఎప్పుడూ తపిస్తూనే ఉంటుంది. నైపుణ్యం కలిగిన పాలకుడిగానే కాదు.. సమర్థవంతమైన వక్త, ఆలోచనాపరుడిగా పేరు ప్రఖ్యాతలను పొందారు. దేశభక్తి, కార్యదక్షత, దృక్పథం ఇవన్నీ కూడా ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయి.అవినీతి రహిత, ద్రవ్యోల్బణం రహిత, సమర్థత, బలమైన భారతదేశాన్ని నిర్మించడానికి మోదీ అహర్నిషలు కృషి చేస్తూనే ఉన్నారు. అలా వారసత్వం లేదా అదృష్టం ద్వారా అతను పొందిన అధికారం వల్ల కాదు, లెక్కలేనన్ని సంక్షోభాలు, పోరాటాల మధ్య ఎదగడం ద్వారా.. నరేంద్ర మోదీ ఎందరికో ఆదర్శంగా నిలిచారు.

### ఇతరుల పట్ల గౌరవం..ప్రజలతో మాట్లాడేందుకు ఇష్టపడతారు..

ప్రధాని మోదీ.. ఇతరులను గౌరవంతో పలకరిస్తారు.. కోపం, ద్వేషం, అసమానతలు ఇవన్నీ పట్టించుకోకుండా.. ఇతరుల పట్ల ఎల్లప్పుడూ గౌరవంతో ఉంటారు. అందరికీ సముచిత గౌరవం లభించాలన్నదే ప్రధాని మోదీ.. నినాదం.. అందుకే.. ఆయన ఎప్పుడూ కూడా అంత హుందాగా కనిపిస్తారు.. అందరితో మమేకమై.. ముచ్చటిస్తారు.. చిన్నపిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతారు. ఇంకా భావజాలాలు వేరైనా కానీ.. అందరి అభిప్రాయాలను గౌరవిస్తారు. ఇంకా చిన్న చిన్న విషయాలపై.. పలువురు వ్యక్తులతో నేరుగా సంభాషిస్తారు.. వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు.. పార్టీ విషయాల్లోనైనా.. పాలన పరంగా చాలా కఠినంగా కనిపించినప్పటికీ.. ఎదుటి వ్యక్తులకు గౌరవం ఇస్తూ.. చాలా హుందా నడుచుకుంటారు.ప్రధాని మోదీ ప్రజా జీవితంలో అనూహ్య నిర్ణయాలు ఉంటాయి.. ఆయన విఐపి సంస్కృతికి వ్యతిరేకం.. అవసరమైతే.. ఆయన నేరుగా ప్రజలతో మాట్లాడేందుకు ఇష్టపడతారు. ఒక్కోసారి సెక్యూరిటీ పక్కన బెట్టి.. ప్రజల దగ్గరకు వెళతారు.. వారితో ఆప్యాయంగా మాట్లాడుతారు. వారి చెప్పే విషయాలను వింటారు. ఇలా ఆయన ప్రజలకు మరింత చేరువగా ఉంటారు.. ఉదాహరణకు.. ఇటీవల ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో జరిగిన ఓ కార్యక్రమంలో.. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వెళ్లారు.. అక్కడ తన గొడుగును తానే పట్టుకుని.. రైతులతో మాట్లాడుతూ కనిపించారు. ప్రధాని మోదీ భద్రతను తిరస్కరించి ప్రజలతో మమేకమైన సందర్భాలు చాలానే ఉన్నాయి.

### అందరి నుంచి అభిప్రాయాలు.. దూర దృష్టితో ఆలోచన -నిర్ణయాలు..

నరేంద్ర మోదీ.. ఏదైనా నిర్ణయాలు తీసుకోవాలన్నా.. లేదా తీసుకున్న నిర్ణయాలపై అభిప్రాయాలను తీసుకోవాలన్నా నేరుగా అందరితో సంప్రదిస్తారు. ఉదాహరణకు.. ప్రభుత్వ పథకాలకు సంబంధించి నేరుగా ప్రజలతో మాట్లాడుతారు.. మహిళలతో సంభాషిస్తారు.. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటారు. ఇంకా వ్యవసాయ పథకాలకు సంబంధించి రైతులతో ముఖాముఖి నిర్వహించడం.. అలాగే తాను మాట్లాడిన విషయాలు, ప్రముఖులతో భేటీ.. ఇలా.. ర్యాంక్ హోదా చూడకుండా అందరి నుంచి స్పష్టమైన అభిప్రాయాలను తీసుకుంటారు.. దాని ప్రకారం.. భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలు, పథకాల అమలు తదితర అంశాలపై నిర్ణయాలు ఉంటాయని నేతలు పేర్కొంటున్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలు దూర దృష్టితో ఉంటాయి.. ఉదాహరణకు మోదీ.. అధికారం లోకి రాకముందు జమ్మూకశ్మీర్ 370 యాక్ట్ గురించి వివరించేవారు..స్వయంప్రతిపత్తి వల్ల ఎన్నో సమస్యలు ఉన్నాయని చెప్పేవారు.. అధికారంలోకి వచ్చిన తర్వాత జమ్మూకశ్మీర్ కు సంబంధించిన 370 యాక్ట్ ను రద్దు చేశారు. ఇంకా నల్లధనం నియంత్రణకు నోట్ల రద్దును చేపట్టారు.. ఇవన్నీ కూడా భారతదేశ ఆర్థిక అభివృద్ధితోపాటు.. భద్రత రక్షణకు నిలయాలుగా నిలిచాయి. అంతేకాకుంగా.. ప్రతి ఒక్క కుటుంబానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందినప్పుడే.. ఆయా కుటుంబాలకు చేరువవ్వగలం అని తరచూ సందేశమిస్తారు.. ఎందుకంటే.. ఇవి ప్రజలతో నేరుగా సంబంధాలు నెలకొనేలా చేస్తాయి..



### తనకంటూ ప్రత్యేక రూట్ ఫాలో అవుతారు..

నలుగురికి నచ్చినది తనకు అసలు నచ్చదంటారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. అందుకే ఇతర నేతలు నడిచిన దారిలో కాకుండా.. తనకంటూ ప్రత్యేక రూట్ ఫాలో అవుతారు. ట్రెండ్ ఫాలో కాకుండా.. ట్రెండ్‌నే సృష్టించే ప్రయత్నం చేస్తారు. అందుకే స్పష్టమైన ఆలోచనలతో.. నిక్కచ్చిగా ఉన్నది ఉన్నట్లుగా చెబుతారు. అందుకే.. ప్రధాని మోదీకి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులున్నారు. ఆయన ఏదైతే స్పష్టంగా ఆలోచించి చెబుతారో.. అది భవిష్యత్తుకు పునాదులు వేస్తుందంటూ పేర్కొంటారు. ఆయన ప్రారంభించినా పథకాలైనా.. ఎర్రకోట వేదికగా మాట్లాడిన సందర్భాలైనా అదే తెలియజేస్తుందని పేర్కొంటారు.

### మేకిన్ ఇండియాకు అధిక ప్రాధాన్యం..

మోదీ తన పాలనలో భారత దేశ అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా మేకిన్ ఇండియాకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ఫలితంగా చాలా రంగాల్లో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దేశం అన్ని రంగాల్లోనూ పురోగమిస్తోంది. ముఖ్యంగా భారత ఆర్థిక వ్యవస్థ ..ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారింది. దాన్ని మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు మోడీ సర్కార్ కృషి చేస్తోంది. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్నదే తన ధ్యేయమని సగర్వంగా ప్రకటించుకున్నారు మోదీ.

### భారత్ పునర్నిర్మాణంలో వ్యూహాలు.. విదేశాంగ విధానంలో విజయాలు..

11 సంవత్సరాల ప్రధాని మోదీ పాలనలో భారతదేశం విదేశాంగ విధానంలో గణనీయంగా మార్పులు తీసుకొచ్చింది. వ్యూహాత్మక ప్రణాళికల ద్వారా అంతర్జాతీయ సంబంధాలను మరింత దృఢంగా మార్చారు ప్రధాని మోదీ. దేశ భద్రత, ప్రపంచస్థాయిలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమే కాకుండా.. ఆర్థిక, భద్రతా భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో ప్రధాని మోదీ విదేశాంగ విధానలు విజయాలు తెచ్చిపెట్టింది. గత దశాబ్దకాలంగా, ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశప్రజలను విదేశాల నుంచి తిరిగి సొంత రాష్ట్రాలకు సురక్షితంగా తీసుకొచ్చేందుకు పక్కా ప్రణాళికలు రచించింది. విపత్తు ఏదైనా, యుద్ధం ఏ దేశంలో మొదలైనా.. తన దేశప్రజలను ఆయా ప్రాంతాల నుంచి సురక్షితంగా తిరిగి తీసుకొచ్చారు ప్రధాని మోదీ. సిరియా, యెమెన్ వంటి యుద్ధంతో దెబ్బతిన్న దేశాల నుంచి భారతీయ పౌరులను తరలించడం, అలాగే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను తరలించడానికి ఆపరేషన్ గంగా ప్రారంభించడం లాంటి వాటిని ప్రధాని మోదీ మొదలు పెట్టారు. అనంతరం విజయం సాధించారు. దేశ పౌరులను భారత్‌కు తిరిగి తీసుకొచ్చారు. మోదీ విదేశాలలోనూ భారత్ కరెన్సీ చెల్లుబాటు అయ్యేందుకు కృషి చేశారు. రష్యా, ఇరాన్‌తో సహా వివిధ దేశాలు రూపాయితో ట్రేడ్ కొనసాగించేందుకు అంగీకరించాయి. దీని వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవ్వడమే కాదు.. భారతదేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని పెంపొందించడానికి దోహదపడతుంది. ఈ విధానం భారతదేశ ఆర్థిక వ్యవస్థపై భారీగా ప్రభావం చూపింది. కరెన్సీ హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల ఒడిదుడుకులను తగ్గించింది.

### అన్ని దేశాలు భారత్ వైపు..

అన్ని దేశాలు.. సమస్య వచ్చినప్పుడు.. భారతదేశం వైపు చూడడం పరిపాటిగా మారింది. అది ఇతర ప్రధానులు ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి లేదు. కేవలం భారత ప్రధాని మోదీ నాయకత్వ పటిమకు ఆకర్షితులై.. ప్రపంచం భారత్ వైపు ఆశగా చూపిస్తోంది. వచ్చే శతాబ్దానికి నాయకత్వం వహించే సత్తా భారత్ కు మాత్రమే ఉందని బలంగా నమ్ముతోంది.అమెరికా తాను, తన మిత్రపక్షాలను పరిరక్షించుకోవడానికి పరిమితమైంది. చైనా ఉన్న భూభాగం చాలదని.. ప్రత్యర్థి దేశాల భూభాగాలను కలుపుకుని విశాలశక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. వ్యాపార పరంగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. కేవలం భారత్ మాత్రమే .. ప్రపంచం విపత్తు సమయంలో ఉన్నప్పుడు... బాధ్యతగా సాయమందించింది. కరోనా సమయంలో కోట్లాది కోవిడ్ టీకాలను ప్రపంచానికి ఉచితంగా అందించింది. కోవిడ్ మహమ్మారి సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు తమను తాము రక్షించుకోవడానికి ప్రపంచంలోని పేద, చిన్న దేశాలను వదిలేసినప్పుడు, భారత్ పెద్దన్నగా ముందుకొచ్చింది. 'వ్యాక్సిన్ మైత్రి' చొరవతో భారత్ 100 దేశాలలో 200 మిలియన్ డోసుల COVID19 వ్యాక్సిన్‌లను ఎగుమతి చేసింది. ఇందులో దక్షిణాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరేబియన్, ఆగ్నేయాసియా వంటి దేశాలున్నాయి. ఈ చొరవ వివిధ ప్రాంతాలలో వ్యాక్సిన్ కొరతను పరిష్కరించడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా భారతదేశం దౌత్య సంబంధాలను బలోపేతం చేసింది.దీనికి తోడు ఎప్పుడు ఎలాంటి ప్రకృతి విపత్తు వచ్చినా.. తక్షణం ఆదేశాలకు ఆపన్న హస్తం అందిస్తోంది. ఈ పరిణామాలను చూస్తున్న ప్రపంచదేశాలు.. భారతదేశం మామిత్రదేశమంటూ గర్వంగా ప్రకటించుకుంటున్నాయి.ప్రపంచాన్ని కలవరపరుస్తున్న రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు ప్రధానిమోడీ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదేశం ఎక్కువ కాదు.. ఏదేశం తక్కువ కాదన్నారు మోడీ. రష్యాకు...మిత్రుడిగా హితబోధ చేస్తున్నారు. ఇది శాంతియుగం.. యుద్ధాల యుగం కాదని సుతిమెత్తగా చురకలు వేశారు. అయితే అదే రష్యా ఆర్థికంగా ఇబ్బందుల్లో పడినప్పుడు.. చమురు కొనుగోలు చేసి ఆదుకున్నారు. దీంతో రష్యాకు భారత్ అన్నా మోడీ అన్నా చెప్పలేని ఇష్టం. ఆ ఇష్టాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్.. నిర్మొహమాటంగా పలుమార్లు ప్రస్తావించారు. ఇక మోడీకి ఉన్న పరపతి చూసి.. యుద్ధం ఆపేందుకు సహకరించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు సైతం కోరారు. ఇద్దరు నేతలతో మోదీ సమావేశాలు అవుతూ.. సామరస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు కూడా. వివాదల పరిష్కారంలో నిర్మాణాత్మక పాత్రను పోషించడానికి ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. దీంతో ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత్ గ్లోబల్ వేదికపై అత్యంత సన్నితం దేశంగా ఆవిర్భవించడానికి దోహదపడింది.2023లో G20 సమ్మిట్‌ను భారత్ విజయవంతంగా అధ్యక్షత వహించింది. ఆ G20 సమ్మిట్‌లో కీలకమైన ప్రపంచ సమస్యలపై అన్ని దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. G20లో ఆఫ్రికన్ యూనియన్‌ను శాశ్వత సభ్యదేశంగా చేర్చే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇవన్ని విజయాలు భారత దేశం ప్రపంచ వేదికపై తన స్థానాన్ని పటిష్టం చేసుకునేలా చేశాయి.

### 16వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ...

ఇటీవల 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న ప్రధాని.. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా ఆయా దేశాధినేతలను కలుసుకున్నారు. వారితో చర్చలు జరిపారు.బ్రిక్స్ సదస్సులో మోదీ ప్రసంగిస్తూ.. ఉగ్రవాదంపై అన్ని దేశాలు కలిసి పోరాడాలని పిలుపు నిచ్చారు. బ్రిక్స్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారంటూ పుతిన్‌పై ప్రశంసలు కురిపించారు. గ్లోబల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో సంస్కరణలు తీసుకురావాలన్నారు. బ్రిక్స్ దేశాలు లోకల్ కరెన్సీ ద్వారా వ్యాపారం చేసుకోవడాన్ని ప్రోత్సహించాలని కోరిన ప్రధాని మోదీ.. భవిష్యత్‌లో బ్రిక్స్ మరింత పటిష్టమైన వేదిక అవుతుందని ఆకాంక్షించారు. పర్యటన తొలి రోజు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కాగా, రెండోరోజు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్‌చైనా సంబంధాల ఆవశ్యకత ఇరు దేశాల పౌరులకు మాత్రమే ప్రయోజనకరం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి కీలకమని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల సమస్యలు అన్నింటిపై మాట్లాడే అవకాశం తమకు ఇవాళ దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. సానుకూలంగా, నిర్మాణాత్మకంగా ఈ చర్చలు ముందుకు సాగుతాయని విశ్వసిస్తున్నట్టు మోదీ చెప్పారు.సరిహద్దు వెంబడి గత 4 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యలపై ఏకాభిప్రాయం కుదరడాన్ని స్వాగతిస్తున్నామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరిహద్దు వెంబడి శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడం తమ ప్రాధాన్యతగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇరుదేశాలు పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

**- పోతుగంటి వెంకటరమణ**
**న్యూస్ నెట్వర్క్ ఇంచార్జ్, బ్యూరో చీఫ్**
**వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక**







# గొర్రెలు, బర్రెలు, పందులు ఇచ్చి అభివృద్ధి అంటే ఎట్లా..?

సమాజం ఎప్పటికప్పుడు మారుతుంది. ప్రజల్లో కూడా దానికి అనుగుణంగా మార్పులు వస్తున్నాయా.. ఇక రాజకీయ నాయకుల భవిష్యత్తు రాజకీయ పార్టీల భవిష్యత్తు ప్రజలు ఓటు ద్వారానే మారుస్తారని రాజకీయ నాయకులకు గుర్తెరగాలి. ఇక సైన్స్ అండ్ టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది అన్ని రంగాల్లో మెకనైజేషన్ పెరుగుతోంది. ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. ఆధునిక టెక్నాలజీ అన్ని రంగాలకూ విస్తరిస్తోంది. ఈపరిణామ క్రమంలో కులవృత్తులు-చేతివృత్తులుతమ అస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. ఇంతవరకుఈ వృత్తులపైనే ఆధారపడిన కులాలు, వర్గాలకు యాంత్రీకరణ-కార్పొరేటీకరణ దక్కాలి. కానీ ప్రస్తుతం వ్యవస్థలో అలా జరగడం లేదు. స్టీల్,ఐరన్ పరిశ్రమలతో కమ్మరి, కుమ్మరి, వడ్రంగికులాలు తమ వృత్తులను కోల్పోయాయి. ప్లాస్టిక్ పరిశ్రమ కారణంగా మేదరి, కుమ్మరి అనేక వృత్తులుమరుగున పడ్డాయి. జేసీబీలు, హిటాచీ మెషిన్లతోవడ్డెర్ల బతుకులు ఆగమై కూలీలుగా మారారు. ట్రాక్టర్లు-సా మిల్లులు రావడంతో వడ్రంగి, కమ్మరిపని దెబ్బతింది. డ్రై క్లీనింగ్ షాపులు వల్ల చాకలి.నేత మిల్లులు రావడంతో నేత వృత్తి, బ్యూటీపార్లర్లు,హేర్ కటింగ్ సెలూన్ల రాకతో .నాయి బ్రాహ్మణ(మంగళి), రెడీమేడ్దుస్తులతో దర్జీలు, జ్యూయెలరీ షాపులతో విశ్వ బ్రాహ్మణుల వృత్తులు దెబ్బతిన్నాయి.

## 1974లో బీసీ కార్పొరేషన్ ఏర్పాటు

ఉమ్మడి రాష్ట్రంలో 1974లో బీసీ కార్పొరేషన్ ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి 2014 వరకు దీని ద్వారా లక్షలాది మందికి సబ్సిడీ రుణాలు అందాయి. రజక, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ల ను 1976 లో స్థాపించారు. అనేక బీసీ సంఘాల విజ్ఞప్తి మేరకు 2006-2007లో వడ్డెర, విశ్వబ్రా హ్మణ, ఉప్పర, మేదర, శాలి వాహన, భట్రాజు, పూసల, దర్జీ, వాల్మీకి, గీత, సంచార జాతుల ఫెడ రేషన్లను రెండు దఫాలుగా ఏర్పాటు చేశారు. బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్ల ద్వారా ఇచ్చిన మార్జిన్ .మనీ రుణాలను మాఫీ చేయాలని ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంఘాలు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి విజ్ఞప్తి చేయగా 2007లో 18 లక్షల మంది బీసీ లబ్దిదారులకు చెందిన దాదాపు రూ.800 కోట్ల రుణాలను మాఫీ చేశారు. మార్జిన్ మనీ రుణాల స్కీము ఎత్తేయాలని, మొత్తం సబ్సిడీ రుణాలు ఇవ్వా లని కోరగా 20 శాతం సబ్సిడీ రుణాల పథకాన్ని ప్రారంభించారు.



## సబ్సిడీ రుణ పథకాలకు కొత్త రూపు

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సబ్సిడీ రుణాల పథ కానికి మాజీ సీఎం కేసీఆర్ కొత్త రూపు ఇచ్చారు. లక్ష రూపాయల రుణం వరకు 80%, రెండు లక్షల వరకు 70%, 3 లక్షల వరకు 60%, ఆపై రుణాలకు 50% సబ్సిడీ ఇచ్చేలా స్కీములను డిజైన్ చేశారు. స్కీముల డిజైన్ బావుంది కానీ, రుణాలు మాత్రం ఇవ్వడంలేదు. ఈ ఏడేండ్లలో 2015-16లో 3.36 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 50 వేలమందికి, 2018లో 5.77 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 40 వేల మందికి రుణాలు మంజూరు చేశారు. రాష్ట్రంలో 60 లక్షల బీసీ కుటుంబాలు ఉంటే ఏడేండ్లలో 90 వేల మందికే సబ్సిడీ రుణాల ఇచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో అత్యంత వెనుకబడిన తరగతుల కోసం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటైంది. అయితే బీసీ కార్పొరేషన్. ఎంబీసీ కార్పొరేషన్లకు కొన్ని ఫెడరేషన్లకు మాత్రమే బడ్జెట్ కేటాయిస్తున్నారు. సబ్సిడీ రుణాలు మాత్రం ఇవ్వడం లేదు.

## గత ప్రభుత్వం రుణాలు మాత్రం ఇయ్యలే..

సబ్సిడీ రుణాలు ఇస్తామని 10సం: లో రెండు సార్లు నోటిఫికేషన్లు ఇచ్చి బీసీ కులాల అభ్యర్థుల నుంచి అప్లి కేషన్లు తీసుకున్నారు. 2014-15 లో నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు బీసీ కార్పొరేషన్ ద్వారా 1,62,000 దరఖాస్తులు, బీసీ కుల ఫెడరే షన్ల ద్వారా 1.33,000 దరఖాస్తులు వచ్చాయి. కానీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదు. 2017లో మళ్లీ దరఖాస్తులను ఆహ్వానించగా.. అప్పట్లో 5,77,000 పైగా దరఖాస్తులు వచ్చాయి. 2018లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు 40 వేల మందికి రూ.50 వేల చొప్పున సబ్సిడీ రుణాలిచ్చి చేతులు దులుపుకున్నారు. మిగతా 5,37,000 వేల మంది రుణాలు ఎప్పుడు వస్తాయని కాళ్లు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా.. జవాబు చెప్పే దిక్కు లేదు. ఒక్కో బీసీ కుల ఫెడరేషన్ కు రూ.200 కోట్లు కేటాయిస్తామని గతంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కానీ, బడ్జెట్ లో చూస్తే పది పైసలు కూడా కేటాయించలేదు. ఫెడరేషన్ల లో పనిచేసే వారి జీతభత్యాలకు కూడా నిధులు కేటాయించలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందుప్రతి దరఖాస్తుదారునికి సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించారు. వాస్తవానికి రాష్ట్రంలో 60 లక్షల బీసీ కుటుంబాలు ఉన్నాయి. అయితే గత ప్రభుత్వంలో సరైన ప్రచారం లేకపోవడంతో సబ్సిడీ రుణాలకు 5,77,000 దర ఖాస్తులే వచ్చాయి. పదేండ్ల ప్రగతి పండగఅంటూ రాష్ట్రఅవతరణదశాబ్దిఉత్సవాలను బిఆర్ఎస్ నిర్వహించిన సర్కార్.ఈ 9 ఏండ్లలో సంక్షేమానికి చేసిన ఖర్చు అంతంత మాత్రంగానేఉంది.ప్రకనల్లో ఊదరగొట్టడంలో ఉన్న గొప్ప.. అమలులో లేదన్నది ప్రభుత్వ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్లో కేటాయించిన నిధులు.. వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తంవివరాలు పరిశీలిస్తే అసలు సంగతి అర్థమైతుంది. సంక్షేమంపై చేసిన ఖర్చు వివరాలతో గతంలో ఒక రిపోర్ట్ తయారు చేశారు. దీంట్లో మొన్న వరకు ఒక్కో వెల్ఫేర్ డిపార్ట్ మెంట్లో ఎన్ని ఫండ్స్ ఖర్చు చేశారో పొందుపరిచారు. దీని ప్రకారం రాష్ట్రంలో వెల్ఫేర్ను సక్కగ పట్టించుకోలేదనే దతెలుస్తున్నది. నాలుగువెల్ఫేర్ డిపార్మెంట్లలో దేంట్లోనూ ఒక ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5 వేల కోట్లు దాటి ఖర్చు పెట్టలేదు. పోయినేడాది మాత్రమే అదీ దళిత బంధు కొంతమేర అమలు చేసినందుకు ఎస్సీ వెల్ఫేర్ ఖర్చు పెరిగింది.

2014-15 నుంచి 2022-23 వరకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్కు మొత్తంరూ.1.35 లక్షల కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు గత టీఆర్ఎస్ ప్రభుత్వంచేసింది. అయితే ఇందులో రిలీజ్ చేసిన నిధులుసగం మాత్రమే. మొత్తం రూ.79 వేల కోట్లుఖర్చు చేసింది. అంటే ప్రతి ఏడాది యావరేజ్ గానాలుగు డిపార్మెంట్లలో రూ.9 వేల కోట్ల ఖర్చుచేసింది.ఎక్కువ శాతం ఉన్నోళ్లను పట్టించుకోలే రాష్ట్రంలో ఎక్కువ శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వం ప్రతిఏటా బడ్జెట్ లో చేస్తున్న కేటాయింపులు 4% మించడం లేదు. కేటాయించిన మొత్తంలో ఖర్చు చేస్తున్నది 2% నుంచి 3 శాతమే ఉంది. రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీ సంక్షేమాని కిమొత్తంగా రూ.37,862కోట్లు కేటాయించారు. ఈ మొత్తంలో ఖర్చు చేసింది రూ.24,487 కోట్లు మాత్రమే. అనేక సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోలేదు. సబ్సిడీ స్కీములు అటకెక్కాయి. కల్యాణలక్ష్మీ, ఫీజు రియింబర్స్మెంటుకు తూతూ మంత్రంగా నిధులు విడుదల చేశారు. స్కాలర్షిప్ ల కోసం రెండేండ్లు ఆగాల్సిన పరిస్థితి ఉంది.



## ఎస్సీ వెల్ఫేర్ దారుణం

రాష్ట్రంలో దళితులకు ఇప్పటి వరకు ఒరిగిందే మీ లేదు. మూడెకరాల భూమి, సబ్సిడీ లోన్లు.. ఇట్ల సర్కారు ఇచ్చిన హామీలన్నీ పత్తా లేకుండా పోయాయి. దళితబంధు అని ఆర్భాటంగా ప్రక టించినప్పటికీ పైలెట్ ప్రాజెక్టు మినహా.. స్కీమ్ ముందుకు పడలేదు. స్కీములు ప్రకటించడం, బడ్జెట్లో నిధులు కేటాయించడం తప్ప.. ఫండ్రిలీజ్చసి వాటిని అమలు చేయడం లేదని దళితులు మండిపడుతున్నారు. ఇంటర్ క్యాస్ట్ మ్యారెజ్ ఇన్సెంటివ్స్ ఇస్తలేరు. ఎస్సీ డెవలప్ మెంట్ కింద రూ.55,655 కోట్ల కేటాయించగా, రూ.29,188 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

### ఎస్టీ, మైనార్టీల సంక్షేమం అంతంతే

ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తు న్న ఖర్చు నామమాత్రంగా ఉన్నది. ఈ రెండు శాఖలకు కలిపి ఏటా చేస్తున్న యావరేజ్ ఖర్చు రూ.2,500 కోట్లు దాటడం లేదు. ఎస్టీలకు ఈ తొమ్మిదేండ్లలో రూ.25,453 కోట్లు కేటాయించ గా, రూ.16,503 మాత్రమే ఖర్చు కోట్లు చేశారు. నెలకు వంద యూనిట్ల ఉచిత కరెంట్ అమలు కావడం లేదు. గిరిజన బంధు ఇస్తామని చెప్పి పట్టించుకోవడం లేదు. డ్రైవర్ ఎంపవర్మెంట్ స్కీమ్ను పక్కకు పెట్టారు. తండాలను గ్రామ పం చాయతీలుగా చేయడమే తప్ప వాటికి కనీస సౌ లతులను కల్పించలేదు. మైనార్టీ వెల్ఫేర్ షాదీ ముబారక్, రంజాన్ పండుగలకు చేసే ఖర్చులు, హజ్ యాత్ర అంతకు మించి ఇంకా ఏమి చేయడం లేదు. గత ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి గెలవాలని ప్రయత్నం చేసిన టిఆర్ఎస్ సర్కార్. ఇప్పుడు కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలను మోసం చేయాలని చూస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఇక తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ సమైక్యమైన అభివృద్ధిలో ముందుకు తీసుకపోతుందని అలాగే దళితలకు డిక్కీ తరహా (ఇండస్ట్రీ పాలసీ) బీసీల కొరకై "బిక్కి" ఇండస్ట్రీస్ ప్రత్యేకమైన ఇండస్ట్రీ పాజిటివ్ తేవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### (శాఖల వారీగా కేటాయింపులు, ఖర్చులు (రూ.కోట్లలో)

**బీసీ సంక్షేమం**

| సంవత్సరం | కేటాయింపులు | ఖర్చు |
|---|---|---|
| 2014-15 | కేటాయింపులు 2,020 | ఖర్చు 1,090 |
| 2015-16 | కేటాయింపులు 2,172 | ఖర్చు 1,074 |
| 2016-17 | కేటాయింపులు 2,537 | ఖర్చు 2,832 |
| 2017-18 | కేటాయింపులు 5,070 | ఖర్చు 2,856 |
| 2018-19 | కేటాయింపులు 5,960 | ఖర్చు 3,863 |
| 2019-20 | కేటాయింపులు 4,528 | ఖర్చు 3,221 |
| 2020-21 | కేటాయింపులు 4,356 | ఖర్చు 3,023 |
| 2021-22 | కేటాయింపులు 5,522 | ఖర్చు 3,178 |
| 2022-23 | కేటాయింపులు 5,697 | ఖర్చు 3,350 |
| మొత్తం: | కేటాయింపులు:37,862కోట్లు | ఖర్చు:24,487కోట్లు |

టిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో తన మేనిఫెస్టోలో ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయలు బీసీలలో కేటాయిస్తామని తన మేనిఫెస్టోలో చెప్పింది. పది సంవత్సరాల బడ్జెట్లో 50, 000 కోట్ల రూపాయలు కావలసిన బడ్జెట్లో ఖర్చు చేసిందివాస్తవానికి పది సంవత్సరాల ఖర్చు చేసింది 24,487 కోట్లు ఇంతే..! ఇది బీసీల సంక్షేమం ఎట్లా అయితది..!

**ఎస్సీ వెల్ఫేర్**

| | | |
|---|---|---|
| 2014-15 | కేటాయింపులు 3,257 | ఖర్చు 1,355 |
| 2015-16 | కేటాయింపులు.4,770 | ఖర్చు 2,167 |
| 2016-17 | కేటాయింపులు.6,049 | ఖర్చు 2,066 |
| 2017-18 | కేటాయింపులు.4,830 | ఖర్చు 3,937 |
| 2018-19 | కేటాయింపులు.5,173 | ఖర్చు 4,014 |
| 2019-20 | కేటాయింపులు.2,754 | ఖర్చు 3,503 |
| 2020-21 | కేటాయింపులు.2,610 | ఖర్చు 3,080 |
| 2021-22 | కేటాయింపులు.5,588 | ఖర్చు 5,616 |
| 2022-23 | కేటాయింపులు.20,624 | ఖర్చు 3,450 |
| మొత్తం: | కేటాయింపులు:55,655కోట్లు | ఖర్చు:29,188 కోట్లు |

**ఎస్టీ వెల్ఫేర్**

| | | |
|---|---|---|
| 2014-15 | కేటాయింపులు 1,549 | ఖర్చు 719 |
| 2015-16 | కేటాయింపులు 3,262 | ఖర్చు 1,711 |
| 2016-17 | కేటాయింపులు 3.723 | ఖర్చు 1,187 |
| 2017-18 | కేటాయింపులు 2,723 | ఖర్చు 2,816 |
| 2018-19 | కేటాయింపులు 3,540 | ఖర్చు 2,709 |
| 2019-20 | కేటాయింపులు 1,899 | ఖర్చు 2,299 |
| 2020-21 | కేటాయింపులు 2,286 | ఖర్చు 1,809 |
| 2021-22 | కేటాయింపులు 3,056 | ఖర్చు 1,709 |
| 2022-23 | కేటాయింపులు 3.415 | ఖర్చు 1,850 |
| మొత్తం: | కేటాయింపులు: 25,453 కోట్లు | ఖర్చు:16,809 కోట్లు |

గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ పాలల్లో. ఎస్సీ ఎస్టీలకు బీసీలకు మేము అభివృద్ధి చేశాం అంటూ గొప్పలు చెప్పుతూముసలి కన్నీరు కారుస్తున్న కేసీఆర్. ఇక బిజెపికి మాత్రం బీసీలరిజర్వేషన్లను ఎత్తేయడమే బిజెపి. ఆర్ఎస్ఎస్. మూల సిద్ధాంతం. మోదీకి బీసీలపై ప్రేమ లేదు అనేది నగ్న సత్యం. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా బీసీ. ఎంబీసీ మైనార్టీ ల అభివృద్ధి కొరకై పనిచేస్తుందని తెలంగాణ సమాజం మొత్తం కోరుకుంటుందనేది నగ్నసత్యం.



మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు
95508 44433

---

## జలపీడనం!

మళ్ళీ వాన!
పాత గాయం మరవక ముందే
మళ్ళీ జలవిలయం తెచ్చిన ప్రకృతి!
అతివృష్టి అనావృష్టి పర్యావరణ
విధ్వంసానికి పుట్టిన వికృత సంతానం
అడ్డంగా కొట్టేసిన మనిషి తప్పుల
జవాబు పత్రమే నేటి జలచిత్రం!
చూసుకోమని మళ్ళీ మళ్ళీ కళ్ళ
ముందుంచుతుంది ప్రకృతి
తప్పులు దిద్దుకుంటాడని ఆశ
ముంపు చిత్రాలు, ఎడారి చిత్రాలు...
ఎన్ని చూసినా చలించడు మనిషి!
ఏరోజుకారోజు పశ్చాత్తాపం కొత్తే!
నదులు సముద్రాల్లో ఆత్మహత్యలు
చేసికొంటున్నా తాగుకు సాగుకు నీటిని
మూటగట్టాలన్న పథకరచన లేదు
ఆవాసాలు చెరువుల్లో తిష్టేసి తిన్నింటి
వాసాలు లెక్కెడుతున్నా లెక్క లేదు
గట్టిగా ఉన్నాయన్న భరోసా తెగిన
గట్లతోనే కొట్టుకు పోతున్నా పట్టింపు లేదు
భూమిని చేరిన ప్రతి బొట్టు గర్భానికి
చేరడానికి సవాలక్ష కాలుష్యాలు...
బొట్టు పెట్టి బోధించినా వినం కాబట్టి
అనుభవాల్నుంచైనా పాఠాలు నేర్చుకొందాం!

భీమవరపు పురుషోత్తమ్
రాజమండ్రి
9949800253



## శాస్త్రీయ సంగీతానికి ప్రాచుర్యం కల్పించిన గిరిజాదేవి

గిరిజాదేవి సేనియా, బెనారస్ ఘరానాకు చెందిన ఒక భారతీయ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు. ఆమె లలిత శాస్త్రీయ సంగీతంతో పాటుగా టుమ్రీలను గానం చేశారు. గిరిజాదేవి వారణాసిలో ఒక జమీందారీ కుటుంబంలో మే 8, 1929లో జన్మించారు. ఆమె తండ్రి రాందేవ్ రాయ్ హార్మోనియం వాయించేవారు.తండ్రి ఆమెకు తొలి సంగీత గురువు. ఆమె తన ఐదవ యేట నుండి ప్రముఖ సారంగి విద్వాంసుడు సర్జు ప్రసాద్ మిశ్రా వద్ద ఖయాల్ , టప్పాలు పాడడం నేర్చుకున్నారు.. తర్వాత శ్రీచంద్ మిశ్రా వద్ద వివిధ రీతుల సంగీతాన్ని అభ్యసించారు.తన తొమ్మిదవ యేట "యాద్ రహే" అనే సినిమాలో నటించారు.



గిరిజా దేవి తొలి సారి ఆకాశవాణి అలహాబాద్ కేంద్రం ద్వారా 1949లో బహిరంగంగా పాడారు. కానీ ఉన్నత తరగతి కుటుంబీకులు బహిరంగంగా ప్రదర్శనలు ఇవ్వడం సంప్రదాయం కాదని తన తల్లి, అమ్మమ్మల నుండి వ్యతిరేకత రావడంతో కొంతకాలం ఆమె సంగీతం నాలుగు గోడలకే పరిమిత మయ్యింది. చివరకు 1951లో బీహార్లో ఈమె తన తొలి సంగీత ప్రదర్శన చేసింది. ఆమె శ్రీచంద్ మిశ్రా వద్ద ఆయన 1960లలో మరణించే వరకు శిష్యరికం చేశారు. 1980లలో కలకత్తాలోని ఐ.టి.సి.సంగీత్ రీసర్చ్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యురాలిగా పనిచేశారు. 1990 తొలినాళ్లలో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో సంగీత శాఖలో పని చేసి పలువురికి సంగీత పాఠాలు నేర్పి తన సంగీత వారసత్వాన్ని నిలుపుకున్నారు. ఆమె తరచూ పలుచోట్ల పర్యటిస్తూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

గిరిజా దేవి బెనారస్ ఘరానా పద్ధతిలో, పూరబీ అంగ్, టుమ్రీ పద్ధతులలో పాడి ఆ శాస్త్రీయ పద్ధతులకు ప్రాచుర్యం కల్పించారు. ఈమె కచేరిల్లో కజ్రి, చైతీ, హెూలీ, ఖయాల్, జానపద గీతాలు, టప్పా మొదలైన పాక్షిక సాంప్రదాయ శాస్త్రీయ పద్ధతులలోని పాటలు ఉంటాయి. ఆమె "క్వీన్ ఆఫ్ టుమ్రీ"గా పరిగణించ బడింది. ఆమె శిష్యురాలు మమతా భార్గవ అలంకార్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ద్వారా అనేక మందికి సంగీత శిక్షణ ఇచ్చారు.

ఆమె పద్మశ్రీ పురస్కారం (1972), పద్మ భూషణ్ (1989), పద్మ విభూషణ్ (2016), సంగీత నాటక అకాడమీ అవార్డు (1977), సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ (2010), మహా సంగీత్ సమ్మాన్ అవార్డు (2012), సంగీత్ సమ్మాన్ అవార్డు, గ్లోబల్ ఇండియన్ మ్యూజిక్ అకాడమీ అవార్డ్ 2012 (జీవన సాఫల్య పురస్కారం), తనరిరి పురస్కార్ సొంతం చేసుకుంది. ఆమె తన 88వ యేట అక్టోబర్ 24, 2017 న కోల్కతాలో గుండెపోటుతో మరణించారు.

## జ్ఞాన దీప్తి

పుస్తకమే వెన్నెల వర్షం
పుస్తకమే అమృత హర్షం
పుస్తకమే ఆత్మీయ నేస్తం
పుస్తకమే ఓ అభయ హస్తం

పుస్తకమే ఓ దిక్సూచి
పుస్తకమే ఓ మార్గదర్శి
పుస్తకమే ఓ గురుమూర్తి
పుస్తకమే చెరగని ఆస్తి

పుస్తకమే ఓ జ్ఞాన దీప్తి
పుస్తకమే కారుణ్య స్ఫూర్తి
పుస్తకమే ఓ దివ్యజ్యోతి
పుస్తకమే ఓ క్రాంత దర్శి

పుస్తకమే ఓ అనురాగం
పుస్తకమే ఓ మమకారం
పుస్తకమే ఓ సంగీతం
పుస్తకమే సజ్జన సాంగత్యం

పుస్తకమే ఓ ఆమని
పుస్తకమే ఓ మధువని
పుస్తకమే ఓ జననీ
పుస్తకమే సంజీవని

రచన: గుండాల నరేంద్రబాబు
తెలుగు సాహిత్య పరిశోధకులు
తిరుపతి. సెల్ :9493235992

## అందచందాలు

అందం స్మరణీయం అందం శ్లాఘనీయం
అందం అజరామరం అందం అప్రతిహతం
అందం ఆకర్షణీయం అందం ఆస్వాదనీయం
అందం ఎల్లకాలమానందం అందం
ఎల్లవేళలాదర్శనీయం

అందం అన్నింటిలోదృగ్గోచరం
అందం అన్నిచోట్లాసాక్షిభూతం
అందం సూర్యప్రకాశం
అందం చంద్రబింబం

అందం ఆకాశం అందం భూగోళం
అందం అరణ్యం అందం సముద్రం
అందం మధురం అందం శ్రావ్యం
అందం అమృతతుల్యం అందం వినాశరహితం

అందం నేత్రాలకాహారం
అందం ఉల్లాలకుత్సాహం
అందం జీవితమకరందం
అందం ఆరోగ్యప్రదాయకం
అందం అనుభవనీయం
అందం ఆలోచనీయం
అందం అమూల్యం
అందం అనంతం

అందం నా కవితలవిషయం
అందం నా జీవితమార్గదర్శకం
అందం చూపటం నాధ్యేయం
ఆనందం కలిగించటం నాలక్ష్యం

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం

# కాళేశ్వరం దేవాలయ అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష



**విశ్వంభర, భూపాలపల్లి:** భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను అదేశించారు. గురువారం మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం దేవాలయ కార్యనిర్వహణాధి కారి కార్యాలయంలో కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై దేవదాయ, రెవెన్యూ, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత నెలలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావులు దేవాలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పనపై సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారని, అట్టి సూచనల మేరకు దేవాలయ అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు చేసి వదిలిన దుస్తులు, గోదావరిలో వేయకుండా ప్రత్యేకంగా ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి నుండి వ్యర్థాలు గోదావరిలోకి వదలకుండా చేపట్టనున్న పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి రక్షణమే పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోదావరి నది ఒడ్డున మహిళలు, పురుషులు పుణ్య స్నానాలు ఆచరించిన తదుపరి బట్టలు మార్చుకునేందుకు బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వచ్చే సంవత్సరం జరగనున్న సరస్వతి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు వాహనాలు పార్కింగ్ చేయుటకు ప్రయివేటు స్థలాలను గుర్తించి వాహనాలు పార్కింగ్‌కు చర్యలు చేపట్టాలని తెలిపారు. 100 గదుల సత్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు నత్తనడకన జరుగుతున్నాయని చాలా ప్రాధాన్యత ఉన్న పనులని వేగవంతం చేయాలని సూచించారు. దేవాలయంతో పాటు పరిసరాల్లో ఓమ్ నమః శివాయా శివ నామస్మరణ వినిపించేలా చర్యలు తీసుకోవాలని దేవాలయ అధికారులను ఆదేశించారు. గోదావరి ఘాట్ వద్ద భక్తులకు 24 గంటలు నీకు సరఫరా జరిగేలా పనులను త్వరగా పూర్తి చేయాలని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోదావరి ఘాట్ వద్ద పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా శాశ్వత ప్రాతిపదికన 20 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయుటకు కార్యచరణలు సిద్ధం చేయాలని పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గుండం చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయుటకు, సుందరీకరణకు ప్రతి పాదనలు అందించాలని సూచించారు. వ్యర్థాలు తరలింపుకు ప్రత్యేకంగా ట్రాక్టర్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిరంచి వెళ్లే గోదావరి వంతెనపై విద్యుత్ దీపాలు ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారుల ద్వారా ప్రతిపాదనలు తయారు చేపిస్తామని తెలిపారు. అంతకుముందు ఆలయ అభివృద్ధికి ఇంజనీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మాయాక్ సింగ్, డీపీఓ నారాయణరావు, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మారుతి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డీటీ కృష్ణ పాల్గొన్నారు.

# పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**విశ్వంభర, సూర్యాపేట:** పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీమంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పత్తి రైతుల సమస్యలపై రిప్రజెంటేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఇట్టి సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని గవర్నర్‌ను ఆయన కోరినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వరదల్లో పత్తి రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని, ఎక్కడ కూడా వారికి ఒక రూపాయి సాయం చేసినట్లు గానీ, వారి నష్టాన్ని కూడా అంచనా వేసే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. అదే సమయంలో పత్తి కి సంబంధించి మన రాష్ట్రం పట్ల కేంద్రం కూడా వివక్ష చూపిస్తుందన్నారు. వాస్తవానికి గుజరాత్ రాష్ట్రం పండించే పత్తి కంటే తెలంగాణ రాష్ట్రం రైతాంగం పండించే పత్తి మంచిదని, నాణ్యమైందని అనేక సందర్భాల్లో (సీసీఐ) కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రశంసించిందిన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణ రైతాంగానికి 8257 మద్దతు ధరను ఇప్పించాలని కోరారు. అలాగే తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం



ఇస్తానన్న 475 రూపాయలు బోనస్ ను కూడా ఇప్పించాలన్నారు. వరుసగా అకాల వర్షాలతో పత్తి తడిసిపోయి దెబ్బతిన్నదని, రావలసిన దిగుబడి కూడా అందలేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం అంచనా ప్రకారం ఎకరానికి 10 నుంచి 12 కింటాలు వరకు రావాల్సిన పత్తి ఈ ఏడాదిఅకాల వర్షాలతో నాలుగు కింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకని పత్తి రైతుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వారిని ఆదుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి కోరారు.

## రైళ్లను తిరిగి పునరుద్దరించాలి

### ఎంపీ పోరిక బలరాం నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్:** సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఆధ్వర్యంలో గురువారం కీలక సమావేశం జరిగింది. రైల్వే స్టేషన్లో గతంలో హాల్టింగ్ కలిగి ఉండే బీదర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, పద్మావతి ఎక్స్ ప్రెస్(అప్), కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, సాయినగర్ షిర్డీ, సాయినగర్ షిర్డీ వీక్లీ ఎక్స్ప్రెస్ లను పునరుద్దరించాలని ఎంపీ బలరాం నాయక్ కోరారు. ముఖ్యంగా ఆ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా నాగర్ సోల్ ఎక్స్ ప్రెస్, ఇంటర్సిటీ ఎక్స్ ప్రెస్ ఈ రెండు రైళ్లు కేసముద్రంలో హాల్టింగ్ ఇప్పిస్తే హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణీలకు సౌకర్యంగా ఉంటుంది అని అన్నారు. రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్దరణ చేయాలని కోరారు. కేసముద్రం స్టేషన్ పరిధిలో అండర్ బ్రిడ్జి త్వరగా మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. తాళ్ల పూసపల్లి వద్ద గేట్ నెంబర్ 79 ఎస్ నెంబర్ 428/10-12 వద్ద అండర్ పాస్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. వారితో పాటు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర రావు, బోడ విక్కి, రామచందర్ ఉన్నారు.

## బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పోతిరెడ్డిపల్లి, ఉప్పలపహాడు గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు(ఎం) బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో నూతన సభ్యత నమోదు కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సాయి రెడ్డి చంద్రారెడ్డి, భూతు అధ్యక్షులు మక్కా లింగయ్య, ఆత్మకూరు గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.


## మోటకొండూర్ మార్కెట్ ఏర్పాటు పై సవతి తల్లి ప్రేమ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు తండా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ మరియు ప్రజల ఒత్తిడి, పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే మూటకొండూర్ మార్కెట్ కమిటీ ఏర్పాటు జరిగిందని, గత ప్రభుత్వం హామీ ఇచ్చి జీవోను విడుదల చేశామని చెబుతున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇప్పుడున్న ప్రభుత్వం మోటకొండూర్ మార్కెట్ కమిటీని తుంగలో తొక్కి ఆలేరు మార్కెట్ కమిటీని కొనసాగించడం శోచనీయమని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పటి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. గత ఎమ్మెల్యే, ఇప్పటి ఎమ్మెల్యే ఇద్దరు ఒకే రీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. నాణానికి బొమ్మ, బొరుసు వలె ఉన్నారని, మూటకొండూర్ ప్రాంతంపై గత ఎమ్మెల్యే ఏ విధంగా సవితి తల్లి ప్రేమ చూపించారో, ఇప్పటి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూడా సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్, మండల ఉపాధ్యక్షులు మల్ల అశోక్, మండల ప్రధాన కార్యదర్శి ఆలేటి నాగరాజు, మండల కోశాధికారి బాల్ద నరసింహులు, మండల సోషల్ మీడియా కన్వీనర్ శనిగారం ప్రదీప్, కో కన్వీనర్ సొప్పరి సాయికుమార్ పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

### కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు



**విశ్వంభర, కోరుట్ల:** గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ సర్కార్ పదేండ్ల పాటు అధికారంలోకి ఉండి గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని అన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి ముందడుగు వేసిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

## విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే కాలేరు సమావేశం



**విశ్వంభర, అంబర్ పేట్:** గోల్నాక క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నల్లకుంట డివిజన్ గాంధీ నగర్ లంక వాసుల పెండింగ్ లో ఉన్న విద్యుత్ కనెక్షన్లు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. గాంధీనగర్ లంక బస్తీ వాసుల సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న విద్యుత్ మీటర్ల గురించి పై అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే త్వరలో వారికీ విద్యుత్ మీటర్ల కనెక్షన్ల విషయంలో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు అజామాబాద్ డీఈ కమల్ కుమార్ కుమార్, ఏడీఈ కె. శ్రీనయ్య, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్ శివశంకర్, ఏడీఈ నాగేశ్వరరావు, గాంధీ నగర్ (లంక) బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా అరికట్టేందుకు పోలీసుల సంచలన నిర్ణయం

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** అక్రమ రవాణని అరికట్టేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. భద్రాచలం చెక్‌పోస్టు వేదికగా అక్రమ ఇసుక, గంజా, పీడీఎస్ బియ్యం, జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రంగం సిద్ధం చేశారు. చెక్ పోస్ట్ వద్ద జిల్లాకి సంభందించిన సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు షిఫ్ట్‌ల వైజ్‌గా విధులను నిర్వహించాలని మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల భద్రాచలం చెక్ పోస్ట్ వేదికగా అనేక అక్రమ రవాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావటంతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎప్పుడూ లేనివిధంగా జిల్లా పోలీసులు ఇటువంటి నిర్ణయం తీసుకోవటం ఇప్పుడు జిలా వ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తున్నది. ఇకపై జీరో దంధా ఇసుక రావణాకీ పోలీసులు చెక్ పెట్టనున్నారు. కాసులకి కక్కుర్తిపడి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న కొంతమంది కింది స్థాయి సిబ్బంది ఆగడాలకు చెక్ పెట్టడానికే ఈ చర్యలు చేపడుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## దాడి కేసులో ఆరుగురికి జైలు

**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీ ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులకు నాంపల్లి న్యాయస్థానం మూడు నెలలు జైలు శిక్షతో పాటు 100 రూపాయలు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పుగూడ శివసాయి నగర్‌కు చెందిన పొన్న శ్రీనివాస్ రావు పై 2018లో ఎన్. రఘువరన్, ఎన్. రాజు, జి. శ్రావణ్, ఎన్. సత్యనారాయణ, ఎన్. యాదమ్మ, ఎన్. సరస్వతి దాడికి పాల్పడ్డారు. దీనిపై కేసు నమోదు చేసిన ఛత్రినాక పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చాట్ షీట్ దాఖలు చేయగా కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు శిక్ష ఖరారు చేశారు.

## 27న ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**విశ్వంభర, చింతపల్లి:** వనస్థలిపురం ప్రసిద్ హాస్పిటల్ సారథ్యంలో మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. వైద్య రంగంలో అనుభవం కలిగిన డాక్టర్లచే చింతపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, సాయి బాబా టెంపుల్ ఎదురుగా ఈ నెల 27 ఆదివారం ఉ. 8-00 నుండి మధ్యాహ్నం 1-00 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రసిధ్ హాస్పిటల్ చైర్మన్ జూకూరి చైతన్య రాజు గురువారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపును నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘు వీరారెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభిస్తారని చైతన్య రాజు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య మరో జాతీయ రహదారి

### సూర్యాపేట-రాజమండ్రి వరకు

### 4 వరుసల నేషనల్ హైవే

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** తెలుగు రాష్ట్రాల మధ్య మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. సూర్యాపేట నుంచి కూసుమంచి, ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మీదుగా పోలవరం వద్ద పట్టిసీమనుకలిపేలా 2 వరుసలుగా ఉన్న ఈ రహదారిని 4 వరుసల రహదారిగా విస్తరించనున్నారు. 86.5 కిలోమీటర్ల మేర విస్తరణ జరగనుండగా, 40.42 కిలోమీటర్ల మేర తొలి ప్యాకేజీని రూ.367.97 కోట్లతో నిర్మించనున్నారు. జనవరిలో 4 వరుసల రహదారి పనులు ప్రారంభం కానున్నాయి.

## చారకొండ వెంకటేష్‌కు ఘన సన్మానం



**విశ్వంభర, ఆమనగల్లు:** తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్‌గా ఎన్నికైన చారకొండ వెంకటేష్‌ను అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేష్ హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘ నాయకులు సురేష్, కిరణ్, యాదయ్య, పాల్గొన్నారు.

## ఇద్దరు రౌడీషీటర్లకు రిమాండ్





**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో కరుడుగట్టిన రౌడీషీటర్లు మహమ్మద్ అయుబ్ ఖాన్ (54), మహమ్మద్ అశ్వక్ (40) లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపారు. కామాటీపుర పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది నమోదైన కేసులో తప్పించుకొని తిరుగుతున్న అయూబ్ ఖాన్ పై నాంపల్లి కోర్టు న్యాయస్థానం నాన్ బేలబుల్ వారంటీ జారీ చేసింది. అప్పటి నుంచి పరాయిలో ఉన్న అయూబ్ ఖాన్‌ను దక్షిణ మండలం టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్ఐలు నరసింహులు, ఆంజనేయులు బృందం అదుపులోకి తీసుకున్నారు. కామాటీపుర పోలీస్ స్టేషన్‌లో అప్పగించడంతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారు. పత్తే దర్వాజకు చెందిన మహమ్మద్ అయుబ్ ఖాన్ మొదట్లో లార్డ్ బజార్లో ఇనుప వస్తువులు విక్రయించేవాడు. అనంతరం చిన్నపాటి గొడవలు, సివిల్ వివాదాల్లో తల దూర్చడంతో శాలిబండ పోలీసులు ఇతనిపై రౌడీ షీట్ తెరిచారు. మూడు పోలీస్ కమిషనరేట్ పరిధిలలో 72 క్రిమినల్ కేసులు ఈయనపై నమోదయ్యాయి. వాటిలో14 హత్యలు, 14 హత్యాయత్నాలు, భూకబ్జాలు, బెదిరింపులు, అక్రమ ఆయుధాలు, దోపిడీలే అధికంగా ఉన్నాయి. పీడీయాక్ట్ ప్రయోగించి జైలుకు పంపినా అతను మారలేదు. విడుదల అయిన తర్వాత మళ్లీ రౌడీ దందాలతో హల్చల్ చేసేవాడు. గతంలో నకిలీ పాస్పోర్ట్‌తో విదేశాలకు వెళ్లడం సంచలనంగా మారింది. దుబాయ్ నుంచి బంగారం స్మగ్లింగ్, వివాదాల భూముల్లో పగా వేసి భారీ సంపాదించాడు. కుమారుడిని రాజకీయాల్లోకి తెచ్చేందుకు ప్రయత్నించాడు. ఇతను నగరంలోకి వచ్చాడన్న సమాచారంతో ఉత్తర మండలం టాస్ ఫోర్స్ పోలీసులు నిఘా వేసి అరెస్టు చేశారు.

## సాధారణ ప్రసవాలను పెంచాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** గూడూరు మండలం అయోధ్య పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రాథమిక వైద్యం, వ్యాధి నియంత్రణ, నివారణ లక్ష్యంగా నీతి ఆయోగ్ ఇండికేటర్ దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ మనస్పూర్తిగా పనిచేసి ప్రజలకు సేవ చేయాలని అన్నారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రతి ఒక్కరు వారి బాధ్యతలను తప్పక నిర్వర్తించాలని, సేవ చేయడమే గొప్ప ధర్మం అని అన్నారు. నిబద్ధతో పనిచేయాలని, మీరు అందజేసే ప్రతి సేవ చాలా గొప్పదని, ప్రతి ఒక్కరు లక్ష్యసాధన కోసం పనిచేస్తూ మాతా మరియు శిశు సంరక్షణ సేవలలో, ప్రధానంగా సిజేరియన్ ప్రసవాలను తగ్గించుతూ, సాధారణ ప్రసవాలను పెంచాలని, గర్భిణీలలో రక్త హీనతను తగ్గించాలని తెలిపారు. 12 వారాలలోపే గర్భిణీ లను నమోదు చేసుకొని మూడవ మరియు నాల్గవ గర్భిణీ పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియ చేశారు. 100% చిన్న పిల్లల టీకాల లక్ష్యాలను సాధించాలని, పుట్టుకతో వచ్చే లోపాలు కానీ, రుగ్మతలను త్వరితగతిన గుర్తించి వైద్య సేవలు అందచేయాలని సూచించారు. అసంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్ లో భాగంగా డయబెటిస్, హైపర్ టెన్షన్, క్యాన్సర్ లను గుర్తించి పూర్తి స్థాయి చికిత్స లను అందచేయాలని సూచించారు. అనుమానిత టీబీ రోగులను 100 % గుర్తించి పూర్తి స్థాయి చికిత్సను అందచేయాలని అన్నారు. లెప్రసీ వ్యాధి గలవారిని త్వరగా గుర్తించి వారికి చికిత్సలు అందజేయాలని అన్నారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగము, డాక్టరు సుధీర్ రెడ్డి, వైద్య అధికారి డాక్టర్ యమున, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సూపర్ వైజర్ సిబ్బంది, యంయల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డివిజనల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** నాలుగు మండలాకు ప్రధాన కూడలిగా ఉన్న ఆమనగల్లు మండల కేంద్రంలో ప్రభుత్వ డివిజనల్ కార్యాలయాలైన రాజస్వ మండలాధికారి కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ ట్రెజరరీ కార్యాలయం, ఏసీపీ కార్యాలయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమనగల్లు మండల కాంగ్రెస్ నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల ప్రజలు ఆర్డీఓ కార్యాలయ సేవలకు కందుకూరుకు వెళ్తుండగా, మాడ్గుల మండల ప్రజలు ఇబ్రహీంపట్నంకు వెళ్తున్నారని తెలిపారు. అదేవిధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలకు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల ప్రజలు మహేశ్వరంకు వెళ్తుండగా, మాడ్గుల మండల ప్రజలు ఇబ్రహీంపట్నంకు వెళ్తున్నారని అన్నారు. అంతేగాకుండ సబ్ ట్రెజరరీ కార్యాలయ సేవలకు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజలు కల్వకుర్తికి వెళ్తున్నారు. కార్యాలయాల ఏర్పాటుకు ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అన్ని కార్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలం ఉందని, ఇది కాక బీసీ హాస్టల్ స్థలం బస్టాండ్ పక్కన గతంలో పీఏసీఎస్ కార్యాలయం ఉన్న స్థలం వృధాగా ఉందని వాటిలో కార్యాలయం ఏర్పాటు చేస్తే అభ్యంతరం ఏమీ లేదని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విన్నవించారు.

## ఉచిత మెగా వైద్యశిబిరానికి అనుహ్య స్పందన



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలకేంద్రంలో ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనుహ్యస్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బి అశోక్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జి దీప్తి పాల్గొని 140 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన వారందరికి ఉచితంగా మందులను అందజేశారు. మహబూబాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు యాళ్ళ మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత మేగా వైద్య శిభిరంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ రవిచంద్రారెడ్డి, అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, సెక్రటరీ చాడా అశోక్ రెడ్డి, కోశాధికారి సిద్దార్థ్, లయన్స్ క్లబ్ సభ్యులు కరుణాకర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు నూతక్కి నరసింహారావు, వద్దుల సురేందర్ రెడ్డి, మేక దామోదర్ రెడ్డి, సంగెం భరత్, డాక్టర్ ఆర్ శ్రీనివాస్, దుడ్డెల వినోద్, సంగెం హర్షిత్, శ్రీనివాస్, ఆమెడ మల్లిఖార్జున్, దైదభద్రయ్య, కిన్నెర మల్లయ్య, మిర్యాల లచ్చయ్య, గంగరబోయిన రఘు, పిడమర్తి ప్రశాంత్ పాల్గొన్నారు.

## చేపల వ్యాపారిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి గ్రామంలో 600 ఎకరాల విస్తీర్ణంలో చిన్న చెరువు, పెద్ద చెరువులు ఉన్నాయి. అయితే చిన్న చెరువు, పెద్ద చెరువులో పట్టిన చేపలను మండల మత్స కారుల సొసైటీలో కేజీ చేపలు 100 రూపాయలు అమ్మాల్సిందిగా నిర్ణయించారు. ఇదిలా వుండగా చింతపల్లి గ్రామానికి చెందిన ఓ చేపల విక్రయ దళారి కేజీ చేపలు 300 రూపాయలకు అమ్ముతున్నాడని చింతపల్లి ఎమ్మార్వో రమాకాంత్ శర్మకు గ్రామ ప్రజలు మెమోరాండం అందించారు. ఈ చెరువుల్లో పట్టిన చేపలు విక్రయించేటప్పుడు చింతపల్లి గ్రామస్థులకు ముందుగా ప్రాధాన్యత ఇచ్చిన తరువాత, హైదరాబాద్ దళారులకు విక్రయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కానీ ఇట్టి మత్స్యకార సొసైటీ నిర్ణయాన్ని తుంగలో తొక్కి వారి అదేశాలు పాటించకుండా, అధిక ధరలకు విక్రయించడమే కాకుండా, చేపలు కొనేందుకు వెళ్లిన ప్రజలపై అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని చేపల దళారీని తక్షణమే తొలగించాలని ప్రజలు ఎమ్మార్వోకు తెలిపారు. అంతే కాకుండా చింతపల్లి చెరువులోకి వాగు నీరు రాకుండా ప్రధాన బ్రిడ్జ్ వద్ద కంచె ఏర్పాటు చేయగా చెత్త పేరుకు పోయి వాగు నీరు రాకుండా బ్రిడ్జ్ కుంగే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు హెచ్చరించారు. ఇట్టి విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి అట్టి చేపల దళారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

# అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికి అందాలి

## ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

### రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




**విశ్వంభర, సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గురువారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన గవర్నర్ కు ముందుగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖులతో సమావేశ మందిరంలో ముఖాముఖీ సమావేశం అయ్యారు. ముందుగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సూర్యాపేట జిల్లా ప్రాముఖ్యతను, సంస్కృతి, సంప్రదాయాలను, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమని, ఇందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలలో రక్తహీనత నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 475 గ్రామపంచాయతీలు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషమని, స్వచ్ఛ భారత్ అనేది ఒక కార్యక్రమం కాదని, ఇదొక ఉద్యమమని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యం అయితే వికసిత్ భారత్ సాధ్యమన్నారు. సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యం, విద్య రంగాలను పరిశీలిస్తే మెరుగైన స్థానంలో ఉన్నాయని, ప్రత్యేకించి విద్యలో 2024లో పదో తరగతిలో 96.91% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం లఅభినందనీయమన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లో విద్యతోపాటు, చిన్న చిన్న చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీ తెలియజేస్తే వారు ఇంకా విజ్ఞానవంతులు కావడానికి అవకాశం ఉందని అన్నారు. అలాగే ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయడం ద్వారా వారు ఎక్కువ జ్ఞానాన్ని పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. 2047 నాటికి ఇండియా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని ఆయన ఆకాంక్షించారు. సమాజం అంటే సంపద కాదని, సమాజం అంటే సంస్కృతి అని ఆయన చెప్పారు.రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తక్కువ వ్యవధిలోనే దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, తలసరి ఆదాయంలో సైతం ముందున్న రాష్ట్రంగా ముందుకు వెళుతున్నదని, ప్రత్యేకించి ఐటీ, సాఫ్ట్ వేర్, ఫార్మా, సైన్స్ రంగాలలో తెలంగాణ దేశంలోనే కాకుండా, ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నదని, వ్యవసాయంలో సైతం ముందుందని, 28 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ను వ్యవసాయానికి కేటించడం జరిగిందని, ప్రతి సంవత్సరం ఆరు లక్షల నూతన ఆయకట్టును సృష్టించి వచ్చే ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల నూతన ఆయకట్టు కల్పించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి అన్ని విషయాలలో చురుకైన సహకారం అందిస్తున్నదని, ఆహార భద్రతలో భాగంగా దారిద్రరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల బియ్యాన్ని అందజేస్తున్నామని, వారు మెరుగైన ఆహారాన్ని భుజించాలన్న ఉద్దేశంతో వచ్చే జనవరి నుండి సన్నబియ్యాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా 500 రూపాయల బోనస్ ను సన్నధాన్యానికి ఇస్తున్నామని, దేశంలోనే అత్యధిక ధాన్యాన్ని పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఈ వానాకాలం 150 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రాష్ట్రంలో పండించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా చేయాలని తమ లక్ష్యమని, రైతుల పండించిన ధాన్యం సేకరించేందుకు 20 వేల కోట్ల రూపాయలను అడ్వాన్స్ గా ఉంచడం జరిగిందని, సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల సౌకర్యం కింద ఆరు లక్షల 16 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతున్నదని, జిల్లాలో ఉన్న ప్రతి ఎకరాకు సాగునీరు రావాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. సూర్యాపేటకు సంస్కృతి, సంప్రదాయాల పరంగా, చరిత్రపరంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన పలువురు ప్రముఖులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, అడ్వకేట్లు వారి వారి రంగాలలో చేసిన కృషిని రాష్ట్ర గవర్నర్‌తో పంచుకున్నారు. పేరిణి రాజ్ కుమార్, వాలీబాల్ ప్లేయర్ సుధాకర్ రెడ్డి, నేషనల్ కబడ్డీ ప్లేయర్ రవీందర్ రెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు గ్రహీత మధుసూదన్ రావు, విద్యారంగంలో కృషి చేసిన వెంకటేశ్వర్లు, కాటుకూరి చంద్రారెడ్డి, తూము శ్రీనివాసరావు, వీర మహాదేవ్, ఉమారాణి పంచాయతీ కార్యదర్శి, కొత్త భద్రయ్య చారి, షేక్ ముస్తఫా, డాక్టర్ ఆనంద్, డాక్టర్ నందగోపాల్, అడ్వకేట్ శశిధర్, ప్రోగ్రెసివ్ ఫార్మర్ శేషు కుమార్, ఉత్తమ వ్యవసాయ జర్నలిస్టు ఎం గోపయ్య, కవి పెద్దిరెడ్డి గణేష్, థియేటర్ ఆర్టిస్టు వేముల వెంకటేశ్వర్లు, షీలా అవలీల, కవి, ఉపాధ్యాయుడు, రచయిత జి.వెంకటేశ్వర్లు, సిమెంటు ఇండస్ట్రీ డీవీఎస్సార్ రాఘవరావు, వేముల నాగరాజు, కెమికల్ ఇంజనీర్ రమేష్ బాబు, సాగర్ సిమెంట్ రమణమూర్తి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు దివ్య భవాని, ఎడవల్లి అనిల్ కుమార్ తదితరులు మాట్లాడారు. కోదాడ శాసన సభ్యురాలు ఉత్తం పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, హుజూర్నగర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గెల్లి అర్చన, సూర్యాపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ అన్నపూర్ణ, తిరుమలగిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ అనసూయ, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరఫున రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

## జమ్మయ్యను పరామర్శించిన మాజీ జెడ్పీటీసీ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రానికి చెందిన వీరముష్టి జమ్మయ్య గురువారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్ జమ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు ఆర్థిక సాయంగా మూడు వేల రూపాయలు, కౌన్సిలర్ గోరటి జ్యోతి నరసింహ 2 వేల రూపాయలు కలిపి 5 వేల రూపాయలను జమ్మయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జమ్మయ్య పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అంత్యక్రియలలో పాల్గొన్నారు. స్థానిక కౌన్సిలర్లు చక్కల లక్ష్మణ్, దివ్య శ్రీకాంత్ సింగ్, దుద్దు కృష్ణ యాదవ్, తోట మల్లేష్ నాయకులు, పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో కల్వర్టు రంధ్రాన్ని పూడ్చండి

### మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్



**విశ్వంభర, తలకొండపల్లి:** కడ్తాల్ మండల కేంద్రం నుండి తల కొండపల్లి మండల కేంద్రానికి వెళ్లే దొంగ రోడ్డుపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు పగిలిపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. ఈ రోడ్డుపై అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న ఎవరూ పట్టించుకోవడంలేదని తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ వాపోయారు. గత ప్రభుత్వంలో కూడా ఈ రెండు కిలోమీటర్ల మార్గం అడవిలో ఉన్నందున ఫారెస్ట్ అధికారుల అనుమతి లభించలేదని, గతంలో సింగల్ రోడ్డు మంచిగా ఉండేదని కానీ ఇప్పుడు ప్రయాణానికి చాలా ఇబ్బందికరంగా మారిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాడైన రోడ్డును పట్టించుకొని ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డును బాగు చేయించాలని మాజీ జెడ్పీటీసీ వెంకటేష్ కోరారు.

## మద్యం మత్తులో యువకుడి వీరంగం

### అర్ధ నగ్నంగా బస్టాండ్‌లో హల్‌చల్

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి సుమారు 10:30 గంటలకు ఒక యువకుడు మద్యం మత్తులో అర్ధనగ్నంగా హల్ చల్ చేస్తూ వీరంగం సృష్టించాడు. మండల కేంద్రానికి చెందిన ఒక యువకుడు బుధవారం ఉదయం నుంచే మద్యాన్ని విపరీతంగా సేవిస్తూ మద్యం మత్తులో మునిగితేలాడు. బుధవారం రాత్రి ఎవరు కనబడితే వారిని నానా బూతులు తిడుతూ చంపేస్తానని బెదిరింపులకు గురిచేస్తుండడంతో అటువైపుగా వెళ్లేవారు భయభ్రాంతులకు గురై వేరే దారి గుండా ఇండ్లకు చేరినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఆ యువకుడు మద్యంతో పాటు గంజాయి కూడా సేవించి ఇలా ప్రవర్తించాడని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేసారు. ఇప్పటికైనా పోలీసులు పెట్రోలింగ్ పెంచి ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా గ్యార్మీ షరీఫ్ పండుగ



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా గ్యార్మీ పండుగ జరుపుకోవడం సంతోషకరమైన విషయం అని గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దేశం అల్వాల్ రెడ్డి, వట్టేపు కృష్ణయ్య, సునిత వెంకట్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ వైస్ ఛైర్మన్ నిజాముద్దీన్, రైతు సమన్వయ మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖజమైనోద్దీన్, తాజుద్దీన్, దస్తగిరి, నిజాం సర్వార్, జహంగీర్, ఖాదర్, షరీఫ్, మాజీ వార్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, గౌసుద్దీన్, దున్న భాస్కర్, సిద్ధిఖీ, ఖాజా, ఆంజాద్ అలి, నామని రామకృష్ణ, రహీమ్, యాకూబ్, సలీం, భాస్కర్ రెడ్డి, అబ్జాల్, జహంగీర్, జామల్, మహబూబ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

## కార్మికుల ఆత్మీయ సమావేశం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణరాష్ట్ర పౌర సరఫరాల సంస్థ హమాలీ వర్కర్ యూనియన్ (BRTU) హైదరాబాద్ కార్మికుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై కార్మికుల సమస్యలపై మాట్లాడారు. యూనియన్ అధ్యక్షులు హమాలీ శ్రీనివాస్, శివ కుమార్ తదితర యూనియన్ లీడర్స్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్‌ను సన్మానించారు.

## డెంటల్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి



**విశ్వంభర, కాప్రా :** కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్‌రావు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఆర్యాస్ డెంటల్ హాస్పిటల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డాక్టర్ ఆర్యాస్ డెంటల్ క్లినిక్ యజమాని డాక్టర్ హేమంత్ కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా లయన్స్ క్లబ్, ప్రభుత్వ పాఠశాలల్లో, పారిశ్రామిక వాడల్లో తరచుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. అదేవిధంగా వారి కుటుంబ సభ్యులు పీవీ రమణ స్వామి, పీవీ శ్యామల, హరిహర కుమార్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. ఏడు సంవత్సరాల నుంచి దంత వైద్య సేవలు అందిస్తున్నానని అన్నారు. హైదరాబాద్ సిటీలో ఇది ఐదవ బ్రాంచి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పావని రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, కాసం వెంకట హరి తదితరులు పాల్గొన్నారు.



మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బిల్దే రమేష్, సంఘ జనరల్ సెక్రెటరీ బిల్దే నగేష్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బిల్దే రమేష్, పి.ఆర్.ఓ కాసం వెంకట హరి మొదలగువారిని సన్మానించిన తులసి భవన్ షిరిడి.

## పంట నష్టం జరిగిన ప్రతీ రైతుకు పరిహారం చెల్లిస్తాం

### శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి



**విశ్వంభర, మిర్యాలగూడ:** వేములపల్లి, మాడుగులపల్లి మండలాల్లో అకాల వర్షాల కారణంగా పంటనష్టం జరిగిన పంట పొలాలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులు, రైతులతో కలసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కి వీడియో కాల్ ద్వారా జరిగిన పంట నష్టాన్ని చూపించి నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం జరిగే విధంగా వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతులు కష్టాల్లో ఉన్నారు అంటే ఎక్కడి దాకనైనా వెళ్ళడానికి మేము సిద్ధంగా ఉన్నామని రైతులకు ధైర్యం ఇచ్చారు. అలాగే నష్టపోయిన ప్రతీ ఒక్క రైతు వివరాలు సేకరించి ఉన్నత అధికారులకు తెలియజేయాలని వారితో పాటు వచ్చిన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం

- ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి
- ఎల్ఆర్ఎస్ ఉంటేనే ఇంటి నిర్మాణానికి అనుమతి
- సుడా పరిధిలో పెండింగ్ లో ఇరవై ఒక్కవేలకు పైగా అప్లికేషన్లు
- సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**విశ్వంభర, కరీంనగర్:** సుడా పరిధిలోని ప్రజలు ఎల్ఆర్ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలని, ఎల్ఆర్ఎస్ ఉంటేనే నూతన ఇంటి నిర్మాణం కోసం అనుమతి పొందే అవకాశం ఉంటుందని, ఎల్ఆర్ఎస్ కటాఫ్ తేదీ ముగిస్తే మళ్ళీ అవకాశం వచ్చేంత వరకు వేచి చూడాల్సి వస్తుందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడారు. 26 ఆగస్టు 2020 తర్వాత వ్యవసాయ భూముల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేసుకునే అవకాశం కానీ బిల్డింగ్ పర్మిషన్ కానీ తీసుకునే అవకాశం లేదన్నారు. అప్రూవల్ లేఅవుట్ ప్లాట్ లకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సుడా పరిధిలో ఇప్పటి వరకు ఇంకా ఇరవై ఒక్క వేల అప్లికేషన్లు పెండింగ్లో ఉన్నాయని, పెండింగ్ అప్లికేషన్ల క్రమబద్ధీకరణ కోసం త్వరితగతిన క్లియర్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సుడా అప్లికేషన్ లను సవరించడానికి, అనుమతి కోసం, గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులకు లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇక 1997 తరువాత మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరుగలేదని మాస్టర్ ప్లాన్‌ను నగరంతో పాటు శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో త్వరితగతిన అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే జోనింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని, రెసిడెన్షియల్ జోన్, కమర్షియల్ జోన్, ఇండస్ట్రియల్ జోన్ లుగా విభజించి ఎవరు ఏ పరిధిలోకి వస్తారో పూర్తిగా దాని ప్రకారం నిర్మాణాలకు అనుమతి లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈనెల చివరి లోపు మాస్టర్ ప్లాన్ పై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేల సమయం తీసుకొని అధికారుల సమక్షంలో ప్రజాభిప్రా యసేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సయ్యద్ ఖంరొద్దిన్, కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దండి రవీందర్, లయక్, షబానా మహమ్మద్, రజితా రెడ్డి, ముల్కల కవిత, తిరుమల, హసీనా, మహాలక్ష్మి, మాసుంఖాన్, సత్య నారాయణ రెడ్డి, కిరణ్ రెడ్డి, సుదర్శన్, షెహెన్నా, అస్తపురం రమేష్, కొట్టెప్రభాకర్, బషీర్, భారీ, ఖలీల్, నదీమ్, తమ్మడి ఎజ్రా పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**విశ్వంభర, చండూరు:** రైతు సేవా సహకార సంఘం చండూరు ఆధ్వర్యంలో మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలును డిసిసిబి చైర్మన్ కోడి సుష్మా వెంకన్న, ఆర్డీఓ సుబ్రమణ్యం లచే ప్రారంభోత్సవం చేసారు. రైతులు తమ వడ్లను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్ – ఏ 2302/- గ్రేడ్ – బి 2300/- రూపాయలు సన్న రకం వడ్లు పండించిన రైతులకు ప్రోత్సహంగా 500/- రూపాయలు బొనస్ ప్రకటించడం జరిగిందని అన్నారు. చండూర్,అంగడిపేట, కొండాపురం, తెరట్ పల్ల, కస్తాలలలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కావున మండల కేంద్రం లోని రైతులు తమ వడ్లను దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం తెలిపిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మద్దతు ధర పొందగలరని తెలిపారు. అలానే రైతులు వడ్లను కేంద్రానికి తీసుకవచ్చేటప్పుడు రైతు ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, భూమి పాసుపుస్తకాలు ఒకే రైతువి కేంద్రంలో అందించాలని అన్నారు. తేమ 17% లోపు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే రైతులు తమ ఆధార్ కార్డుకి ఫోన్ నెంబర్ తప్పకుండా లింక్ చేసుకొని ఉండాలి. రైతులు తమ పంట నమోదు వరి అని ఉన్నదో లేదో అని తమ ఏఈవో దగ్గర సరిచూసుకొని ఇట్టి అవకాశాన్ని మండల రైతు సోదరులు సద్వినియోగం చేసుకోగలరని రైతులకు సూచించారు. ఎంపిడిఓ పి.రాంరెడ్డి ,ఎమ్మార్వో దశరథ , ఏ .ఓ రేవతి, ఏఈవో నాగార్జున, సంఘ డైరెక్టర్లు గుండమల్ల శ్రీనివాస్, కట్ట భిక్షం, బోడ ఆంజనేయులు, మొగుదాల దశరథ, చింత శకుంతల, మిట్టపల్లి రాజు, దోలె నర్సాజీ, గిరి సత్తయ్య, అచ్చిన శ్రీనివాసులు, చెరుపల్లి ఆంజనేయులు, బాణవత్ ఘాసిరాం, దుబ్బాక రాములు, సంఘ సిబ్బంది, దోటి వెంకటేష్ యాదవ్, అనంత చంద్రశేఖర్, కారింగు రాముర్తి రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉదారతను చాటుకున్న సీఈఓ మీసాల స్వామి



**విశ్వంభర, వంగూరు:** నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలోని శ్రీ గోల్డ్ ఇన్ఫ్రా వెంచర్స్ ప్రాజెక్ట్ చాలెంజర్స్ టీమ్ లో మార్కెటింగ్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న అచ్చంపేట పట్టణానికి చెందిన అంతటి రామకృష్ణ సతీమణి శివలీల గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న శ్రీ గోల్డ్ ఇన్ఫ్రా వెంచర్స్ ప్రాజెక్ట్ సీఈఓ మీసాల స్వామి మానవత్వంతో వెంటనే స్పందించి ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. సీఈఓ మీసాల స్వామి మాట్లాడుతూ మా కంపెనీ లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క మార్కెటర్ యొక్క కుటుంబానికి ఎప్పుడూ ఏ ఆపద వచ్చినా వారి కుటుంభాలకు కంపెనీ అండగా ఉంటుంది తెలిపారు. అదేవిధంగా శ్రీ గోల్డ్ ఇన్ఫ్రా వెంచర్స్ కంపెనీలో మార్కెటర్స్‌గా పనిచేయుచున్న మిగతా మార్కెటర్స్ కూడా తమకు తోచిన రీతిలో రామకృష్ణకు ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీ గోల్డ్ ఇన్ఫ్రా వెంచర్స్ ప్రాజెక్ట్ హెచ్ఆర్ నాగశేషు యాదవ్, పీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

**విశ్వంభర, హైద్రాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పిసిసి) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ని నార్సింగ్‌లోని ఆయన నివాసంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.



# వేగం కన్నా.. ప్రాణం మిన్న

- ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**విశ్వంభర, మహబూబాబాద్:** రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా నివారించగలిగితే మనుషుల ప్రాణాలు రక్షించడమే కాకుండా, కుటుంబాలను నిలబెట్టిన వారమవుతామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు, అలాగే ఇతర రహదారులపై ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను పోలీసు, ఇంజనీరింగ్ అధికారుల సంయుక్త బృందాలు తనిఖీ చేసి సమర్పించిన నివేదిక ఆధారంగా, ప్రత్యేకించి పోలీసు అధికారుల సూచనల మేరకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. క్రమం తప్పకుండా వాహనాల తనిఖీ నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో ఆటోలు, బస్సుల వివరాలు సేకరించి, ఆ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి రూల్స్ ప్రకారం ప్రయాణించుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథన్ కెకన్ మాట్లాడుతూ జిల్లాలో 20 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో అన్ని రహదారులపై తనిఖీ నిర్వహించి ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, సబ్ ఇన్స్పెక్టర్ల సహకారంతో స్పీడ్ బ్రేకర్లు, లైట్లు, స్టాపర్స్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, వీటన్నిటిని ఏర్పాటు చేసిన తర్వాత ప్రమాదాల సంఖ్య తగ్గిందని తెలిపారు. జిల్లా మొత్తం కవర్ చేయడం ద్వారా బ్లాక్ స్పాట్స్‌లో ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇతర శాఖల ఇంజనీరింగ్ అధికారులు రోడ్లపై అవసరమైన చోట వెలుతురు ఉండేలా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే చికిత్స అందించి ప్రాణాలు కాపాడేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థలు, రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, జైపాల్ రెడ్డి, ఆర్టిఓ సాయి కిరణ్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వేంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మురళీధర్, మున్సిపల్ డీఈ ఉపేందర్, నేషనల్ హైవే డీఈ అమీర్, బషీర్, కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో గురువారం రోజు పీఏసీఎస్ ఆత్మకూరు(ఎం) సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూరెళ్ల, పుల్లయిగూడెం, పల్లెర్ల, లింగరాజుపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రములను పీఏసీఎస్ ఛైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ గంధమల్ల జహంగీర్, డైరెక్టర్స్ నార్కట్ పల్లి మల్లమ్మ, పుట్ట నిర్మల, తండ నర్సింహా, కూరెళ్ల శ్రీరాములు, వనం యాదయ్య, నాయకులు భాషబోయిన పాపయ్య యాదవ్, భాషబోయిన సత్యనారాయణ, ఎండీ మౌలానా, మాలి శంకర్ రెడ్డి, పుట్ట నర్సిరెడ్డి, భాషబోయిన నవీన్, సీఈఓ యాస కిరణ్ రెడ్డి, సిబ్బంది బిక్షపతి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ దత్త ఎంటర్ ప్రైజెస్‌ను ప్రారంభించిన దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** నాగిరెడ్డిపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకులు శివ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దత్త ఎంటర్ ప్రైజేస్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఆవుల యదయ్య, అల్లే కుమార్, బొక్క భూపాల్ రెడ్డి, రాజు నాయక్, గడ్డి అన్నారం డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, శశికాంత్ రెడ్డి, పొరండ్ల పండు, ఒగ్గు శంకర్, సాయిలు, ఆనంద్ రెడ్డి, నరేష్, కార్తీక్, నవీన్, లోకేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.42

## ప్రభుత్వ విద్యాలయాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రతి విద్యార్థికీ నాణ్యమైన భోజనం అందించేలా మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు తొలగింపు, స్వచ్ఛదనం - పచ్చదనం, మొక్కల సంరక్షణ చర్యలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పరిశీలన తదితర అంశాలపై గురువారం మండల ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలని ఆదేశించారు. అధికారుల పర్యటనల్లో గుర్తించిన సమస్యలను తక్షణం ఆయా శాఖల దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రహదారుల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. మొక్కల సంరక్షణకు ప్రతి శుక్రవారం నీళ్లు పోసే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. మండలాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను పరిశీలన చేయాలని ఆయన తెలిపారు. ఇంటింటి నుండి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌లో వర్మికంపోస్ట్ తయారు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లోపంవల్ల అపరిశుభ్రంగా మారాయని తాను గురువారం కాళేశ్వరంలో పల్లెప్రకృతి వనం పరిశీలించాలని, పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా ఉందని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**విశ్వంభర, కరీంనగర్:** హాస్టళ్ల నిర్వహణలో అధికారులు, సూపరింటెండెంట్లు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని బాలసదనం, సఖీసదన్, శిశుగృహ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. పిల్లలు, శిశువులు, వర్కింగ్ ఉమెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహంలో ఉండేవారి అన్ని వివరాలను రికార్డు చేయాలని అన్నారు. ప్రతి రికార్డును పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వసతిగృహాల సూపరింటెండెంట్లు, వార్డెన్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిశుగృహాలోని శిశువుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. బాల సదనం పాతభవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాస్టళ్లల్లో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టల్లోకి రానివ్వొద్దన్నారు. విద్యార్థులను కూడా బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సురక్షితమైన నీటినే తాగునీటిగా అందించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.

## బెహరాన్ దేశంలో వేంపేట గ్రామ వాసి మృతి



**విశ్వంభర, మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన మారంపల్లి సుధీర్ (35) బ్రతుకు తెరువు కోసం రెండున్నర సంవత్సరాల నుండి బెహరాన్ దేశానికి వలస పోయి జీవిస్తున్నాడు. సుధీర్ అప్పుల బాధలు ఎక్కువై నిన్న రాత్రి రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుధీర్‌కు ముగ్గురు ఆడపిల్లలు చిన్న వయసువారు ఉన్నారు. సుధీర్ కుటుంబాన్ని పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా మృతదేహాన్ని తొందరగా స్వగ్రామానికి తీసుకు వచ్చే విధంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వడి నర్సింగ రావు దృష్టికి తీసుకెళ్తానని, మృతి చెందిన సుధీర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని అల్లూరి మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేసిన మాజీమంత్రి



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం వ్యాప్తంగా 30 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన వికలాంగులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

### వికలాంగుల సంఘం మండల కార్యదర్శి రాజు గౌడ్




**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** మునుగోడు నియోజకవర్గంలో అర్హులైన వికలాంగులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని వికలాంగుల సంఘం మండల కార్యదర్శి పందుల రాజు గౌడ్ అన్నారు. ఇందిరమ్మ ఇల్లు నియోజకవర్గానికి ప్రభుత్వం ఇవ్వతలపెట్టిన 3500 ఇండ్లలో 1995 చట్టం, రిజర్వేషన్లు 35 ప్రకారం అర్హులైన దివ్యాంగులకు 300 ఇళ్లు మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి తరపున డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చి వికలాంగులకు మనోధైర్యాన్ని, గూడును కల్పించే విధంగా చూడాలని కోరారు.

## అంజికి అభినందనలు తెలిపిన ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్



**విశ్వంభర, మహబూబాబాద్:** ఈనెల 16 నుండి 19 వరకు తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీలో జరిగిన తెలంగాణ స్టేట్ ఫస్ట్ పోలీస్ డ్యూటీమీట్ లో భద్రాద్రి జోన్ మహబూబాబాద్ జిల్లా బీడీ టీమ్‌లో పనిచేస్తున్న కే అంజయ్య.. సీఐడీ ఛీఫ్ శిఖాగోయల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, అడిషనల్ డీజీ స్వాతి లక్రా చేతుల మీదుగా రూమ్ సెర్చ్‌లో గోల్డ్ మెడల్ అందుకోవడం జరిగింది. ఎవరైనా వీఐపీలు, వీవీఐపీలు ఒకప్రదేశానికి వచ్చినప్పుడు, వాళ్లు వుండే రూమ్‌ని ఎలాంటి అనుమానాస్పద వస్తువులు ఉండకుండా చూసుకునే విధానంలో తెలంగాణ రాష్టం నుండి 7 జోన్లు 5 కమిషనరేట్స్ నుండి పాల్గొన్నారు. ఈ విభాగంలో అంజయ్య గోల్డ్ మెడల్ సాదించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్ అంజయ్య ను ఎస్పీ ఛాంబర్ కు పిలిపించి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

## ప్రజాభిప్రాయ సేకరణపై వాస్తవిక నివేదిక పంపాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనకై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పూర్తి స్థాయిలో వ్యతిరేకత తెలిపినందున, ఎసెన్షియల్ కమిటీకి వాస్తవిక నివేదిక పంపి, పరిశ్రమ రాకుండా చూడాలని రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హనుమంత్ కె జండగె కు కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ రామన్నపేటలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో దాదాపుగా 10వేల మంది పాల్గొన్నారని తెలిపారు. వచ్చిన ప్రతీ వారు సిమెంట్ కాలుష్య పరిశ్రమ మాకొద్దు, మా ప్రాంతాన్ని కలుషితం చేయొద్దు అంటూ వ్యతిరేకించారు. అన్ని గ్రామాల ప్రజలు పరిశ్రమకు వ్యతిరేకంగా మాట్లాడాలని, పనులు వదులుకొని మరీ వచ్చి అభిప్రాయాలు తెలిపారు. కావున పూర్తిస్థాయిలో వ్యతిరేకంగా వచ్చిన అభిప్రాయాలను వాస్తవికంగా నివేదిక ఇవ్వాలని, పంపిన నివేదికను బహిరంగపరచి ప్రజాలముందు ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యం.డి జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ యం.డి రెహాన్, బీజేపీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మాజీ సర్పంచ్ గోదాసు పృధ్విరాజ్, టీడీపీ మండల నాయకులు ఫజల్ బేగ్, జమీరొద్దీన్, యండి. అక్రమ్, డీఎస్పీ మండల నాయకులు నకిరేకంటి నరేందర్, బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు, బీఎస్పీ మండల నాయకులు నోముల రాజు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**విశ్వంభర, భూపాలపల్లి:** మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తున్ననట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి రూరల్ మండలంలోని పంబాపూర్ భీమ్ ఘనపూర్ పెద్దచెరువులో భూపాల పల్లి జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఖదీర్ అహ్మద్, జిల్లా ఫిషరీస్ డెవలప్ మెంట్ ఆఫీసర్ అవినాష్, కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా అక్కడ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్యకారుల ఆర్థికాభివృద్ధికి నూరు శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే గురువారం పంబా పూర్ భీమ్ ఘనపూర్ పెద్ద చెరువులో సుమారు 50 వేల చేప పిల్లలను వదిలామని, వారంలోపు మరో 6 లక్షల చేప పిల్లలను వదులుతామని ఎమ్మెల్యే తెలిపారు.చెరువుల ద్వారా చేపల పెంపకంతో పాటు వ్యవసాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గొర్రెలు, చేపలు పథకాలలో అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యత కలిగిన చేప పిల్లలు వేస్తున్నామని అన్నారు. అవినీతికి పాల్పడితే సహించమని పేర్కొన్నారు.

## బీసీ జెఏసి చైర్మన్‌గా పెండెం ధనుంజయ్ నేత



**విశ్వంభర, హైద్రాబాద్ :** ఉమ్మడి నల్గొండ జిల్లా బిసి జేఏసీ చైర్మన్‌గా పెండెం ధనంజయనేత ఎన్నికయ్యారు. హైదరబాద్ విద్యానగర్ బిసి సంక్షేమ సంఘం కార్యాలయ భవనంలో జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా పెండెం ధనంజయ నేతకు నియామక పత్రం అందజేశారు.ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ధనంజయ్ లాంటి బలమైన వ్యక్తులు బిసి ఉద్యమంలో ముందుండడం చాలా సంతోషకరమని, ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ యువకులు బిసి ఉద్యమంలో పాల్గొని బహుజన రాజ్యాధికారం సాధించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నాయకులు జెల్లా నరేందర్, నీల వెంకటేశం, నందగోపాల్, ఉదయ్, వనమాల రమేష్, చాపల యాదయ్య, సయ్యద్, గంజి వెంకన్న, పాల్గొన్నారు.

## ఘనంగా భూతరాజు రామయ్య వర్ధంతి



**విశ్వంభర,చండూరు:** మున్సిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ ఆసుపత్రికి రెండు ఎకరాల భూమిని దానంగా ఇచ్చిన భూతరాజు రామయ్య 43వ వర్ధంతిని గురువారం ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. రామయ్య కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు అంజలి ఘటించారు. భూతరాజు మురళీ మాట్లాడుతూ, పేద బడుగు బలహీనర్గాలకు మెరుగైన వైద్యం అందాలని ఆకాంక్షించి ఆ రోజు మా తాత భూతరాజు రామయ్య ఆసుపత్రి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఆసుపత్రి ఉన్నంత కాలం ఆయన పేరు చిరస్మరణీయంగా ఉంటుందని అన్నారు. ఆయన ఆశయ సాధనకు తాము కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది, రామయ్య కుటుంబ సభ్యులు వెంకటేశం, యాదయ్య, నారాయణ, రమేష్, వేణు, రామకృష్ణ, మణికంఠ, సునీత, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవద్దు: ఎమ్మెల్యే సబిత



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు కట్ట పైన జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఆమే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసినటువంటి నిధుల్లో భాగంగా అన్ని చెరువులకు సుందరీకరణ నిధులు మంజూరు చేయడం జరిగిందని అట్టి నిధులను అడ్డుకోవడం వల్ల నేడు అన్ని పనులు కూడా నిరంతరాయంగా మిగిలిపోయాయని, అంతేకాకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం మంజూరైన నిధులు కూడా అడ్డుకోవడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు దృష్టిలో పెట్టుకొని ఆనాటి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తే ఈనాడు ముఖ్యమంత్రి ఆనిధులన్నీ అడ్డుకోవడం జరిగిందని, దయచేసి ఇప్పుడైనా ఆనాడు మంజూరైన నిధులు తక్షణమే మంజూరు చేయాలని, అభివృద్ధిని అడ్డుకోవద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

## బీసీ కులగణనకు ప్రజలందరూ సహకరించాలి

### బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ

**విశ్వంభర, కాటారం:** తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 13 వరకూ బీసీ కులగణన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ తెలిపారు. ఈనెల 28 నుంచి అధికారులు ఇళ్లకు వస్తారని, వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను సూచించారు. కులగణన జరగాలని చెప్పిన ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని, కుల గణన జరిగితే వెనకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన ఎప్పుడో చెప్పారని వెంకటరమణ అన్నారు. రైతులు, విద్యార్థులు ఇలా అందరి సమస్యలు తెలిసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. భాస్కర వెంకటరమణ మాట్లాడుతూ కులగణన చేసేందుకు గ్రామాలకు, మండలాలకు అధికారులు వస్తారని. ప్రజలు అధికారులు అడిగిన పూర్తి వివరాలు ఇచ్చి సహకరించాలని. బీసీ కులగణన జరిగితే వారి జనాభా ఎంతో తెలుస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు అందరూ వారి జనాభా తెలియజేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన తెలంగాణలో మొదలుపెట్టారని. గతంలో మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ మద్దతు ఇచ్చారని తెలిపారు. అందరూ కులగణనను వినియోగించుకోవాలని. వివరాలు ఇవ్వడం ద్వారా పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ మేయర్ ఎన్నికల్లో అందరికీ అవకాశం ఉంటుందని వెంకటరమణ తెలియజేశారు.

## కృష్ణయ్యకు కుటుంబానికి తోటి ఉద్యోగుల ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామానికి చెందిన కావలి కృష్ణయ్య గ్రామ పూర్వపు వీఆర్ఏగా ఉండి ప్రస్తుతం మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తూ ఈనెల 18న మరణించారు. తలకొండపల్లి మండలం పూర్వపు వీఆర్ఏలుగా పనిచేసి ప్రస్తుతం వివిధ శాఖలో పనిచేస్తున్న తోటి ఉద్యోగులు కృష్ణయ్య కుటుంబానికి 10 వేల ఐదు వందల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, గట్టు ఇప్పలపల్లి మల్లేష్, చంద్రమౌళి, పాండు పాల్గొన్నారు.

# యువకుల్లారా, విద్యార్థులారా మేలుకోండి..!

## పిడికిలి బిగించి మరో ఉద్యమానికి సిద్ధం కండి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో ఆదాని యజమాన్యం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టడానికి నిర్ణయించుకున్నారు. ఇక్కడి రైతులు భూమిని ఆదానికి కంపెనీకి తక్కువ రేటులో 360 ఎకరాలు అమ్మారు. రైతులకు అంబుజా సిమెంటు యాజమాన్యం డ్రై ఫ్రూట్స్ కంపెనీ పెడతాం, ఇక్కడి ప్రజలకు, యువకులకు ఉద్యోగాలు లభిస్తాయని రైతులకు మాయ మాటలు చెప్పి భూమిని కొనుగోలు చేసి, ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడతామని అనడం భావ్యం కాదు. నిత్యం జనాలు తిరిగే ప్రాంతంలో అంబుజా కంపెనీ పెట్టడం ఇక్కడ ప్రజలకు, యువకులకు, విద్యార్థులకు, ఊపిరితిత్తులు, గుండె, చర్మ వ్యాధులు సంభవించడానికి అవకాశముంది. ఈ సిమెంట్ ఫ్యాక్టరీ వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని, ఈ ప్రాంత ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జెడ్పీ ఛైర్మన్, ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లి అంబుజా ఫ్యాక్టరీని నిర్మాణం పర్మిషన్ రద్దు చేయాలని, భారత కమ్యూనిస్టు పార్టీగా మేం డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికీ ఈ ప్రాంతం ఒక దిక్కు మూసి పరివారిక ప్రాంతం, మరొక దిక్కు బాంబుల ఫ్యాక్టరీలు, కంకర మిల్లులతో, కాలుష్యంతో ఇక్కడ ప్రాంత ప్రజలు జీవనోపాధి కోల్పోయి, పంటలు పండక ఇక్కడ ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస పోవడం జరిగింది. ప్రభుత్వం ప్రజల మధ్యన నిర్మించే ఈ సిమెంట్ ఫ్యాక్టరీని తక్షణమే ఉపసంహరించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయాలని కోరుతున్నాం. రద్దు చేయకపోతే, ఈ ప్రాంత ప్రజల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ నిలబడి పోరాటం సాగిస్తుంది. విద్యార్థులు, యువకులు, ప్రజలు మేల్కొని ఉద్యమానికి సిద్ధం కావాలని తెలియజేస్తున్నాం. ప్రజా అభిప్రాయం చెప్పడానికి రామన్నపేటకు వస్తున్న మాజీ శాసనసభ్యులను పోలీసులు అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇలాంటి ధోరణి నిరంకుశత్వానికి దారితీయకుండా ముందుకు సాగాలని కోరుతున్నాం అని కామ్రేడ్ ఆర్.రాములు, ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ కార్యవర్గ సభ్యులు, రామన్నపేట తెలంగాణ మలిదశ ఉద్యమకారులు తెలిపారు.

## సైనిక వాహనంపై ఉగ్రదాడి ఇద్దరు జవాన్లు సహా నలుగురు మృతి

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. బారాముల్లాలో సైనిక వాహనంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు, మరో ఇద్దరు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు గాయపడినట్లు సమాచారం. గుల్మార్గ్‌లోని బోట్‌పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. 18 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన వాహనంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. జమ్మూకశ్మీర్‌లో గురువారం సాయంత్రం జరిగిన కాల్పుల్లో ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. అతడిని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రీతమ్ సింగ్‌గా గుర్తించారు. ఈ ఘటన చోటుచేసుకున్న కొన్ని గంటలకే ఆర్మీ వాహనంపై దాడిజరిగింది. జమ్మూకశ్మీర్‌లోగడిచిన 72గంటల్లో సైనిక వాహనంపై రెండోసారి కాల్పులకు తెగబడ్డారు.

## వరి కోతలు మొదలైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు

### ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని, గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వమని, ఈ రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకునే మాటలు వింటే సిగ్గు అనిపిస్తుందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ మండిపడ్డారు. ఇది కేవలం రైతులకు ద్రోహం చేస్తున్న, రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వమని విమర్శించారు. ఇవాళ కోతలు మొదలైన ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతోని ప్రైవేట్ వ్యక్తులు ప్రతి క్వింటాలుకు రూ. 1800ల నుండి రూ. 2000ల వరకు కొనుగోలు చేయడంతో రైతులు అన్యాయానికి గురవుతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 2,300ల వరకు కొనాల్సిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై ప్రైవేట్ వ్యక్తులతో రూ. 1800లకు కొనుగోలు చేయిస్తున్నదని అనుమానం వ్యక్తం చేశారు. ప్రతి కింటాకు 400 రూపాయలు ప్రతి రైతు నష్టపోతున్నాడని అన్నారు. 500 రూపాయల బోనస్ ఇస్తానన్న మాట తప్పి ఇవాళ 500 రూపాయలు సన్నావులకే ఇస్తామంటున్నారని, ప్రతి క్వింటాలకు 500 రూపాయల బోనస్ అన్ని రకాల వడ్లకు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనాలని 500 రూపాయల బోనస్ ఇవ్వాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డా. కోడి శ్రీనివాసులుకు ఘన సన్మానం...

### అభినందనలు తెలిపిన శ్రీ మార్కండేయ యువజన సంఘం



**విశ్వంభర, చండూరు:** శ్రీ మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు గంజి గంగాధర్, సంఘ సభ్యులు మహాత్మ గాంధీ శాంతి పురస్కార గ్రహీత గాంధీజీ విద్యా సంస్థలు, గాంధీ ఫౌండేషన్ , ట్రస్మా జిల్లా ప్రెసిడెంట్ డా.కోడి శ్రీనివాసులుకు మార్కండేయ దేవాలయం వద్ద ఘన సత్కారం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ సేవగుణానికి మారు పేరు అయిన డా.కోడి శ్రీనివాసులు గాంధీ శాంతి పురస్కారం అందుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, అలాగే రానున్న రోజుల్లో వారి గాంధీజీ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు మరింత విస్తృత పరచాలని అన్నారు. చిట్టిప్రోలు మహేష్, గంజి భిక్షం, కలిమికొండ కిరణ్, చిలుకూరి మణి, కర్నాటి రవి, గంజి అశోక్, సూరేపల్లి రాఘవేంద్ర, తిరందాస్ భాస్కర్, చేరుపల్లి సాయిరాం, గంజి కిరణ్, ముషం సురేష్, వనం పవన్ కుమార్ పాల్గొన్నారు.

## కొమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క..

**విశ్వంభర, ములుగు:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రం వైజంక్షన్ వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొమురంభీం విగ్రహాన్ని జ్యోతిప్రజ్వలన చేసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ముందుగా ఐటీడీఏ నుంచి వై జంక్షన్ వరకు గిరిజన నృత్యాలు,డోలు వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ... జల్, జంగిల్, మా ఊళ్ళో మా రాజ్యం అనే నినాదంతో, ఆదివాసీ అస్తిత్వం, కోసం,12 గూడాల ప్రజలను, ఐక్యం, చేస్తూ, నిజాం, ప్రభుత్వంతో తమ హక్కుల కోసం, పోరాడి, వీర మరణం పొందిన, వీరుడు కొమురం బీమ్ అన్నారు. కొమురం భీమ్ చేసిన పోరాటాలను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీలు ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో ఆదివాసుల అభివృద్ధికి,ప్రభుత్వం పలు అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం డివిజన్లోని ఆదివాసీ, తుడుండెబ్బ సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

# పట్టభద్రులారా ఆదరించి.. గెలిపించండి

- చిత్త శుద్ధితో పెద్దన్నలా సేవ చేస్తా
- న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకొస్తా

**ఉద్యోగ నిరుద్యోగ సమస్యల పై మండలిలో గళం విప్పుతా**
**నవంబరు 06 ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలి:**
**ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**




**విశ్వంభర, సంగారెడ్డి :** రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను ఆదరించి భారీ మెజారిటీతో గెలిపిస్తే నిరుద్యోగ పట్ట భద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పెద్దన్నలా పని చేస్తానని, ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో, జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు, బార్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ప్రకటించాలని కోరారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్ట్ యాక్ట్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని, న్యాయవాద వృత్తిలోకి విచ్చేసిన యువ న్యాయవాదులకు 5 వేలు గౌరవేతనం కోసం కృషి చేస్థానని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తాను 34 సంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందించడం తో పాటు చాలా మంది విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడం జరిగిందని అన్నారు. విద్యారంగ సమస్యలపై తనకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని. ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే ఉద్యోగ, నిరుద్యోగుల, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజాసేవ చేయడానికి తను మంచి ఆలోచన తో రాజకీయాల్లోకి వస్తున్నట్టు వెల్లడించారు. విద్యాశాఖలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎంఈఓ డిప్యూటీ డీఈఓలు ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మాడల్ స్కూల్, గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్, పార్ట్ టైం లెక్చరర్లకు 10 జీఓ ప్రకారం వేతనాలు అందే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని యూనివర్సిటీలో ఇంకా బ్లాక్ బోర్డులపైనే పాఠాలు చెబుతున్నారని ప్రతి ఒక్క ప్రొఫెసర్ కు ఒక ల్యాప్ టాప్ అవసరం ఉందని అన్నారు. గత ఎన్నికల్లో 1లక్ష, 97 వేల ఓట్లకు కేవలం 1లక్ష 7వేల మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. ఓటరు నమోదు పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వెల్లడించారు. ఈసారి 6 లక్షల ఓటరు నమోదు టార్గెట్ గా పనిచేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక పట్టభద్రుడు నవంబర్ 06 లోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## నవంబర్ 17న ఏఎన్ఎం యూనియన్ మహాసభ




**విశ్వంభర, శంషాబాద్:** రంగారెడ్డి జిల్లాలో నవంబర్ 17న జరిగే ఏఎన్ఎంల యూనియన్ రెండవ మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం గురువారం శంషాబాద్ లోని ఓక్ హోటల్లో జరిగింది. నవంబర్ 17 న జరిగే రెండవ ఏఎన్ఎంల యూనియన్ మహాసభలలో ఏఎన్ఎంలు, సంఘ సభ్యులు, నాయకులు పాల్గొని విజయవంతంచేయాలని ఆహ్వాన సంఘం నాయకులు కోరారు. అనంతరం మహాసభల నిర్వహణకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, రెండవ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, యూనియన్ రాష్ట్ర కోశాధికారి జే పద్మ, రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు రామస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ శేఖర్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, చందు యాదవ్, రంగారెడ్డి జిల్లా సెకండరీనంలో యూనియన్ నాయకులు హాజరై మాట్లాడారు.

## పార్కింగ్ రుసుము వసూలు చేయడం తగదు

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రభుత్వం పార్కింగ్ టెండర్ల పేరుతో పార్కింగ్ రుసుము వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా నిర్వాహకుల వినతి మేరకు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అడ్డా నందు జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అడ్డా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వం పార్కింగ్ టెండర్ల పేరుతో పార్కింగ్ రుసుము వసూలు చేయడం జరుగుతుందనే విషయం మా దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎలాంటి టెండర్ లేకుండా ఉచితంగా సదుపాయాలు కల్పించాలని సుధీర్ రెడ్డి కోరారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో లారీల పార్కింగ్ అడ్డా ఆటోనగర్ ప్రధాన రహదారిపై ఉండడం వల్ల చుట్టుప్రక్కల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ కి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి మరొక్కచోట అనువైన స్థలం కేటాయించలని కోరడం జరిగిందన్నారు. వారు ఆటోనగర్ లోపల ఒక విశాలమైన స్థలం ఉచితంగా కేటాయించడం జరిగిందని. ఇప్పుడు ప్రభుత్వం పార్కింగ్ టెండర్ పేరిట ప్రతి ఒక్క లారీల దగ్గర డబ్బులు వసూలు చేయడానికి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు కట్టకుండా ఉచితంగా లారీలు పార్కింగ్ చేయించడం జరుగు తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, సీనియర్ నాయకులు క్యామ మల్లేష్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, ఇసుక లారీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వీ యాదగిరి గౌడ్, ఉపాధ్యక్షులు ఏం.డి. సలీం, ఆటోనగర్ న్యూ ఇసుక లారీల అడ్డ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్ యాదవ్, జనరల్ సెక్రటరీ సందీప్ రెడ్డి, దామోదర్ గౌడ్, కొత్తపేట అధ్యక్షులు మర్రి వెంకన్న, యాదగిరి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని చౌదర్‌గూడ మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ డిప్యూటేషన్ పై వెళ్లిన తెలుగు, ఇంగ్లీషు, ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు రప్పించాలని వారి డిప్యూటేషన్‌ను వెంటనే క్యాన్సిల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ ఎఫ్ ఇంచార్జ్ ఆకాష్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఉపాధ్యా యులు తమకు ఇష్టం వచ్చినట్టు డిప్యూటేషన్ పై వెళ్లితే విద్యార్థులు తమ చదువును నష్టపోతున్నారని పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతుందని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యక్షులు రమేష్, నరేందర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిలిప్పీన్స్‌లో తుపాన్‌తో భారీ వరదలు

- కొట్టుకుపోయిన కార్లు
- కొండచరియలు విరిగిపడి 24 మంది మృతి
- ఇళ్ల పైకి ఎక్కిన ప్రజలు



**మనీలా:** ఈశాన్య ఫిలిప్పీన్స్‌లో ఉష్ణమండల తుఫాను కారణంగా భారీగా వరదలు వచ్చాయి. కొండచరియలు విరిగి గురువారం కనీసం 24 మంది మృతి చెందాయి. కార్లు కొట్టుకుపోయాయి. వరదల్లో చిక్కుకున్న గ్రామస్థులను రక్షించడానికి మోటర్‌బోట్‌ల అధికారులు ఏర్పాటు చేశారు. కొంతమంది పైకప్పులపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. ఉష్ణమండల తుఫాను ట్రామీ అర్ధరాత్రి తర్వాత దేశంలోని ఈశాన్య ప్రావిన్స్‌లోని ఇసాబెలాలోకి ప్రవేశించిన తరువాత మిలియన్ల మంది ప్రజలను రక్షించడానికి మొత్తం ప్రధాన ద్వీపం లుజోన్‌లో రెండవ రోజు ప్రభుత్వం పాఠశాలలు, కార్యాలయాలను మూసివేసింది. తెల్లవారుజామున అత్యంత వేగంతో గాలులు వీచిన తర్వాత ఇఫుగావో పర్వత ప్రావిన్స్‌లోని అగ్వినాల్డో పట్టణంపై తుఫాను విరుచుకుపడింది. ఇది పశ్చిమ దిశగా ప్రయాణిస్తోందని, గురువారం తర్వాత దక్షిణ చైనా సముద్రంలోకి ప్రవేశిస్తుందని అంచనా. వరదల్లో కనీసం 24 మంది చనిపోయారు. ఎక్కువగా బికోల్ ప్రాంతంలో, సమీపంలోని క్యాజోన్ ప్రావిన్స్‌లో వరదల్లో మునిగిపోవడం మరణించారు. కొండచరియలు విరిగిపడటం , నేలకూలిన చెట్లతో రోడ్లు మూసుకు పోవడంతో మరణాల సంఖ్య పెరుగుతుందని అధికారుల అంచనా. మనీలాకు ఆగ్నేయంగా ఉన్న బికోల్ ప్రాంతంలో మరణాలు ఎక్కువగా సంభవించాయి. ఇక్కడ కనీసం 20 మంది మరణించారు. ఇందులో నాగా నగరంలో 7 మంది ఉన్నారు. వరద నీటిలో చిక్కుకున్న వేలాది మంది గ్రామస్తులను ప్రభుత్వ బలగాలు రక్షించగా, బికోల్ ప్రాంతంలో గురువారం చాలా మందిని రక్షించారు. ఇందులో కొంతమంది ఇళ్ల పైకప్పులపై తలదాచుకున్నవారున్నారు. నాగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లాష్ వరదలు వచ్చాయి. కార్లు మునిగిపోయాయి. సమీపంలోని అల్బే ప్రావిన్స్‌లోని 24 అగ్నిపర్వతాలలో ఒకటైన మయోన్ నుండి బురద ప్రవాహాలు అనేక వాహనాలను ముంచెత్తాయి. ఈ ప్రాంతంలో తుఫాను వాతావరణం కొనసాగుతోందని, సహాయక చర్యలకు ఆటంకం కలిగిందని అధికారులు తెలిపారు. తుఫాను కారణంగా 2 మిలియన్లకు పైగా ప్రజలు ప్రభావితమయ్యారని, వీరిలో 75,400 మంది గ్రామస్థులు తమ ఇళ్లను విడిచిపెట్టి, సురక్షితమైన మైదానంలో తలదాచుకుంటున్నారని అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం దాదాపు 20 తుఫానులు ఫిలిప్పీన్స్‌ను దెబ్బతీస్తాయి.

## మతి కోల్పోయిన డొనాల్డ్ ట్రంప్

- హిట్లర్‌ను ప్రశంసించడంపై కమలా హారిస్ ఆగ్రహం
- అమెరికన్ల మరణాలకు కారకుడికి ప్రశంసలు ప్రమాదకరం



**వాషింగ్టన్:** అమెరికాలో అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న డెమోక్రటిక్ అభ్యర్థిగా కమలాహారిస్, రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్రవిమర్శలు చేశారు. ఆయనకు క్రమంగా మతి తప్పుతోందని వ్యాఖ్యానించారు. ఇటీవల యూఎస్ మెరైన్ జనరల్ జాన్ కెల్లీ ఓమీడియాతో మాట్లాడుతూ.. 'హిట్లర్ కొన్ని మంచి పనులు చేశారని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాకు మిలటరీ బదులుగా హిట్లర్ వంటి జనరల్స్ ఉండాలని ఆయన భావిస్తున్నారు' అని పేర్కొన్నారు. కమలాహారిస్ మండిపడ్డారు. '6 మిలియన్ల మంది యూదులు, వందల వేల మంది అమెరికన్ల మరణాలకు కారణమైన వ్యక్తి హిట్లర్. అటువంటి వ్యక్తిని ప్రశంసించడం ఆందోళన కలిగిస్తుంది. ఇది చాలా ప్రమాదకరమైనది. అమెరికన్ ప్రజలకు ట్రంప్ ఎలాంటి వారు అనేందుకు ఈ వ్యాఖ్యలే నిదర్శనం' అని హారిస్ పేర్కొన్నారు.

**29న హారిస్ ప్రచార ముగింపు సభ..** అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉపాధ్యక్షురాలు కమలాహారిస్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. హారిస్ తన చివరి ఎన్నికల ప్రచార సభను ఈనెల 29న నిర్వహించనున్నట్లు ప్రచార అధికారి పేర్కొన్నారు. అయితే, 2021 జనవరి 6న జరిగిన అల్లర్లకు ముందు డొనాల్డ్ ట్రంప్ ర్యాలీ చేసిన చోటే ఆమె ప్రసంగిస్తారని తెలిపారు.

## గంగుల లక్ష్మీ నర్సమ్మకు నివాళులు

### నివాళులు అర్పించిన మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, కరీంనగర్:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో కలిసి గంగుల లక్ష్మీనర్సమ్మకు ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ మంగళవారం ఉదయం మృతి చెందిన విషయం తెలిసిందే. కేటీఆర్ గురువారం రాత్రి కరీంనగర్ లోని గంగుల నివాసానికి వెళ్లి లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలుచల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుమారులు గంగుల సుధాకర్, వెంకన్న, కమలాకర్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మీనర్సమ్మ మృతి పట్ల కేటీఆర్ తీవ్ర సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితర ప్రముఖులు ఉన్నారు.


## కేటీఆర్‌కు మెట్ పల్లిలో ఘన స్వాగతం



**విశ్వంభర, మెట్‌పల్లి:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బాల్క సుమన్ లతో కలిసి కరీంనగర్ గంగుల కమలాకర్ ను పరామర్శించడానికి వెళుతున్న క్రమంలో స్థానిక పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. నాయకులకు కార్యకర్తలకు అభిమానులను కేటీఆర్ కలసి అభివాదం చేశారు. కేసీఆర్ జిందాబాద్, కేటీఆర్ జిందాబాద్, టీఆర్ఎస్ జిందాబాద్ అనే కార్యకర్తల నినాదాలతో పాత బస్టాండ్ ప్రాంతం మార్మోగింది.

## ట్రావెల్స్ సేవలు అందరూ వినియోగించుకోవాలి


### రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



**విశ్వంభర, ఎల్బీనగర్:** ట్రావెల్స్ సేవలు అందరూ వినియోగించుకోవాలి అని టీపీసీసీ ప్రచార కమిటీరాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్ అన్నపూర్ణ క్లంపెక్స్‌లో కృష్ణ మోహన్, ప్రవీణ్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన సదరన్ ట్రావెల్స్ బ్రాంచ్ కార్యాలయం నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ట్రావెల్ రంగాల్లో రాణించాలని ప్రయాణికులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాండు రంగా రెడ్డి, ఆలపాటి ప్రవీణ్, కార్తిక్, దివ్య, రామరావు, సౌమ్య పాల్గొన్నారు.

# తీవ్ర రూపం దాల్చిన 'దానా' తుపాను



**భువనేశ్వర్:** వాయవ్య బంగాళాఖాతంలో 'దానా' తీవ్ర తుపానుగా మారింది. దానా ధాటికి ఒడిశా, బెంగాల్, ఝార్ఖండ్‌లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. సముద్రంలో అలల ఉద్ధృతి పెరిగింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున తుపాను తీరం దాటవచ్చని ఒడిశా వాతావరణ విభాగం తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులతో భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలూ అప్రమత్తమయ్యాయి. 'దానా'ను ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విద్యా సంస్థలను సైతం మూసివేశారు. ఒడిశాలోని పూరీ–సాగర్‌ద్వీపంమధ్య భితర్‌కనికా–ధమ్రాసమీపంలో తుపాను తీరం దాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఒడిశా ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కోస్తా జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. బుధవారం సాయంత్రానికే 3 లక్షల మందిని తరలించినట్లు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. మరో ఏడు లక్షల మందిని తరలించే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 14 జిల్లాల నుంచి 10 లక్షల 60 వేల మందిని తరలించాలని ఒడిశా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఎన్‌డీఆర్ఎఫ్ సహా విపత్తు నిర్వహణ బృందాలను 14 జిల్లాల్లో మోహరించారు. ఇక ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే 23వ తేదీ నుంచి 25 వరకు జరగాల్సిన పరీక్షలన్నింటినీ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నెల 27న జరగాల్సిన ఒడిశా సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షను సైతం వాయిదా వేశారు. కొత్త తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

## బెంగాల్‌లో అతి భారీ వర్షాలు..


తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న 'దానా' తుఫాన్ .. వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫాన్‌గా రూపాంతరం చెందింది.బెంగాల్‌లోని అనేక జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోల్‌కతాలో సైతం అడపాదడపా వానలు పడుతున్నాయి. తుపాను దృష్ట్యా తూర్పు, ఆగ్నేయ రైల్వేలు గురు, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేశాయి. దానా తుఫాను ప్రభావంతో ఝార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి. పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసేఅవకాశం ఉందని వాతావరణశాఖ అధికారి తెలిపారు. కొల్హాన్‌ప్రాంతంలో శుక్రవారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

## ఒడిశాలోని ఆ రెండు ఆలయాలు మూసివేత

తీవ్ర తుఫాను నేపథ్యంలో భారత పురావస్తు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ముందు జాగ్రత్త చర్యగా ఒడిశాలోని రెండు ప్రధాన ఆలయాలను మూసివేస్తున్నట్లు తెలిపింది. పూరీలోని జగన్నాథ ఆలయం తోపాటు.. కోణార్క్‌లోని సూర్య దేవాలయాన్ని మూసివేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తుఫాను కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ఆలయాలను మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.ఒడిశా రాష్ట్రంలోని పూరీలో వెలసిన ఈ రెండు ఆలయాలు ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ఆలయాల సందర్శనకు దేశ నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. తుఫాన్‌కారణంగా ముందు జాగ్రత్తగా ఈ ఆలయాలను మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆలయాలతోపాటు పలు స్మారక చిహ్నాలు, మ్యూజియంలను సైతం మూసివేయనున్నారు.ఇదిలా ఉండగా.. ఒడిశాలోని గం జాం, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రపారా, భద్రక్, బాలాసోర్, మయూర్‌భంజ్, కియోంజర్, ఢెంకనల్, జాజ్‌పూర్, అంగుల్, ఖోర్ధా, నయాగర్, కటక్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికలతో అప్రమత్తమైన అధికా రులు.. ఆయా జిల్లాల్లో పాఠశాలలను మూసివేయాలని ఆదేశిం చారు.ఇక దానా తుఫాను కారణంగా సౌత్ ఈస్టర్న్ పరిధిలో నడిచే దాదాపు 150 రైళ్లను అధికారులు రద్దు చేశారు. హౌరా–సికింద్రాబాద్ ఫలక్‌నుమాఎక్స్‌ప్రెస్, కామాఖ్య–యశ్వంత్‌పూర్ ఏసీఎక్స్‌ప్రెస్, హౌరా–పూరీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్, హౌరా – భువ నేశ్వర్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్, హౌరా – యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి.


# అమిత్ షా, ఒమర్ అబ్దుల్లా భేటీ

## జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై చర్చలు!




**శ్రీనగర్:** ఇటీవల జరిగిన జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో విజయం సాధించి ఒమర్ అబ్దుల్లా సీఎంగా బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆయన భేటీ అయినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలనే అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈమేరకు జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. ఇటీవల సీఎం ఒమర్ అబ్దుల్లా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈవిషయమై చర్చించేందుకు బుధవారం సాయంత్రం దిల్లీలో కేంద్రమంత్రి అమిత్ షాతో భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి కేంద్రం మద్దతు తెలపడంతో పాటు, రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సీఎం ఒమర్ అబ్దుల్లా నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి తీర్మానప్రతిని అందజేయనున్నట్లు తెలుస్తోంది.జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌సీ– కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. ఒమర్ అబ్దుల్లా సీఎం గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఆమోదించారు.

# ట్రాఫిక్ జామ్.. వాహనాలను వదిలి నడుచుకుంటూ ఇంటికి వెళ్లిన ప్రయాణికులు



**బెంగళూరు:** మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. సాధారణ సమయంలోనే ఇలా ఉంటే.. ఇక వరుస సెలవులు, భారీ వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. నగరం మొత్తం ఎక్కడికక్కడ స్తంభించిపోతుంటుంది. కిలోమీటరు దూరానికి గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. దీంతో ప్రజలు తమ ట్రాఫిక్ కష్టాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు.తాజాగా నగరంలో మరోసారి అలాంటి పరిస్థితే తలెత్తింది. బుధవారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో ఎలక్ట్రానిక్ సిటీ ఫ్లైఓవర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. టెకీలంతా తమ పనులను ముగించుకొని ఇంటికి వెళ్లే సమయం కావడంతో ఫ్లైఓవర్‌పై భారీగా జామ్ నెలకొంది. దాదాపు మూడు గంటలకు పైగా ఫ్లైఓవర్‌పైనే చిక్కుకుపోయిన పరిస్థితి. దీంతో విసుగుచెందిన కొందరు తమ కాళ్లకు పని చెప్పారు. వాహనాలను వదిలేసి నడుచుకుంటూ ఇంటి బాట పట్టారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# గాండేయ్ స్థానానికి నామినేషన్ కల్పనా సోరెన్



**గాండేయ్:** జార్ఖండ్ రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. జార?ండ్ ముక్తి మోర్చా నాయకురాలు, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ గాండేయ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ నామినేషన్ వేశారు. తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆమె వెంట పలువురు పార్టీ నేతలు ఉన్నారు.కాగా, మనీలాండరింగ్ కేసులో తన భర్త, సీఎం హేమంత్ సోరెన్ అరెస్ట్‌తో ఈ ఏడాది మార్చిలో కల్పనా సోరెన్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మే నెలలో జరిగిన ఉప ఎన్నికల్లో గాండేయ్ స్థానం నుంచి గెలుపొంది తొలిసారి అసెంబ్లీకి వెళ్లారు. గాండేయ్ ఎమ్మెల్యే (జేఎంఎం) సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దిలీప్ కుమార్ వర్మపై కల్పనా సోరెన్ 27 వేల ఆధిక్యంతో గెలుపొందారు. ఇప్పుడు అదే స్థానం నుంచి పోటీకి దిగారు.81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు జరగనుండగా.. మిగిలిని 38 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు ఉంటాయి. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.6 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. 29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఈసీ తెలిపింది. వచ్చే ఏడాది జనవరి 5తో జార?ండ్ అసెంబ్లీ గడువు ముగియనుంది.

# అర్ధ రూపాయి చెల్లించనందుకు రూ.15,000 ఫైన్

చెన్నై: వినియోగదారు నుంచి 50 పైసలు అదనంగా తీసుకున్న ఇండియన్ పోస్ట్‌కు వినియోగదారుల ఫోరం గట్టి షాక్ ఇచ్చింది. 50 పైసలతోపాటు నష్టపరిహారం కింద రూ.10,000బీ వ్యాజ్య ఖర్చుల కోసం రూ.5,000 చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదుదారు ఏ మానష తన ఫిర్యాదులో చేసిన ఆరోపణల ప్రకారం, ఆయన 2023 డిసెంబరు 13న పొజిచలూర్ పోస్టాఫీసులో రిజిస్టర్డ్ లెటర్ బుక్ చేశారు.దానికి పోస్టాఫీసు ఇచ్చిన రశీదులో రూ.29.50 వసూలు చేసినట్లు తెలిపింది. కానీ ఆయన వద్ద నుంచి రూ.30 వసూలు చేసింది. తాను డిజిటల్ పేమెంట్ చేస్తానని ఆయన చెప్పినప్పటికీ, సాంకేతిక కారణాలను చూపి అధికారులు తిరస్కరించారు. దీనిపై వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు చెప్తూ, సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా 50 పైసలును అదనంగా వసూలు చేయడం అనుచిత వ్యాపార విధానమని, ఇది సేవా లోపమేనని తెలిపింది.

# టూరిస్టు ప్రదేశాలు చూపిస్తామని జనాన్ని తరలించారు

### నవ్యా హరిదాస్



**వయనాడ్:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వయనాడ్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆమె నిర్వహించిన రోడ్‌షో పై బీజేపీ అభ్యర్థి నవ్యా హరిదాస్ విమర్శలు చేశారు. టూరిస్ట్ ప్రదేశానికి తీసుకువెళతామని ప్రియాంక సభకు జనాన్ని తరలించారంటూ వ్యాఖ్యానించారు. 'ఆమె ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. నాకు కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ప్రజల కోసం ఏళ్లతరబడి పనిచేసిన అనుభవం ఉంది. ఒక అభ్యర్థి గొప్పతనం వారి కుటుంబ ఆధిపత్యమే ప్రమాణమైతే అది ఆమెకు మాత్రమే చెందుతుంది. భాజపాకు అలాంటి ప్రమాణాలు లేవు. ఆమె రావడం, రోడ్ షోలు నిర్వహించడం వంటివి సంవత్సరానికి వచ్చిపోయే ఫెస్టివల్ సీజన్ లాంటివి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని ఆమె పేర్కొన్నారు. ఇక, భాజపా అభ్యర్థి నవ్యా హరిదాస్ గురువారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి పోటీ చేసి గెలిచిన రాహుల్‌గాంధీ.. వయనాడ్ స్థానాన్ని వదులుకున్నారు. ఈక్రమంలో స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలో భాజపా నుంచి నవ్యా హరిదాస్, కాంగ్రెస్ నుంచి ప్రియాంకాగాంధీ బరిలో ఉండగా.. ఎల్‌డీఎఫ్ తరఫున సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకెరీ పోటీ చేస్తున్నారు. నవంబర్ 13న ఉప ఎన్నిక జరగనుంది.

# మున్నీ బద్నామ్ సాంగ్‌పై బాంబే ఐఐటీ విద్యార్థుల డ్యాన్స్

ముంబై: మున్నీ బద్నామ్ హుహీ అనే బాలీవుడ్ పాటపై బాంబే ఐఐటీ విద్యార్థులు డ్యాన్స్ చేశారు. ఆ డ్యాన్స్‌కు చెందిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నది. అయితే బాంబే ఐఐటీలో చదువుతున్న ఓ అమ్మాయి ఆ పాటపై డ్యాన్స్ చేయడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. మరికొందరు ఆ డ్యాన్స్‌ను సమర్థిస్తున్నారు. ఆన్‌లైన్ యూజర్లు ఆ వీడియోను షేర్ చేశారు. ఆ డ్యాన్స్‌కు చెందిన వీడియో బాంబే ఐఐటీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో మాత్రం పోస్టు చేయలేదు. బాంబే ఐఐటీ కూడా ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఇటీవల ఐఐటీ బాంబే విద్యార్థుల్లో 25 శాతం మంది జాబ్స్ సాధించలేదు. దీంతో ఆ ఇన్‌స్టిట్యూట్‌పై విమర్శలు వస్తున్నాయి.

# ఒకే స్థానంలో మూడు 'సేన'ల పోటీ

## 'మహిమ్' నియోజకవర్గం పైనే అందరి దృష్టి



**మహిమ్:** మరికొద్దిరోజుల్లో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనుండడం వల్ల ప్రస్తుతం అందరీ దృష్టి మహిమ్ అసెంబ్లీ సీటుపై ఉంది. ఎందుకంటే ఆ నియోజకవర్గం నుంచి మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే తనయుడు అమిత్ ఠాక్రే తొలిసారి బరిలోకి దిగారు. అలాగే శివసేన(యూబీటీ), శివసేన(శిందే వర్గం) అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. సెంట్రల్ ముంబయిలో ఈ ప్రతిష్ఠాత్మకమైన నియో జకవర్గాన్ని గెలుచుకోవడానికి మూడు పార్టీలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి.

### అవిభాజ్య శివసేనలోని 3పార్టీల మధ్యే పోటీ!

అవిభక్త శివసేన 1966లో ఏర్పడగా, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన 2006లోఏర్పడింది. శివసేననుంచి విడిపోయి రాజ్‌ఠాక్రే ఎమ్ఎన్ఎస్‌ను స్థాపించారు. ముంబయిలోని 36 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒకటైన మహిమ్ నుంచి ఎమ్ఎన్ఎస్ తరఫున రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ఠాక్రే బరిలోకి దిగారు. శివసేన నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సదా సర్వాంకర్, ఉద్ధవ్ వర్గం నుంచి మహేశ్ సావంత్ పోటీలో ఉన్నారు.మైనార్టీల ఓట్లు స్వల్పమే!కాగా, మహిమ్?లో అగ్రవర్ణ ఓటర్లు ఎక్కువ ఉండే నియోజకవర్గం, అలాగే కాస్మోపాలిటన్ నగరం. మైనారిటీల ఓట్లు స్వల్పంగానే ఉన్నాయి. శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీ ప్రధాన కార్యాలయాలు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయ. ఇక్కడే రెండు పార్టీలు దసరా ర్యాలీలు, పార్టీ వార్షికోత్సవాలను జరుపుకుంటాయి. 1990 నుంచి మహిమ్ నియోజవర్గం అవిభక్త శివసేన, ఎమ్ ఎన్ఎస్‌కు కంచుకోటగా ఉంది. 2009లో ఎంఎన్ఎస్ అభ్యర్థి నితిన్ సర్దేశాయ్ మహిమ్ నుంచి గెలుపొందారు కూడా.

# 'ఇండియా' అభ్యర్థులంతా 'సైకిల్' గుర్తుపై పోటీ చేస్తారు

### అఖిలేష్ యాదవ్



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది స్థానాలకు త్వరలో జరుగనున్న ఉప ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ అభ్యర్థులంతా 'సైకిల్' గుర్తుపై పోటీ చేస్తారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడమే కూటమి లక్ష్యమని చెప్పారు. అయితే సీట్ల పంపకం ఇంకా ఖరారు కాలేదని అన్నారు. 'కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు ఐక్యంగా ఉన్నాయి. ఒక పెద్ద విజయం కోసం భుజం భుజం కలిపాయి. ఈ ఉప ఎన్నికల్లో ఘన విజయంతో 'ఇండియా' బ్లాక్ కొత్త చరిత్ర సృష్టిస్తుంది. అపూర్వమైన సహకారం, మద్దతుతో మొత్తం 9 అసెంబ్లీ సీట్లలో గెలవాలనే సంకల్పం, శక్తి ప్రతి 'ఇండియా' బ్లాక్ కార్యకర్తలో నిండి ఉంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశ రాజ్యాంగం, శాంతి భద్రతలు, వెనుకబడినవారు, దళితులు, మైనారిటీల గౌరవం కోసం ఈ ఎన్నికల్లో పోరాడుతున్నట్లు అందులో పేర్కొన్నారు.కాగా, ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 13న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. కతేహరి (అంబేద్కర్ నగర్), కర్హాల్ (మెయిన్‌పురి), మీరాపూర్ (ముజఫర్‌నగర్), ఘజియాబాద్, మఝువాన్ (మీర్జాపూర్), సిషామౌ (కాన్పూర్ నగరం), ఖైర్ (అలీఘర్), ఫుల్‌పూర్ (ప్రయాగ్‌రాజ్) , కుందర్కి (మొరాదాబాద్) సీట్లు ఖాళీ అయ్యాయి. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లోక్‌సభ ఎంపీలుగా ఎన్నికయ్యారు. క్రిమినల్ కేసులో దోషిగా తేలడంతో ఎస్పీ ఎమ్మెల్యే ఇర్ఫాన్ సోలంకిపై అనర్హత వేటు పడింది. దీంతో సిషామౌ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరుగుతోంది. అయితే ఖాళీ అయిన మిల్కిపూర్ (అయోధ్య) స్థానాన్ని ఈసీ పక్కన పెట్టింది.

# ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా అనూరాధ బాధ్యతల స్వీకరణ





**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్ పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారిణి ఎ.ఆర్.అనురాధ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బందర్ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలోని ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెతో ఏపీపీఎస్‌సీ కార్యదర్శి జె.ప్రదీప్ కుమాం ప్రమాణస్వీకారం చేయించారు. బాధ్యతలు చేపట్టిన ఎ.ఆర్.అనురాధకు బోర్డు సభ్యులు, కార్యదర్శి, సహ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.అనంతరం ఏపీపీఎస్సీలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నియామకాలపై బోర్డు సభ్యులు, అధికారులతో చైర్ పర్సన్ సమీక్షించారు. గ్రూప్ 1, గ్రూప్ 2 సహా నిర్వహించాల్సిన పలు నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలపై ఆరా తీశారు.పలు ఉద్యోగాల భర్తీ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనలు, కొత్తగా నోటిఫికేషన్లు, ఇవ్వాల్సిన ఉద్యోగాల గురించి ప్రాథమికంగా చర్చించారు. వీటిపై వీలైనంత త్వరగా కీలక నిర్ణయాలు తీసుకో నున్నట్లు ఆమె తెలిపారు. కాగా, ఏఆర్ అనురాధ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోపలు జిల్లాలోఎస్పీగా, ఐజీగా పనిచేశారు. ఏపీలో ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్‌అధికారిగా గుర్తింపు పొందారు. డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కూడా ఆమె పనిచేశారు. 1987 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ అనురాధ భర్త నిమ్మగడ్డ సురేంద్రబాబు కూడా ఐపీఎస్ అధికారి కావడం విశేషం. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో ఏడాది పదవీ కాలం ఉన్నా సవాంగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపించింది.

## కపిలేశ్వరాలయాన్ని సందర్శించిన టీటీడీ ఈవో

### తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



**విశ్వంభర, తిరుమల :**తిరుపతి కపిలేశ్వర స్వామివారి ఆలయానికి రానున్న కార్తీక మాసంలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో జె శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.కపిలేశ్వర స్వామివారి ఆలయాన్ని సందర్శించి ఆంజనేయ స్వామివారి ఆలయం, కళ్యాణకట్ట, తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాల విక్రయశాల, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, పుష్కరిణి, క్యూ లైన్లను పరిశీలించి, కామాక్షి సమేత కపిలేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ పంచగవ్య ఉత్పత్తులు, అగర బత్తుల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**తిరుమలలో భక్తుల రద్దీ**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారి దర్శనానికి 8 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 7 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగు తుందని అధికారులు వివరించారు.బుధవారం స్వామివారిని 64,447 మంది భక్తులు దర్శించు కోగా 25,555 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.38 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## జగన్ అక్రమ ఆస్తులపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి :డొక్కా



**విశ్వంభర, గుంటూరు:** నైతిక విలువలు లేకుండా సొంత తల్లి, చెల్లిని కోర్టు ద్వారా ఇబ్బందులు పెట్టడం చూస్తే.. వైకాపా అధినేత జగన్ చరిత్రహీనుడిగా నిలవబో తున్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో, ప్రస్తుతం ఉన్న ఆస్తులు.. వాటి విలువ ఎంతో చెప్పాలని జగన్‌కు సూచిం చారు. జగన్ అక్రమ ఆస్తులపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరారు. జగన్ బరితెగింపు చూస్తే.. కేంద్ర ఆర్థిక సంస్థల్లో కొందరు ఆయన ద్వారా లబ్ధి పొందుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రధాని మోదీ దీనిపై తక్షణమే ప్రత్యేక చర్చలు జరిపి.. చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం కూడా ప్రత్యేక అసెంబ్లీ నిర్వ హించి జగన్ ఆస్తులను జాతీయం చేయా లని కోరారు. ప్రజల ఆస్తులను అప్పనంగా దోచుకున్న జగన్మోహన్ రెడ్డి ఆస్తులపై కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిం చడం సరికాదన్నారు.

## రోడు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

**విశ్వంభర, కర్నూలు :** కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మ రణం చెందారు. ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన బంగారం వ్యాపారి కామిశెట్టి గురువయ్య తన కూతురు వివాహం ఈనెల 20న ఘనంగా జరిపించారు. తిరు పతిలో ఉండే అల్లుడి ఇంటిలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు బుధవారం రాత్రి కారు లో బయలు దేరారు.అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్ కారును ఢీ కొనగా కారులో ఉన్న గురువయ్య బంధువులు సుచిత్ర, వాసవి, ప్రేమ్‌కుమార్ మరణించగా మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

## జగన్ మనస్తత్వం మరోసారి రుజువైంది

### కాంగ్రెస్ సీనియర్ నేత తులసి రెడ్డి

**విశ్వంభర, కడప:** జగన్ మనస్తత్వం ఏంటో మరోసారి నిరూపితమైందని కాం గ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. డబ్బు కోసం తల్లి, చెల్లిని కూడా దూరం పెట్టగలనని ఆయన మళ్లీ నిరూపించారని వ్యాఖ్యానించారు. కడపలో మీడియాతో తులసిరెడ్డి మాట్లాడారు. కుటుంబ ఆస్తి పాస్తుల విషయంలో జగన్‌కు డబ్బే ప్రధా నమన్నారు. ఆస్తుల వాటా విషయం భవి ష్యత్తులో రాజకీయంగా ఆయనకు చాలా నష్టాలను తెచ్చిపెడుతుందని చెప్పారు.

## దాచేపల్లిలో డయేరియాతో మరో ఇద్దరి మృతి

### ఘటనపై సమీక్షించిన మంత్రి నారాయణ





**విశ్వంభర, దాచేపల్లి :** పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనిపురం కాలనీలో అతిసారం ప్రభలి మరో ఇద్దరు మృతి చెందడం పట్ల గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా గ్రామస్థులువాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు.తాజాగా గ్రా మా నికి చెందిన తమ్మిశెట్టి వీరయ్య, వెంకటేశ్ అనే ఇద్దరు వ్యక్తులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మరికొం దరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందిన ఘటనపై మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వ హించారు. నీరు కలుషితం కావడం కారణంగా మరణించారా.. లేక వేరే కారణాలున్నాయా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికా రులు మంత్రికి తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణ అభివృద్ధిశాఖ మంత్రి నారాయణ జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.దాచెపల్లిలోని నీటిని విజయవాడ ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపాలని మంత్రి ఆదేశించారు. అన్ని బోర్లను మూసివేసి వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. ఇద్దరు మృతి చెందడంతోపాటు మరో ఆరుగురు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని కలెక్టర్ మంత్రికి తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయడంతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వివరించారు. మురికికాల్వలను శుభ్రంచేసి బ్లీచింగ్ పౌడర్ నుచల్లించాలని మంత్రి ఆదేశించారు.ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు జరిపి వైద్యం అందించాలని సూచించారు.డ్రైనేజీల్లో మురుగును తొలగించడంతోపాటు అన్ని మంచి నీటి బోర్లను తనిఖీ చే యాలని మంత్రిఅధికారులను ఆదేశించారు.అవసరమైతే ఇతర మున్సి పాలిటీల నుంచి సిబ్బందిని రప్పించాలన్నారు. సాధారణ పరిస్థితి వచ్చే వరకు మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిం చాలన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జేసీ సూరజ్, ఆర్డీఎంఏ హరికృష్ణ, డీఎంహెచ్ వో రవికుమార్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు సమీక్షలో పాల్గొన్నారు.

## అమరావతికి కొత్త రైల్వే లైన్‌కు ఆమోదం



**దిల్లీ:** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.?2,245 కోట్లతో అమరావతికి కొత్త రైల్వే లైన్ మంజూరు చేస్తున్నట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై సహా దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో రాజ ధాని అమరావతిని కలుపుతూ కొత్త రైల్వే ప్రాజెక్టు చేపట్టనున్నట్టు రైల్వే మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా కృష్ణానదిపై 3 కి.మీల పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.

## వాస్తవాలను దాచి పెట్టేందుకు డైవర్షన్ రాజకీయాలు : వైఎస్ జగన్



**విశ్వంభర, గుర్ల :** రాష్ట్రంలో నెలకొన్న సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి చంద్రబాబు ప్రభుత్వం మా తల్లి, చెల్లి ఫొటోలు పెట్టి డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. విజయనగరం జిల్లా గుర్లలో డయోరియోతో బాధ పడుతున్న బాధితులను గురువారం పరామర్శించారు. డయేరియాతో మరణించిన బాధితుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు .అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో సమస్యలుంటాయని, మా కుటుంబ సమస్యలపై ప్రచారం ఆపి ప్రజల మీద దృష్టి పెట్టాలని సూచించారు. వాస్తవాలను దాచిపెట్టేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకపోవడంతో వస్తున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికి సమస్యలను డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నో దారుణాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు దృష్టిసారించాలన్నారు. డయేరి యాతో ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం ఏం చేస్తోందని, బాధితులకు సాయం అందిం చదా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం నిద్ర మత్తులో ఉందని ఆరోపించారు. బాధిత కుటుం బాలకు అండగా ఉంటామని తెలిపారు. వైసీపీ హయాంలో గ్రామాలను సస్యశ్యామలం చేశామని, గ్రామ సచివాలయాల ద్వారా సేవలు అందించమన్నారు.

## జగన్ క్రూరత్వం గ్రహించే షర్మిలకు విజయమ్మ మద్దతు



**విశ్వంభర, మంగళగిరి:** ఆస్తి కోసం తల్లి, చెల్లిని బ్లాక్‌మెయిల్ చేసిన జగన్‌ను మాజీ సీఎం అని పిలవాలన్నా అసహ్యం వేస్తోందని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆస్తి ఇవ్వ నంటూ కోర్టుకెళ్లడం ఆయన క్రూర మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. జగన్ అనుభవిస్తున్న ఆస్తి ప్రజలదని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. సరస్వతీ పవర్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు 30 ఏళ్లకు జగన్ పొడిగించుకున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ 6 ఏళ్ల వరకూ కార్యకలాపాలు ప్రారం భించకపోవడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఆ భూ కేటాయిం పులను ప్రభుత్వం ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా సరస్వతి పవర్ యాజమాన్యం వ్యవహరించి నందున కేటాయింపులు రద్దు చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ప్రజల ఆస్తులు కూడగట్టుకున్న జాబితాలో జగన్‌ది దేశంలో 2వ స్థాన మని ఆరోపించారు. కాంగ్రెస్‌తో ఆయన జరుపుతున్న మంతనాలు ఇప్ప టికే బయటకు తెలిశాయన్నారు.ఏ తల్లి అయినా తన పిల్లలందరినీ సమా నంగా చూసుకుంటుందని.. కానీ జగన్ క్రూరత్వం గ్రహించే షర్మిలతో విజయమ్మ ఉండాల్సి వస్తోందన్నారు. జగన్ క్రూరత్వంపై ఓ దర్శకుడు సినిమా సన్నివేశం తీశారంటూ వీడియోను సోమిరెడ్డి ప్రదర్శించారు. జగన్ ఒప్పుకుంటే సరస్వతీ పవర్ 1500 ఎకరాలను 3 భాగాలు చేసి ఒక భాగం రైతులకిచ్చి.. మిగిలిన 2 భాగాలను జగన్, షర్మిలకు సమానంగా పంచుతామన్నారు.

## హైవేపై హాస్టల్ విద్యార్థుల ధర్నా

### భారీగా ట్రాఫిక్‌జామ్



**విశ్వంభర, ఎలమంచిలి:** అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో బాలికల కళాశాల వసతి గృహం విద్యార్థులు రోడ్డుపై ధర్నాకు దిగారు. హాస్టల్‌లో భోజనం బాగోలేదంటూ పాత హైవేపై వంటావార్పు చేసి నిరసన తెలిపారు. విద్యార్థుల ఆందోళనతో భారీగా వాహనాలు నిలిచిపోయా యి. సుమారు కిలోమీటర్ ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఆగి పోయాయి. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. పోలీ సులు అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు.

## ఉద్దండరాయునిపాలెంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత




విశ్వంభర, అమరావతి: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో పోలీసులు భారీగా మోహరించారు. సీఆర్‌డీఏ పరిధిలోని స్థలంలో వైసీపీ నేత నందిగం సురేశ్ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఎంపీగా ఉన్న సమయంలో రేకుల షెడ్డు, వాలీబాల్ కోర్టును నందిగం సురేశ్ నిర్మించారు. ఆ కట్టడాలను సీఆర్‌డీఏ అధికారులు కూల్చేస్తున్నారు.

## మాజీ ఎంపీ నందిగం సురేష్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



విశ్వంభర, అమరావతి: వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేష్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో బెయిల్ పిటిషన్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం సురేష్ ఈ కేసులో అరెస్టై గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

## వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగాతో
# కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ భేటీ..



**వాషింగ్టన్:** అమెరికా వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల్లో సంస్కరణల సహా పలు అంశాలపై చర్చించారు. వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాల సందర్భంగా నిర్మలా సీతారామన్, అజయ్ బంగా ప్రపంచ పబ్లిక్ గూడ్స్ ప్రైవేట్ క్యాపిటల్ భాగస్వామ్యం, ఇంధన భద్రత, బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకులసంస్కరణలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రపంచ బ్యాంక్ తరఫున భారతదేశం జీ-20 ప్రెసిడెన్సీ సమయంలో బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణలపై ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్ సిఫారసులపై సాధించిన పురోగతి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాన్నారు. భవిష్యత్తులో సిఫార్సుల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు. 2023 జీ-20 భారత్ ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో నియమించిన ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్.. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణ కోసం సిఫారసులు చేసింది. పేదరికాన్ని అంతం చేయడం, భాగస్వామ్య శ్రేయస్సును ప్రోత్సహించడం, 2030 నాటికి ప్రపంచ ప్రజా వస్తువుల కోసం స్థిరమైన రుణస్థాయిలను మూడురెట్లు పెంచేందుకు దోహదం చేయాలని.. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల ఎజెండాలోని అంశాలకు మద్దతు ఇచ్చేందుకు ఇష్టపడే పెట్టుబడిదారులతో ఉద్దేశపూర్వకంగా పాల్గొనేందుకు అనువైన, వినూత్నమైన ఏర్పాట్లను అనుమతించే మూడో ఫైనాన్సింగ్ మెకానిజం రూపొందించాలని సిఫారసు చేసింది. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ 80వ వార్షికోత్సవం సందర్భంగా చర్చించేందుకు ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ సంయుక్తంగా నిర్వహించే కన్సల్టేటివ్ మెకానిజంపై విస్తృత సంప్రదింపుల ప్రక్రియ అవసరమని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

# పార్లమెంటరీ కమిటీ సమన్లను దాటవేసిన సెబీ చీఫ్..!




**ముంబయి:** అదానీ విదేశీ ఫండ్లలో స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' చైర్ పర్సన్ మాధబీ పురీ బుచ్, ఆమె భర్తకు వాటాలున్నాయని షార్ట్ సెల్లింగ్ సంస్థ, మార్కెట్ రీసెర్చి కంపెనీ హిండెన్‌బర్గ్ నివేదిక దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్‌కు ఇటీవలే పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 24న విచారణకు తమ ముందు హాజరు కావాలని పేర్కొంది.పీఏసీ ఆదేశాల మేరకు ఆమె గురువారం కమిటీ ముందు హాజరు కావాల్సి ఉంది. అయితే, ఆమె ఈ సమన్లను దాట వేశారు. కొన్ని వ్యక్తిగత కారణాల రీత్యా విచారణ కమిటీ ముందు హాజరు కాలేనని కమిటీకి తెలియజేశారు. దీంతో పీఏసీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ విషయంపై కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. 'మొదటి కమిటీ సమావేశంలో రెగ్యులేటరీ పనితీరుపై సమీక్షించాలని నిర్ణయించుకున్నాం. సెబీ సమీక్ష కోసం సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపాం. అయితే, వారు సమావేశం నుంచి మినహాయింపు కోరారు. దాన్ని మేం తిరస్కరించాం.

ఆ తర్వాత కమిటీ ముందు తాను, తన బృందం హాజరవుతామని సెబీ చీఫ్ ధృవీకరించారు. వ్యక్తిగత అత్యవసర పరిస్థితి కారణంగా ఆమె ఢిల్లీకి ప్రయాణించే పరిస్థితి లేదని ఇతర సభ్యుల నుంచి ఈరోజు ఉదయం 9:30 గంటలకు మాకు సమాచారం అందింది. ఆమె అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, నేటి సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాము. మరొక రోజు సమావేశం ఏర్పాటు చేస్తాం' అని ఆయన తెలిపారు.

అదానీ గ్రూప్ ఆర్థిక అవకతవకల్లో భాగస్వామిగా ఉన్న ఆఫ్ షోర్ కంపెనీల్లో మాధబీ పురీ బుచ్ దంపతులకు వాటాలు ఉన్నాయని హిండెన్ బర్గ్ ఆరోపణ. ఈ విషయమై అదానీ గ్రూపుపై ఆరోపణలు వచ్చిన తర్వాత 18 నెలలకు కూడా ఆ గ్రూప్ సంస్థలపై వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో సెబీ నిరాసక్తతను ఇది తెలియజేస్తున్నదని హిండెన్ బర్గ్ పేర్కొంది.

# ఐదేండ్లలో కొత్తగా 50 విమానాశ్రయాలు
## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**ఢిల్లీ:** వచ్చే ఐదేండ్లలో దేశంలో 50 కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు చెప్పారు. భారత్ ఎయిర్ పోర్టుల్లో ఎకో సిస్టమ్ అభివృద్ధి చేయడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. గత పదేండ్లలో దేశంలోని 157 విమానాశ్రయాలతో రెట్టింపు అయ్యాయని చెప్పారు. వచ్చే ఐదేండ్లలో 50 విమానాశ్రయాలు నిర్మిస్తామని, 20 ఏండ్లలో మరో 200 విమానాశ్రయాలు ఏర్పాటవుతాయని వెల్లడించారు.ఢిల్లీలో గురువారం ఎయిర్ బస్ ఇండియా సౌత్ ఏషియా ప్రధాన కార్యాలయంలో జరిగిన శిక్షణా శిబిరంలో మంత్రి మాట్లాడుతూ దేశీయ ఎయిర్ పోర్ట్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఐదేండ్లలో విమాన ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అవుతుందని విమానయనశాఖ కార్యదర్శి వుమ్లున్ మాంగ్ ఔల్నాం పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 220 మిలియన్ల మంది ప్రయాణికులు విమానయానం చేశారన్నారు.


# ఒడుదొడుకుల్లో కదలాడి.. ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో వరుస నష్టాలతో ట్రేడవుతున్న సూచీలు.. గురువారం సైతం స్వల్ప నష్టాలతో ముగిశాయి. హిందుస్థాన్ యూనిలీవర్ త్రైమాసిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో హెచ్‌యూఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. 5 శాతం నష్టంతో హెచ్‌యూఎల్ షేరు రూ.2502 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 80,098.30 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,081.98) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 79,813.02- 80,259.82 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 16.82 పాయింట్ల నష్టంతో 80,065 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 36 పాయింట్లు నష్టపోయి 24,399 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.07గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, ఐటీసీ, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.49 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 2,749 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## సాఫ్ట్‌వేర్ తరహాలోనే భారత్ నుంచి
# ఏఐ ఎగుమతులు: ఎన్విడియా సీఈఓ



**ముంబయి:** కంప్యూటర్ రంగంలో ప్రపంచానికి సుపరిచితమైన భారత్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలోనూ సత్తా చాటబోతోందని ఎన్విడియా వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్ అన్నారు. భవిష్యత్‌లో ప్రభావవంతమైన ఏఐ సొల్యూషన్స్‌ను ప్రపంచానికి ఎగుమతి చేయబోతోందని చెప్పారు. ఈమేరకు ముంబయిలో నిర్వహించిన ఎన్విడియా ఏఐ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. భారత్‌లో తమ ఎకోసిస్టమ్ విస్తరణకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

కంప్యూటర్ రంగంలో ప్రపంచానికి భారత్ చాలా సుపరిచితమని, ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఎగుమతులకు హబ్‌గా ఉందని కొనియాడారు. భవిష్యత్‌లో ఏఐ ఎగుమతుల్లోనూ లీడర్‌గా మారనుందని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ తరహాలోనే ఏఐని భారత్ ప్రపంచదేశాలకు ఎగుమతి చేయనుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులకు అడ్డాగా ఉన్న భారత్.. ఏఐ అభివృద్ధి, సరఫరాలో పవర్‌హౌస్‌గా మారనుందని చెప్పారు. భవిష్యత్‌లో ప్రతివ్యక్తికీ ఓ ఏఐ కో-పైలట్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఏఐ వల్ల ఉద్యోగాలు హరించుకుపోతాయన్న ఆందోళనల పైనా హువాంగ్ స్పందించారు. ఏఐ పూర్తిగా ఉద్యోగాలు తుడిచిపెట్టబోదని, దాని స్వరూపాన్ని మారుస్తుందని పేర్కొన్నారు. వ్యక్తి కంటే ఏఐ మెరుగ్గా పనిచేయగలదని భావించినప్పుడు మాత్రమే ఆ ఉద్యోగం పోతుందని చెప్పారు.


### రిలయన్స్‌తో భాగస్వామ్యం

భారత్‌లో ఏఐ మౌలిక సదుపాయాల కల్పనకు రిలయన్స్‌తో ఎన్విడియా భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నట్లు ఆ కంపెనీ సీఈఓ హువాంగ్ ప్రకటించారు. సమ్మిట్‌లో భాగంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీతో భేటీ అయిన సందర్భంగా ఈవిషయాన్ని ప్రకటించారు. ఈ భాగస్వామ్యం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. అమెరికా, చైనా తర్వాత పెద్ద డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భారత్ కలిగిఉందని ముకేశ్ పేర్కొన్నారు.

### ఎన్విడియా సీఈవోను కలిసిన అక్షయ్


ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌ను బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ కలిశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మార్షల్ ఆర్ట్స్ వంటి విషయాల గురించి చర్చించుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ అక్షయ్ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.


# 16 ఏండ్ల కెరీర్‌కు మాజీ కెప్టెన్ వీడ్కోలు




**ఢిల్లీ:** భారత మహిళా హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణీ రాంపాల్ వీడ్కోలు పలికింది. సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్టు గురువారం రాంపాల్ వెల్లడించింది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆమె తన 16 ఏండ్ల కెరీర్‌కు గుడ్ బై చెప్పేసింది. ఫార్వర్డ్ ప్లేయర్ అయిన రాణి సారథిగా భారత హాకీకి వన్నె తెచ్చింది. ఆమె ఏకంగా 254 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది.'భారత జట్టుతో నా ప్రయాణం ఎంతో చిరస్మరణీయం. ఇన్ని ఏండ్లు దేశం తరఫున ఆడుతానని నేను అస్సలు ఊహించలేదు. బాల్యంలో చాలా పేదరికం అనుభవించాను. అయినా సరే టీమిండియాకు ఆడాలనే కసితో అన్ని అడ్డంకులు దాటి నా కలను నిజం చేసుకున్నా' అని రాణి మీడియా సమావేశంలో చెప్పింది. హర్యానా కు చెందిన రాణి రాంపాల్ 15 ఏండ్ల వయసులోనే జాతీయ జట్టుకు ఎంపికైంది. ఫార్వర్డ్ ప్లేయర్‌గా తన ముద్ర వేసిన ఆమె అనతికాలంలోనే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టింది. రాణి సారథ్యంలో భారత మహిళల జట్టు అద్భుత విజయాలు సాధించింది. ఆమె కెప్టెన్సీలో భారత మహిళల జట్టు 2014 ఆసియా క్రీడల్లో కాంస్యం.. 2018 ఆసియా గేమ్స్‌లో రజతం కొల్లగొట్టింది. అంతేకాదు2021 టోక్యో ఒలింపిక్స్‌లో 4వ స్థానంలో నిలిచింది. తన 16 ఏండ్ల కెరీర్‌లో రాణి 205 గోల్స్ కొట్టింది.

# ఆసియా గడ్డపై తొలి విజయం.. చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా





**మిర్పూర్:** ఆసియా ఖండంలో తేలిపోయే దక్షిణాఫ్రికా జట్టు చరిత్ర సృష్టించింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో 10 ఏండ్ల తర్వాత తొలి విజయం సాధించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మిర్పూర్ టెస్టులో తొలి రోజే పట్టు బిగించిన సఫారీలు.. నాలుగో రోజు ఆటను ముగించారు. స్వదేశంలో బెబ్బులిలా గర్జించే బంగ్లాదేశ్ బ్యాటర్లకు కగిసో రబడ(3/26, 6/36), కేశవ్ మహరాజ్(3//34, 3/105) లు పగ్గాలు వేయగా.. 105 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సఫారీ జట్టు 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. చిరస్మరణీయ విజయంతో ఎడెన్ మర్కరమ్ సేన రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత పర్యటనలో టెస్టు, టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన బంగ్లాదేశ్‌కు సొంతగడ్డపైనా ఓటమి తప్పలేదు. మిర్పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో బంగ్లా భారీ తేడాతో ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే కుప్పకూలిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో దీటుగా ఆడింది. సఫారీ పేసర్ రబడ(636) ధాటికి టాపార్డర్ విఫలమైనా ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్(97) అసమాన పోరాటం కనబరిచాడు. జకీర్ అలీ(58)తో పాటు టెయిలెండర్లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. సెంచరీ కొట్టేలా కనిపించిన మిరాజ్‌ను రబడ వెనక్కి పంపాడు.

## మొదటి రోజు భారత్‌కు ఆదిలోనే షాక్.. మొదటి రోజు భారత్‌కు ఆదిలోనే షాక్..

- తొలి రోజు ముగిసిన ఆట.. భారత్ స్కోర్16/1
- మొదటి ఇన్నింగ్‌లో 259 పరుగులకు న్యూజిలాండ్ ఆలౌట్



పుణె: భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్.. మొదటి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన టీమ్‌ఇండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (0) డకౌట్‌గా వెనుదిరిగి నిరాశపర్చాడు. టిమ్ సౌథీ బౌలింగ్‌లో రోహిత్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు ఒక పరుగు మాత్రమే. తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 16/1 స్కోరుతో ఉంది. శుభ్‌మన్ గిల్ (10 బ్యాటింగ్), యశస్వి జైస్వాల్ (6 బ్యాటింగ్) నాటౌట్‌గా క్రీజులో ఉన్నారు. భారత్ ఇంకా 243 పరుగుల వెనుకంజలో ఉంది. తొలుత న్యూజిలాండ్ బ్యాటర్లలో ఓపెనర్ దేవాన్ కాన్వే (76బీ 141 బంతుల్లో 11 ఫోర్లు) అర్ధ శతకం బాదగా.. రచిన్ రవీంద్ర (65బీ 105 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి ఆకట్టుకున్నాడు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. 45 నెలల తర్వాత భారత టెస్టు జట్టులోకి వచ్చిన స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (7/59) న్యూజిలాండ్ ఆలౌట్ కావడంలో కీలకపాత్ర పోషించాడు. టెస్టుల్లో అతడు ఐదు వికెట్ల కంటే ఎక్కువ పడగొట్టడం ఇదే తొలిసారి. సుందర్ ఈ ఇన్నింగ్స్‌లో ఐదుగురు బ్యాటర్లను క్లీన్‌బౌల్డ్ చేయడం విశేషం. రవిచంద్రన్ అశ్విన్ (3/59) కూడా రాణించాడు.

## వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో రవిచంద్రన్ అశ్విన్ రికార్డు



**పుణె:** వరల్ట్ టెస్ట్ చాంపియన్‌షిప్ మ్యాచుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రికార్డు క్రియేట్ చేశాడు. ఇప్పటి వరకు డబ్ల్యూటీసీ మ్యాచుల్లో అతను 188 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్‌తో గురువారం ప్రారంభమైన రెండోటెస్టులో.. అశ్విన్ ఇప్పటికే రెండు వికెట్లు తీసుకున్నాడు. దీంతో అతను డబ్ల్యూటీసీ మ్యాచుల్లో అత్యధిక వికెట్లు తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు. అశ్విన్ తర్వాత స్థానాల్లో నాథన్ లియాన్(187), కమ్మిన్స్(175), స్టార్క్(147), బ్రాడ్(134) ఉన్నారు.



## డియర్ కృష్ణ మూవీ నుంచి

# ఫస్ట్ సింగిల్ 'చిరుప్రాయం' విడుదల

పీఎన్ బీ సినిమాస్ బ్యానర్ పై తెరకెక్కుతున్న యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ డియర్ కృష్ణ. పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా ఈ సినిమా ద్వారా పరిచయం అవుతున్నారు. దినేష్ బాబు డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించారు. అక్షయ్ హీరోగా పరిచయం అవుతున్న డియర్ కృష్ణ చిత్రంలో ప్రేమలు చిత్రం ఫేమ్ మమిత బైజు హీరోయిన్ గా నటిస్తున్నారు. వీరితో పాటు ఐశ్వర్య కూడా హీరోయిన్ గా నటిస్తున్నారు.

రియల్ ఇన్స్ డెంట్స్ ను ప్రేరణగా తీసుకొని పీఎన్ బలరామ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా రాసుకున్నారు. హృదయాన్ని బరువెక్కించే ఓ విషాద సంఘటన జరుగుతుంది. శ్రీకృష్ణుడి పైనే భక్తులు భారం అంతా వేశారు. డాక్టర్లు ఏం చేయలేమన్న పరిస్థితుల్లో ఓ మిరకల్ జరిగింది. ఇలాంటి అద్భుతమైన ఇతివృత్తమే డియర్ కృష్ణ సినిమా సబ్జెక్ట్. నమ్మలేని నిజాలు కాదు ఎవరూ ఊహించలేని స్క్రీన్ ప్లే రాసిన ఆ భగవంతుడు శ్రీ కృష్ణుని దయతోనే ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత పీఎన్ బలరామ్ పేర్కొన్నారు.

ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ చిరుప్రాయం పాట లాలెట్టన్ మోహన్ లాల్ చేతుల మీదగా విడుదల చేశారు. లెజెండ్రీ సింగర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన చివరి పాట ఇది. ఈ సందర్భంగా లాలెట్టన్ మోహన్ లాల్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు చేసిన ఒక మిరకిల్ ఆధారంగా తీస్తున్న ఈ సినిమాలోని పాటలన్నీ అద్భుతంగా ఉంటాయి. ముఖ్యంగా ఇప్పుడు నేను రిలీజ్ చేసిన ఫస్ట్ సాంగ్ చిరుప్రాయం నా మనసును హత్తుకుంది. లెజెండ్రీ సింగర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం గారు పాడిన ఈ పాట మీ హృదయాలను కూడా హత్తుకుంటుంది. ఈ పాటలాగే సినిమా కూడా పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను అన్నారు.




# డిసెంబర్ 5 న పుష్ప 2: ది రూల్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం పుష్ప 2. ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న ఈ చిత్రం ఒకరోజు ముందుగానే అంటే డిసెంబరు 5న విడుదల కానుంది. మైత్రీమూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రానికి నవీన్ ఎర్నేని. వై.రవిశంకర్ నిర్మాతలు. ఈ చిత్రం విడుదల తేదీని తెలియజేయడానికి గురువారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. సమావేశంలో ఈ చిత్రాన్ని ఇండియా వైడ్ పంపిణీ చేస్తున్న పంపిణిదారులు కూడా పాల్గొన్నారు.

నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ, "పుష్ప 2 రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడానికి ఈ ప్రెస్ మీట్ పెట్టాము. మేము ఇంతకు ముందు చెప్పిన దాని కన్నా ఒక రోజు ముందుగా, అంటే డిసెంబర్ 5 న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. పుష్ప 2 కచ్చితంగా ఒక పెద్ద సినిమా. రిలీజ్ కూడా ఘనంగా ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమా అందరి అంచనాలకి మించి ఉండబోతుందని" అన్నారు. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ఈ సినిమాను ఈ రేంజ్ కి తీసుకొచ్చారు హీరో. ఈ సినిమా కోసం హండ్రెడ్ పర్సెంట్ ఇస్తున్నారు హీరో. దర్శకుడు పగలు రాత్రి కష్టపడి ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. ఈ సినిమా లో అల్లు అర్జున్ గారి బెస్ట్ పర్ఫార్మెన్స్ చూస్తారు. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది అని మా అందరికీ నమ్మకం ఉంది. మా అందరి ముందు పెద్ద గోల్స్ ఉన్నాయి. కానీ మేము అన్నిటినీ చక్కగా అచీవ్ చేస్తాం అని చెప్పారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశి మాట్లాడుతూ, "నైజం లో మేము ఈ సినిమా విడుదల చేస్తున్నాం. ఈ ఏరియాలో సినిమా పెద్ద నంబర్ ని అచీవ్ చేస్తుంది." అన్నారు. హిందీకి సంబంధించి ఏఏ సినిమాస్, అనిల్ తడాని మాట్లాడుతూ, "పుష్ప 2 ని విడుదల చేస్తున్నందుకు నాకు చాలా సంతోషం గా ఉంది. బాహుబలి, కేజీఎఫ్ కూడా చేసాము. పుష్ప పార్ట్ 1 కూడా రిలీజ్ చేసాం. ఇప్పుడు పార్ట్ 2 తో అన్ని రికార్డ్స్ బద్దలు కొట్టి హిస్టరీ క్రియేట్ చేస్తుంది అని ఆశిస్తున్నాం. వెస్ట్ గోదావరి డిస్ట్రిబ్యూటర్ ఎల్వీఆర్ మాట్లాడుతూ "పుష్ప 2 కోసం రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా, ప్రపంచం అంతా ఎదురు చూస్తోంది. మా జిల్లాలోడే 1 షేర్ ఏ కాకుండా టోటల్ బిజినెస్ కూడా ఆల్ టైం రికార్డ్ అవుతుంది అని కోరుకుంటున్నాను" అన్నారు. తమిళ్ కి సంబంధించి ఏజీఎస్ డిస్ట్రిబ్యూటర్ మాలి మాట్లాడుతూ, "నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు నిర్మాతలకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. పుష్ప ఒక బ్రాండ్ గా మారింది. తమిళ్ లో ఈ సినిమాకు పెద్ద రిలీజ్ ఇచ్చాం. పుష్ప 2 కి డబుల్ డిజిట్ ఓపెనింగ్ ఉంటుంది అని మేము విశ్వసిస్తున్నాం. మేము ఇటీవలే 806 స్క్రీన్స్ లో విజయ్ గోట్ సినిమా విడుదల చేసాం. పుష్ప ని కూడా అన్ని స్క్రీన్స్ లో రిలీజ్ చేస్తున్నాం. బాహుబలి 2 తమిళ్ లో 80 క్రోర్స్ షేర్ కలెక్ట్ చేసింది. పుష్ప ఆ నంబర్ ని టచ్ చేస్తుందని అనుకుంటున్నాను." అన్నారు. మలయాళంకు సంబందించిన ఈ 4 ఎంటర్టైన్మెంట్స్ డిస్ట్రిబ్యూటర్ ముకేశ్ మెహతా మాట్లాడుతూ, "పుష్ప 2తో మేము 12 కోట్ల మార్క్ ని టచ్ చేయాలని అనుకుంటున్నాం. లియో కలెక్ట్ చేసిన నంబర్ అది. అంతే కాకుండా, 24 గంటలు ఈ సినిమా కి సంబందించిన షోస్ వెయ్యాలని ప్లాన్ చేస్తున్నాం." అని తెలిపారు. కర్ణాటక డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, "కర్ణాటకలో క్రేజీ బిజినెస్ చేస్తాం. కర్ణాటకలో ఒక సినిమా చేసిన అత్యధిక బిజినెస్ 9095 కోట్ల రూపాయలు. కర్నాటకలో అల్లు అర్జున్ కెరీర్‌లో పుష్ప ఒక మైలురాయిగా నిలిచిపోయేలా చూస్తాం. దాదాపు 500 స్క్రీన్లలో సినిమాను విడుదల చేసి నైట్ షోలు కూడా ప్లాన్ చేస్తాం అన్నారు.

## రష్మిక మందన్నకు

# సెక్యూరిటీ పెంపు



కన్నడ సోయగం రష్మిక మందన్న ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉందని తెలిసిందే. కాగా ఈ భామకు సెక్యూరిటీ పెంచారన్న వార్త ఒకటి ఇప్పుడు అటు బీటౌన్, ఇటు టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ రష్మికకు సెక్యూరిటీ పెంచడమేంటనుకుంటున్నారా..? దీనికి కారణం సల్మాన్ ఖాన్ తో సినిమా చేస్తుండటమే. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపు మెసేజ్‌తో అప్రమత్తమైన ముంబై పోలీసులు సల్మాన్ ఖాన్ ఇంటి దగ్గర భద్రతను పటిష్టం చేశారని తెలిసిందే. ఖాన్ సెక్యూరిటీ టీం, పోలీసుల బృందం భద్రతా చర్యలను పర్యవేక్షిస్తుంది. కాగా సెక్యూరిటీ మధ్యే సల్మాన్ ఖాన్ షూటింగ్స్‌కు హాజరవుతున్నాడు. సల్లూ భాయ్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఏఆర్ మురుగదాస్ డైరెక్ట్ చేస్తున్న సికిందర్. రష్మిక ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రష్మికకు కూడా భద్రతను పెంచారట.. సికిందర్ సెట్స్‌లో అదనపు భద్రతా బలగాలను ఏర్పాటు చేసినట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. సల్మాన్ ఖాన్, రష్మిక మందన్నా కాంబినేషన్‌లో వస్తోన్న తొలి సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కిస్తున్నారు. సికిందర్ ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటిస్తోంది.

# సింహంతో సింగం.. అన్ స్టాపబుల్

'ఆహా' ఓటీటీ ప్లాట్ ఫామ్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అన్ స్టాపబుల్ షో నాలుగో సీజన్‌కు చేరుకుంది. నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా చేస్తున్న ఈ షో మొదటి ఎపిసోడ్ దీపావళి కానుకగా రిలీజ్ కానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన షో ట్రైలర్ ఆడియెన్స్‌లో ఇప్పటి వరకు లేనంత బజ్ క్రియేట్ చేసింది. ఇప్పటికే అల్లు అర్జున్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడులతో రెండు ఎపిసోడ్‌ల షూట్ కంప్లీట్ అయ్యింది. కాగా రిలీజ్ కి సిద్ధంగా ఉన్న సినిమాలోని స్టార్ హీరో ఈ షోకి అటెండ్ అయ్యారు. నరసింహాని కలిసిన ఆ సింగం ఎవరంటే..కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కంగువ సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమాలో బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటించాడు. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా టీజర్, సాంగ్స్ మంచి ఆదరణ పొందాయి. కాగా తెలుగులో ప్రమోషన్స్ నిమిత్తం గురువారం ఆయన అన్ స్టాపబుల్ షోకి అటెండ్ అయ్యారు. సూర్యతో పాటు బాబీ డియోల్ కూడా ఈ షోలో కనిపించనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్ లో షూటింగ్ సాగుతోంది. సూర్యని చూసేందుకు అభిమానులు ఎగబడుతున్నారు.దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకి సంగీతం అందిస్తుండగా. ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సినిమాను భారీ నిర్మాణ విలువలతో నిర్మిస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి శివ దర్శకుడు. దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో బాబీ డియోల్ కీ రోల్ ప్లే చేస్తున్నారు. మరోవైపు సూర్య 44కి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారాయణ్ బాణీలు అందిస్తున్నాడు.



# నేడు గ్యాంగ్‌స్టర్ రిలీజ్.. ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్




హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో గురువారం ఘనంగా "గ్యాంగ్ స్టర్" సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. శుక్రవారం థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్నది. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ హీరో హీరోయిన్లు. ఈ చిత్రంలో అభినవ్ జనక్, అడ్డ సతీష్ కుమార్, సూర్య నారాయణ తదితరులు నటించారు. వైల్డ్ వారియర్ ప్రొడక్షన్స్ లో రవి, నరసింహా సమర్పణలో చంద్రశేఖర్ రాథోడ్ దర్శకత్వం చేసిన ఈ సినిమా 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హీరో ఆకాష్ పూరి అతిథిగా వచ్చారు. హీరో ఆకాష్ పూరి మాట్లాడుతూ, సినిమా ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. ప్రేక్షకులు తప్పకుండా ఈ మూవీకి కనెక్ట్ అవుతారు. టెక్నికల్ గా క్వాలిటీ మూవీ చేశారు. చంద్రశేఖర్ కథ రెడీ చేసుకుంటే నేను ఆయనతో సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఫైట్స్, కొరియోగ్రఫీ, ఎడిటింగ్, రచన, నిర్మాత దర్శకత్వం..ఇవన్నీ ఒక్కరే చేయడం ఈజీ కాదు. చంద్రశేఖర్ రాథోడ్ అమేజింగ్ వర్క్ చేశారు. సినిమా మంచి హిట్ కావాలని కోరుకుంటున్నా అన్నారు.నటుడు అభినవ్ జనక్ మాట్లాడుతూ రెండు గ్యాంగ్స్ మధ్య వార్ ను డైరెక్టర్ చంద్రశేఖర్ ఆకట్టుకునేలా డిజైన్ చేశాడు. ఈ చిత్రంలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేశాను. ఈ సినిమా మా అందరికీ మంచి పేరు తెస్తుందన్నారు. దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ గ్యాంగ్ స్టర్ సినిమా కొత్త కాన్సెప్ట్ తో రూపొందించినట్లు కనిపిస్తోంది. డైరెక్టర్ హీరో ప్రొడ్యూసర్ చంద్రశేఖర్ ఈ చిత్రాన్ని అన్ని కమర్షియల్ అంశాలతో రూపొందించారు. అందరినీ ఆకట్టుకునే సినిమా కావాలని కోరుకుంటున్నా అన్నారు. హీరో, దర్శక నిర్మాత చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ సినిమా మీద ప్యాషన్ తో గ్యాంగ్ స్టర్ సినిమాను రూపొందించాను. సినిమా తెరకెక్కించడం, హీరోగా నటించడం నా కల. ఈ చిత్రంతో ఆ డ్రీమ్ నిజమైంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా మంచి కమర్షియల్ ఎలిమెంట్స్ తో గ్యాంగ్ స్టర్ చిత్రాన్ని రూపొందించాను. మూవీని,మీరంతా చూసి ఎలా ఉందో మీ రెస్పాన్స్ తెలియజేస్తారని కోరుకుంటున్నా అన్నారు.

# నిద్ర సమయంలో వెన్నునొప్పి ఉందా.?



పేలవమైన జీవనశైలి కారణంగా వెన్నెముక బలహీనత అనేది సాధారణ ఫిర్యాదుగా మారుతోంది. అందుకే తిండి, పానీయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంటారు వైద్యులు. మీ ఆహారంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడానికి ప్రయత్నించండి. ఇది మీ వెన్నెముకను బలపరుస్తుంది. లేదంటే సమస్య మీరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే కొన్ని ఆహారలు అస్సలు తీసుకోవద్దు. ఇప్పుడు వెన్నునొప్పితో బాధపడేవారు దూరం పెట్టాల్సిన ఆహారాలు ఏంటో తెలుసుకుందాం.

అధిక ప్రొటీన్లు: ప్రొటీన్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలో ఎసిడిటీ పెరగడం మొదలవుతుంది. కాల్షియం టాయిలెట్ ద్వారా బయటకు వెళ్లిపోతుంది. అందువల్ల, పరిమిత పరిమాణంలో ప్రోటీన్ తినండి, అధిక ప్రోటీన్ ఎముకలను దెబ్బతీస్తుంది.

కార్బొనేటెడ్ డ్రింక్స్: దీర్ఘకాలంలో ఎముకలు ఆరోగ్యంగా, బలంగా ఉండాలంటే శీతల పానీయాలు, షాంపైన్ వంటి కార్బోనేటేడ్ డ్రింక్స్ తీసుకోవడం చాలా తక్కువగా ఉండాలి. ఈ రకమైన పానీయంలో ఫాస్ఫేట్ ఎక్కువగా ఉంటుంది. ఇది కాల్షియంను తగ్గించడం ద్వారా ఎముకలను బలహీనం చేస్తుంది.

గ్యాస్‌కు సంబంధించిన మందులు: అసిడిటీ మందుల వాడకాన్ని తగ్గించండి. ఇది కాల్షియం, మెగ్నీషియం, జింక్ వంటి ఖనిజాలను గ్రహించడం శరీరానికి కష్టతరం చేస్తుంది.

కెఫిన్ తీసుకోవడం: ఎముకలు దృఢంగా ఉండటానికి కెఫిన్‌ను నివారించండి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎముకలపై ప్రభావం చూపుతుంది. అలాంటి వారికి కాల్షియం కూడా ఎక్కువగా అవసరం. విటమిన్ డి లోపం: ఎముకలు దృఢంగా ఉండటానికి కాల్షియంతో పాటు విటమిన్ డి కూడా అవసరం. విటమిన్ డి ఎముకలకు కాల్షియం రవాణా చేయడంలో సహాయపడుతుంది. అందువల్ల, విటమిన్ డి అధికంగా ఉండే వాటిని కూడా తినండి.

పోషక లోపాలు: ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, టెస్టోస్టెరాన్ అవసరం. పెరుగుతున్న వయస్సుతో శరీరానికి అవసరమైన హార్మోన్లు, పోషకాలపై శ్రద్ధ వహించండి.

# ఇవి పిచ్చి ఆకులు కాదు.. దివ్యౌషధం



మారేడు ఆకులు (బిల్వపత్రం) మధుమేహ నియంత్రణలో అద్భుతమైన ప్రయోజనాలను కలిగి ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, రోగ నిరోధక శక్తిని పెంచడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో, చర్మ సమస్యలను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. ఆయుర్వేదంలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. కానీ, దీనిని సరైన విధంగా ఉపయోగించడం ముఖ్యం. ప్రపంచ వ్యాప్తంగా డయాబెటిస్ (మధుమేహం) బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.. అందుకే.. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవడం ఉత్తమం.. ఈ రోజుల్లో చాలా మంది అనారోగ్యకరమైన జీవనశైలి, చెడు ఆహారం కారణంగా మధుమేహం వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారు. అలాంటి వ్యాధులకు దివ్యౌషధం మారేడు ఆకు (బిల్వపత్రం).. దీనిని పూజలో ఉపయోగిస్తారు.. అంతేకాకుండా ఆయుర్వేద వైద్యంలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. మధుమేహం - కొలెస్ట్రాల్ తగ్గించడానికి దీనిని తినవచ్చు. బిల్వపత్రాన్ని డైలీ తీసుకోవడం వల్ల అనేక రకాల వ్యాధులు నయమవుతాయి. బిల్వపత్రంను మారేడు అంటారు. ఇది నీటిని శుద్ధి చేస్తుంది. కీళ్ల సంబంధవ్యాధులను, విరేచనాలను తగ్గిస్తుంది. రోగనిరోధకశక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. శరీర దుర్వాసనను, డయాబెటిస్ ను తగ్గిస్తుంది. అందుకే.. అనేక ఔషధాల తయారీలో మారేడును ఉపయోగిస్తారు. పూజలో ఉపయోగించే బిల్వపత్రంను తీసుకోవడం వల్ల మధుమేహం కొలెస్ట్రాల్‌ని నియంత్రించవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. బిల్వపత్రం వల్ల కలిగే లాభాలు - దానిని సరైన పద్ధతిలో తీసుకోవడం గురించి ఇప్పుడు తెలుసుకోండి..

మధుమేహంలో మేలు చేస్తుంది..

మధుమేహంలో బిల్వపత్రం చాలా మేలు చేస్తుంది. బిల్వ పత్రం (మారేడు) కషాయాలను తాగడం ద్వారా లేదా నమలడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇంకా ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

గుండె సమస్యలు..

ఈరోజుల్లో చాలా మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటివారికి బిల్వపత్రం చాలా మంచిది.. మారేడు తీసుకోవడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది.

చర్మ సమస్యలు దూరం..

మారేడు చర్మానికి చాలా మేలు చేస్తుంది.. వాస్తవానికి మారేడు యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది.. ఇవి చర్మ సమస్యలను దూరం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి.. మారేడు తీసుకోవడం వల్ల చర్మం మంట తగ్గుతుంది - ఇంకా మొటిమలను నయం చేస్తుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com